శనివారం
31-5-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 249
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

అక్షరాక్షరం అభ్యుదయం

నీళ్లపై రాజీ ప్రసక్తే లేదు: మునీర్

ఇస్లామాబాద్: నీళ్ల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ అసీమ్ మునీర్ స్పష్టంచేశారు. ఇది 24 కోట్ల పాకిస్థానీయులకు సంబంధించిన అంశమన్నారు. విశ్వవిద్యాలయాల వైస్‌చాన్సలర్లు, వివిధ కళాశాలల ప్రధాన అధ్యాపకులు, సీనియర్ టీచర్లతో సమావేశంలో జనరల్ మునీర్ మాట్లాడుతూ 'భారత్ ఆధిపత్యాన్ని పాకిస్థాన్ అంగీకరించదు. పాకిస్థాన్‌కు నీళ్లు రెడ్‌లైన్... దాంతో రాజీ పడే పరిస్థితి ఉండదు' అని సింధూ జలాల వివాదాన్ని ఉద్దేశించి అన్నారు. బలోచిస్థాన్‌లోని ఉగ్రవాదులకు భారత్ అండదండలు ఉన్నాయని మునీర్ ఆరోపించారు. బలోచ్ వేర్పాటువాదం పూర్తిగా విదేశీయులదేనని, స్థానికులకు సంబంధం లేదని మునీర్ చెప్పారు.

అంకితా భండారి కేసులో ముగ్గురికి జీవిత ఖైదు

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌లో సంచలనం సృష్టించిన హోటల్ రిసెప్షనిస్టు అంకితా భండారి (19) హత్య కేసులో ముగ్గురికి యావజ్జీవ శిక్ష పడింది. బీజేపీకి చెందిన మాజీ మంత్రి వినోద్ ఆర్య కుమారుడు, ఈ కేసులో ప్రధాన నిందితుడు పుల్కిత్ ఆర్యతో పాటు సౌరభ్ భాస్కర్, అంకిత్ గుప్తాకు జీవత ఖైదు విధిస్తూ కోర్టు ఉత్తర్వులు జారీచేసింది. దోషులకు రూ.50వేలు చొప్పున జరిమానా కూడా విధించింది. అంతేకాకుండా ముగ్గురు కలిసి అంకితా భండారి కుటుంబానికి రూ.4లక్షల పరిహారం చెల్లించాలని ఉత్తరాఖండ్ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి రీనా నేగి ఆదేశించారు. ఈ మేరకు వెలువడిన తీర్పు వివరాలను ప్రాసిక్యూషన్ న్యాయవాది అజయ్

- మిగతా 2 లో

అర్షద్ వార్సి దంపతులపై సెబీ నిషేధం

న్యూఢిల్లీ: బాలీవుడ్ నటుడు అర్షద్ వార్సి, ఆయన భార్య మారియా గోరెట్టితో పాటు మరో 57 మందిని సెక్యూరిటీస్ మార్కెట్ల నుంచి నిషేధిస్తూ సెక్యూరిటీస్, ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) ఆదేశాలిచ్చింది. సాధనా బ్రాడ్‌కాస్ట్ షేర్లు కొనుగోలు చేసేలా యూట్యూబ్ మాధ్యమంగా పెట్టుబడిదారులకు తప్పుడు సూచనలు చేసిన వ్యవహారం ఈ 59 మందిపై ఏడాది నుంచి ఐదేళ్ల వరకు నిషేధం విధించింది. అర్షద్ వార్సీ, మారియా గోరెట్టికి రూ.5 లక్షలు చొప్పున జరిమానా, ఏడాది

- మిగతా 2 లో

మందగించిన జీడీపీ

న్యూఢిల్లీ: దేశ స్థూల దేశీయ ఉత్పత్తి (జీడీపీ) వృద్ధి మందగించింది. 2024-25లో వార్షిక వృద్ధి రేటు 6.5 శాతానికి తగ్గింది. ఈ మేరకు శుక్రవారం విడుదలైన అధికారిక డేటా వెల్లడించింది. గత ఆర్థిక సంవత్సరంలో 9.2 శాతం వృద్ధితో పోలిస్తే క్షీణత నమోదైనట్లు తెలిపింది. కొవిడ్ తర్వాత ఈ స్థాయిలో జీడీపీ వృద్ధి నమోదు కాలేదు. కాగా, మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికానికి 7.4 శాతం వృద్ధి నమోదైనట్లు కేంద్ర గణాంకాల కార్యాలయం (ఎన్‌ఎస్‌ఓ) తెలిపింది. అంతకుముందు ఏడాది నాలుగో త్రైమాసికంలో 8.4 శాతంగా వృద్ధి నమోదైంది. 2024-25 ఆర్థిక

- మిగతా 2 లో

ఇదీ లోకం!

2023 ఉత్తమ చిత్రం బలగం

- 2022- సీతారామం... 2021- ఆర్ఆర్ఆర్
- 2014 నుంచి పదేళ్లకు గద్దర్ అవార్డుల ప్రకటన
- ప్రజాకవి కాళోజీకి స్పెషల్ జ్యూరీ అవార్డు
- బాలకృష్ణకు ఎన్టీఆర్ నేషనల్ ఫిల్మ్ అవార్డు
- యండమూరి సహా మరో ఐదుగురికి ప్రత్యేక అవార్డులు

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం 2014 నుంచి 2023 వరకు విడుదలైన సినిమాలకు గద్దర్ అవార్డులను ప్రకటించింది. ప్రముఖ సినీనటుడు, జ్యూరీ చైర్మన్ మురళీమోహన్ ఎఫ్‌డీసీ చైర్మన్, నిర్మాత దిల్‌రాజుతో కలిసి శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో అవార్డుల వివరాలను వెల్లడించారు. 2014 నుంచి 2023 వరకు విడుదలైన సినిమాలకు గద్దర్ అవార్డులను ప్రకటించారు. ఏడాదికి మూడు చిత్రాల చొప్పున ఉత్తమ సినిమాలకు అవార్డులను వెల్లడించారు. 2014 జూన్ 2 నుంచి సెన్సార్ అయిన సినిమాలను పరిగణనలోకి తీసుకున్నట్లు చెప్పారు. వీటితోపాటు సినీ రంగానికి సేవలు అందించిన వారికి ఆరు ప్రత్యేక అవార్డులు ఇస్తున్నట్లు తెలిపారు. ప్రజాకవి, దివంగత కాళోజీకి స్పెషల్ జ్యూరీ అవార్డును ప్రకటించారు.

సంవత్సరాల వారీగా ఉత్తమ చిత్రాలు:

2014: ప్రథమ ఉత్తమ చిత్రం: రన్ రాజా రన్, రెండో ఉత్తమ చిత్రం: పాఠశాల, మూడో ఉత్తమ చిత్రం : అల్లుడు శీను.

- మిగతా 2 లో

ప్రభుత్వ పథకాల అమలులో

ప్రగతి సాధించాలి

- సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవశ్యం
- భూ సమస్యలను తక్షణం పరిష్కరించాలి
- వక్ఫ్, ప్రభుత్వ భూముల వివరాలు అందుబాటులో ఉంచాలి
- సమీక్షా సమావేశంలో మంత్రులు దామోదర, జూపల్లి

విశాలాంధ్ర - హైదరాబాద్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులకు అందేలా చేయడం అధికారుల బాధ్యత అని, పైలెట్ మండలాల్లో భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులు భూ భారతి పోర్టల్ ద్వారా తక్షణం పరిష్కరించాలని జిల్లా ఇంచార్జి మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి మహబూబ్ నగర్ కలెక్టరేట్‌లో శుక్రవారం నారాయణపేట, మహబూబ్ నగర్ జిల్లాలలో వ్యవసాయ కార్యచరణ, వడ్ల కొనుగోలు, అంటువ్యాధులు, భూభారత్ రెవెన్యూ సదస్సులు, ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం పథకాల అమలుపై ఆయా జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు,సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా జిల్లాల శాసనసభ్యులు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, అనిరుద్ రెడ్డి, జి మధుసూదన్ రెడ్డి, వాకిటి శ్రీహరి, డాక్టర్ చిట్టెం పర్ణికా రెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, కలెక్టర్లు విజయేందిర బోయి, సిక్తా పట్నాయక్ హాజరయ్యారు. మంత్రి దామోదర మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరిత గతిన పూర్తి చేయించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో దేవదాయ, వక్ఫ్, శిఖం, అసైన్డ్ భూములు ఎన్ని ఉన్నాయన్నే వివరాలను అందుబాటులో ఉంచాలని, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. తమ జిల్లాలో మున్సిపాలిటీలు, పంచాయతీలలో ఫాగింగ్ యంత్రాలు లేవని కలెక్టర్ సిక్తా పట్నాయక్ మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. జూన్ మొదటి లేదా రెండో వారంలో వైద్య ఆరోగ్యశాఖపై నారాయణపేట, మహబూబ్ నగర్ లలో ప్రత్యేకంగా సమీక్షిస్తానని మంత్రి తెలిపారు. నారాయణపేట నుంచి మహబూబ్ నగర్ జిల్లా ఆస్పత్రికి వచ్చే రోగులను మహబూబ్ నగర్ నుంచి అంబులెన్స్ డ్రైవర్లు హైదరాబాద్ లోని వెల్‌నెస్ సెంటర్ కు తీసుకువెళ్తున్నారని మంత్రి రాజనర్సింహకు నారాయణపేట, మక్తల్ ఎమ్మెల్యే లు ఫిర్యాదు చేశారు. స్పందించిన మంత్రి అంబులెన్స్ డ్రైవర్ల వ్యవహారంపై విచారణ చేపట్టాలని ఆదేశించారు. పౌష్టికాహారం, విద్య, ఆరోగ్య అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ఆసుపత్రులను రెగ్యులర్ గా తనిఖీలు చేయాలని కలెక్టర్లు, జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రైవేట్ ఆసుపత్రులను ప్రతి నెల తనిఖీ చేసి రిపోర్టు తయారు చేయాలన్నారు. మహబూబ్ నగర్ జిల్లా ఆస్పత్రికి ఎం.ఆర్.ఐ, సి.టి. స్కాన్ త్వరలో ఏర్పాటు చేయిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. జాతీయ రహదారి పై ప్రతి 35 కిలో మీటర్ల కు ఒక ట్రామా సెంటర్, మహబూబ్ నగర్ లో రీజియనల్ క్యాన్సర్ సెంటర్ ను, ఆర్గాన్ రిట్రీవల్ సెంటర్ ను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. మంత్రి జూపల్లి మాట్లాడుతూ టాస్క్ పోర్స్ టీమ్‌లు తనిఖీలు

- మిగతా 2 లో

కృష్ణమ్మకు వరద మొదలు

- నైరుతి ప్రభావంతో ఎగువ ప్రాజెక్టులకు జలకళ
- జూరాల ప్రాజెక్టు 12 గేట్లు ఎత్తివేత
- శ్రీశైలం ప్రాజెక్టుకు 22 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ముందుగా రావడంతో కృష్ణానదికి వరద ప్రవాహం ప్రారంభమైంది. సహజంగా మే నెలలో కృష్ణానదిపై రిజర్వాయర్ల జలమట్టాలు డెడ్ స్టోరేజీకి చేరుకుంటాయి. అయితే మే నెల చివరిలోనే ఎగువ ప్రాజెక్టులకు వరద ప్రవాహం ప్రారంభం కావడం

- మిగతా 2 లో

ఏపీ డీఎస్సీ హాల్ టికెట్లు రెడీ

- 38 విభాగాలుగా పరీక్షలు
- 6వ తేదీ నుంచి నెల రోజుల నిర్వహణ

ఏపీ డీఎస్సీ 2025 హాల్ టికెట్లు డౌన్ లోడ్ చేసుకునేందుకు అవసరమైన మార్గదర్శకాలు జారీ చేశారు. పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్‌లో శుక్రవారం నుంచి వాటిని అందుబాటులో ఉంచారు.

2లో

మూడు రోజులు మోస్తరు వర్షాలు

ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : రానున్న మూడు రోజులు రాష్ట్రంలో మేఘావృత వాతావరణంతో పాటు అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. నైరుతి రుతుపవనాల ప్రభావంతో శుక్రవారం అనేక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయని పేర్కొంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల నాటికి విజయనగరం జిల్లా గుర్లలో 87.5మి.మీ, వైఎస్ఆర్ కడప జిల్లా సెట్టివారిపల్లిలో 87.5మి.మీ, విజయనగరం జిల్లా వేపాడలో 79.2 మి.మీ, నంద్యాల జిల్లా ముత్యాలపాడులో 79 మి.మీ, అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో 74 మి.మీ వర్షపాతం నమోదయిందని తెలిపారు. వచ్చే మూడు రోజుల్లోనూ అనేక ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశాలున్నాయని, శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం,

- మిగతా 2 లో

కిరీటం ఎవరిది?

నేడే మిస్ వరల్డ్ గ్రాండ్ ఫినాలే...

- తుది పోరుకు అట్టహాసంగా ఏర్పాట్లు
- ముస్తాబైన హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్
- సోనూ సూద్‌కు ప్రత్యేక పురస్కారం

విశాలాంధ్ర-హైదరాబాద్: అందరూ ఎప్పుడెప్పుడని ఎదురు చూసిన మిస్ వరల్డ్ పోటీలు తుది అంకానికి చేరుకున్నాయి. తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో శనివారం గ్రాండ్ ఫినాలే జరగనుంది. తుది పోరునకు అట్టహాసంగా ఏర్పాట్లు జరిగాయి. 'మిస్ వరల్డ్' బిరుదు ఎవరు దక్కించుకుంటారన్న ఉత్కంఠ నెలకొంది. ఫైనల్స్‌ను ప్రత్యక్షంగా వీక్షించేందుకు తెలంగాణ యువత ఉత్సాహంగా ఉంది. ఈ పోటీల్లో మొత్తం 108 మంది భామలు పాల్గొన్నారు. అందమే కాదు తెలివితేటలు, సామాజిక న్యాయం, సాంస్కృతిక మార్పిడి, ఉద్దేశం, నాయకత్వ లక్షణాల ఆధారంగా మిస్ వరల్డ్ ఎంపిక జరుగుతుంది. ప్రపంచ అందగత్తెగా కిరీటాన్ని చేజిక్కించుకునేందుకు నువ్వా నేనా అన్న రీతిలో సుందరీమణుల పోటీ సాగుతోంది. భారత్ తరపున నందినీ గుప్తా పోటీలో ఉన్నారు. ఆమె 2023 ఫెమినా మిస్ వరల్డ్ పోటీల్లో మిస్ వరల్డ్ ఇండియాగా నిలిచారు. కాగా, 72వ మిస్ వరల్డ్ పోటీల కోసం ప్రపంచ దేశాల నుంచి తెలంగాణకు వచ్చిన

- మిగతా 2 లో

సమష్టి కృషితో గ్రామాలు తీర్చిదిద్దుదాం

కూనంనేని

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైం: సమష్టి కృషితో నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దుదామని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. చుంచుపల్లి మండలం విద్యానగర్, వెంకటేశ్వర కాలనీ, రామాంజనేయ కాలనీ, ఎన్.కె.నగర్, నంద తండా పంచాయతీల పరిధిలో రూ.3.58 కోట్లతో చేపట్టనున్న రోడ్లు, డ్రెయినేజీల పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. పూర్తైన మరికొన్నింటిని ప్రారంభించారు. అనంతరం జరిగిన సభల్లో కూనంనేని మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజావసరాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పనులను పూర్తిచేస్తున్నామని తెలిపారు. మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టిసారించినట్లు చెప్పారు.తాగునీరు, విద్యుత్, రోడ్లు, డ్రెయినేజీలకు ప్రాధాన్యత కల్పిస్తున్నామన్నారు. సంక్షేమ పథకాలను పేదలకు చేరవేస్తున్నామని వివరించారు. నాణ్యతా ప్రమాణలతో పనులు చేపట్టేలా చూడాలని అధికారులకు సూచించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపీడీవో శుభాషిణి, ఎమ్మార్వో కృష్ణ, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె. సాబీర్ పాషా, సత్యనారాయణ, నాగేందర్, రాయల వెంకటేశ్వర్లు, రవి, నర్సింహారావు, గుప్తా, వసంత, శ్రీనివాసరెడ్డి, రమేష్, వాసిరెడ్డి మురళి, పొలమూరి శ్రీను, జక్రయ్య, భాగం మహేశ్వరరావు, భాగం మాధవరావు, రాంజీ, పౌల్, శ్రీనివాసరెడ్డి, బిక్కసాని నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలన అభివృద్ధికి దిక్సూచి

బ్రిడ్జ్ ఇండియా సదస్సులో కేటీఆర్

దృఢ నాయకత్వం, ప్రజల జీవితాలను మార్చాలన్న చిత్తశుద్ధి ఉంటే అద్భుతమైన ప్రగతి సాధ్యమని తెలంగాణా నిరూపించిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు (కేటీఆర్) అన్నారు.

2లో

ఒకే షిఫ్ట్‌లో నీట్ పీజీ పరీక్ష: సుప్రీం

న్యూఢిల్లీ: నీట్ పీజీ-25 ప్రవేశ పరీక్ష విషయంలో సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఒకే షిఫ్ట్‌లో పరీక్ష నిర్వహించాలని ఆదేశాలు ఇచ్చింది. ఈ ప్రవేశ పరీక్షను జూన్ 15న రెండు విడతల్లో నిర్వహించి, జులై 15న ఫలితాలు విడుదల చేస్తామని నేషనల్ ఎగ్జామినేషన్ బోర్డ్ (ఎన్ఈబీ) ప్రకటించిన నేపథ్యంలో ఈ ఆదేశాలు వచ్చాయి. పరీక్షను రెండు విడతల్లో నిర్వహించడం వల్ల ప్రశ్నల క్లిష్టత స్థాయి మారి కొందరు విద్యార్థులు నష్టపోయే అవకాశం ఉందని ఎన్ఈబీ నిర్ణయంపై ఆందోళన వ్యక్తమైంది. అందుకే దానిని ఒకేవిడతలో నిర్వహించేలా బోర్డ్‌ను ఆదేశించాలని కోరుతూ సుప్రీంలో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వాటిపై విచారణ జరిపిన కోర్టు ఈ ఆదేశాలు ఇచ్చింది. అయితే ఒకే షిఫ్ట్‌లో పరీక్ష నిర్వహణ కోసం కేంద్రాలు, సమయం సరిపోదంటూ ఎన్ఈబీ వినిపించిన వాదనను సుప్రీం తోసిపుచ్చింది. జూన్ 15న పరీక్ష నిర్వహణ కోసం ఏర్పాట్లు చేసేందుకు తగిన సమయం ఉందని వ్యాఖ్యానించింది.



ఉగ్రవాదులు హతమైతే సంతాపమా

కొలంబియా ప్రభుత్వ తీరుపై శశిథరూర్

ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌లో ప్రాణాలు కోల్పోయిన వారికి కొలంబియా ప్రభుత్వం సంతాపం తెలపడంపై కాంగ్రెస్ నాయకుడు శశిథరూర్ అసహనం వ్యక్తం చేశారు.

5లో

రూ.6.36 లక్షల కోట్ల బ్యాంకు మోసాలు

ప్రభుత్వ రక్తంలో మోసం, నకిలీ: ఖడ్గే

న్యూఢిల్లీ: గడిచిన 11 ఏళ్ల నుంచి దేశంలో బ్యాంకు మోసాలు పెరిగిపోయాయని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖడ్గే విమర్శించారు. మోసాలు, నకిలీలు ప్రభుత్వం రక్తంలో ఇమిడిపోయాయని ఆరోపించారు. 11 ఏళ్ల మోదీ పాలనలో సుమారు 6 లక్షల 36 వేల 992 కోట్ల మేర బ్యాంకు మోసాలు జరిగాయని... ఆ మోసాలు 416 శాతం పెరిగినట్లు ఆయన పేర్కొన్నారు. పెద్ద నోట్ల రద్దయిన ఆరేళ్ల తర్వాత కూడా నకిలీ 500 నోట్లు చెలామణి అవుతున్నాయని, ఇది 291 శాతం పెరిగినట్లు ఖడ్గే తెలిపారు.

ఈ ఏడాది నకిలీ నోట్లు మార్కెట్లోకి అత్యధిక స్థాయిలో వచ్చినట్లు ఖడ్గే ఆందోళన వ్యక్తం చేశారు. రక్తనాళాల్లో సిందూరం ప్రవహిస్తున్నట్లు ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ... మీ రక్తనాళాల్లో ఏం ఉందో మాకు తెలియదని, కానీ మీ ప్రభుత్వ రక్తనాళాల్లో మాత్రం ఫ్రాడ్, ఫేక్ ఉన్నాయని ఖడ్గే ఎద్దేవా చేశారు.

కెనడాలో కార్చిచ్చు... ఎమర్జెన్సీ



ఒట్టావా: కెనడాలో కార్చిచ్చు బీభత్సం సృష్టిస్తోంది. దీంతో సస్కెట్చీవాన్,మాంటోబా ప్రావిన్స్‌లలో ఎమర్జెన్సీ ప్రకటించారు. మాంటోబా నుంచి 17,000 మందిని, సస్కెట్చీవాన్ ప్రావిన్స్ నుంచి 4వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. 6,69,000 ఎకరాల్లో కార్చిచ్చు వ్యాపించింది. మాంటోబా ప్రావిన్స్‌లో 1,73,000 ఎకరాలు కాలి బూడిదయ్యాయి. ఈ స్థాయి కార్చిచ్చు ఎన్నడూ చూడలేదని, రెండు-మూడు రోజులు ఎడతెరిపి లేకుండా వర్షం పడితే తప్ప పరిస్థితి అదుపులోకి వచ్చేలా లేదని అధికారులు అన్నారు. కార్చిచ్చు మరింతగా వ్యాపిస్తుండటంతో ఆయా ప్రాంతాల ప్రజలను ఖాళీ చేయించేందుకు కెనడా వైమానిక దళం రంగంలోకి దిగింది. ఈ కార్చిచ్చు కారణంగా వెలువడుతున్న పొగ పక్కనే ఉన్న అమెరికాలోని మిన్నెసోటా, మిషిగాన్ తదితర రాష్ట్రాలకు వ్యాపిస్తుండటంతో వాయు కాలుష్యంపై ఆందోళన పెరుగుతోంది. కెనడా కార్చిచ్చుల కారణంగా అమెరికా ప్రజలు శ్వాసకోశ సమస్యలను ఎదుర్కొంటున్నట్లు 'ది అమెరికన్ లంగ్ అసోసియేషన్' ఇచ్చిన 'స్టేట్ ఆఫ్ ది ఎయిర్ రిపోర్ట్-2025' పేర్కొంది.

ట్రంప్ సుంకాలపై అనుకూల తీర్పు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన సుంకాలపై ఓ కోర్టు అనుకూలంగా తీర్పునిచ్చింది. సుంకాలు అమలు కాకుండా ట్రేడ్ కోర్టు నిలిపి వేయడంతో పై కోర్టుకు వెళ్లిన ట్రంప్ ప్రభుత్వానికి ఊరట లభించింది. ప్రభుత్వ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకొని దిగువ కోర్టు తీర్పును నిలిపివేస్తున్నట్లు న్యాయస్థానం తాజా ఉత్తర్వుల్లో పేర్కొంది. జూన్ 5లోగా ఫిర్యాదుదారులు, జూన్ 9లోగా ప్రభుత్వం తమ వైఖరి తెలపాలని ఆదేశించింది. ఏప్రిల్ 2న 'లిబరేషన్ డే' పేరుతో ట్రంప్ సుంకాలు విధించడంతోపై న్యూయార్క్‌లోని అమెరికా అంతర్జాతీయ వాణిజ్య కోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. దీనిపై విచారించిన న్యాయస్థానం సుంకాల విధింపునకు కత్తెర వేసింది. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే అంతర్జాతీయ ఆర్థిక అధికారాల చట్టం కింద అధ్యక్షుడికి ప్రపంచ దేశాలపై ఆర్థిక ఆంక్షలు విధించే అవకాశం ఉంటుందని తేల్చిచెప్పింది.

150 రోజుల వరకు 15శాతం సుంకాలు...

ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టం ప్రకారం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలపై సుంకాల విధింపునకు పరిమితి నిర్దేశించాలని ట్రంప్ ప్రభుత్వం భావిస్తోంది. 150 రోజుల వరకు 15శాతం సుంకం విధించే యోచనలో ఉంది. అయితే దీనిపై తుది నిర్ణయం జరగలేదు. ట్రేడ్ కోర్టు నిలుపుదల చేసిన సుంకాల అమలునకు ఫెడరల్ అప్పీల్స్ కోర్టు అనుమతి ఇవ్వడంతో త్వరలోనే నిర్ణయం వెలువడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

అమెరికా ప్రతిపాదనకు హమాస్ తిరస్కృతి

జెరూసలేం/వాషింగ్టన్: గాజాలో కాల్పుల విరమణ, బందీల విడుదల కోసం అమెరికా ప్రతిపాదనలను హమాస్ శుక్రవారం తిరస్కరించింది. అమెరికా ప్రతినిధి స్టీవ్ విట్కాఫ్‌తో జరిపిన చర్చల్లోని అంశాలకు ఈ ప్రతిపాదనలోని అంశాలు పూర్తి వ్యతిరేకంగా ఉన్నట్లు పేర్కొంది. గాజాలో 60 రోజుల కాల్పుల విరమణ కోసం అమెరికా ప్రతిపాదించింది. ఇందుకు ఇజ్రాయిల్ అంగీకరించినట్లు శ్వేతసౌధం వెల్లడించింది. ఈ ప్రతిపాదన ప్రకారం 1,236 మంది పలస్తీనా ఖైదీలను, చనిపోయిన 180 మంది పలస్తీనియన్ల మృతదేహాలకు బదులుగా 28 మంది ఇజ్రాయిలీ బందీలను (ప్రాణాలతో ఉన్నా... లేకున్నా) తొలి వారంలో అప్పగించాలని సూచించింది. కాల్పుల విరమణ ఒప్పందంపై హమాస్ సంతకాలు జరిగిన వెంటనే గాజాకు మానవతా సాయం అందించాలని ప్రతిపాదన పత్రం పేర్కొంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో పాటు ఈజిప్టు, ఖతార్ మధ్యవర్తులు ఈ ప్రతిపాదనను ఆమోదించినట్లు తెలుస్తోంది. దీని ప్రకారం గాజాకు మానవతా సాయాన్ని ఐక్య రాజ్య సమితి, రెడ్ క్రెసెంట్ సహా సంబంధిత ఇతర మాధ్యమాల ద్వారా అందిస్తారు. అమెరికా ప్రతిపాదనకు ఇజ్రాయిల్ అంగీకరించినట్లు శ్వేతసౌధం వెల్లడించింది. ఇదే విషయాన్ని గాజాలో బందీగా ఉన్న వారి కుటుంబాలతో ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కూడా చెప్పినట్లు తెలిసింది. అయితే ఈ ప్రతిపాదనను హమాస్ తిరస్కరించింది.ఇదిలావుంటే, విట్కాఫ్ ఇటీవల తెచ్చిన కాల్పుల విరమణ ప్రతిపాదన ప్రకారం హమాస్ సజీవంగా ఉన్న 10 మంది బందీలను అప్పగించడంతో పాటు.. 18 మంది మృతదేహాలను కూడా ఇవ్వాలి. రెండు దశల్లో ఇది జరగాలి. అందుకు బదులుగా ఇజ్రాయిల్ 60 రోజులు కాల్పుల విరమణను పాటిస్తుంది.అలాగే పలస్తీనా ఖైదీలను అప్పగిస్తుంది. కాగా, హమాస్ వద్ద ఉన్న 58 మంది బందీలలో 20 మంది ప్రాణాలతో ఉన్నారని ఇజ్రాయిల్ నమ్ముతోంది.

కలిసి పనిచేసే సమయం ఆసన్నం

భారత్, చైనాకు రష్యా సూచన

మాస్కో: రష్యా, చైనా, భారత్ కలిసి పనిచేసేందుకు సమయం ఆశన్నమైందని మాస్కో విదేశాంగ మంత్రి సర్గీ లావ్రోవ్ అన్నారు. మూడు దేశాలు ఉమ్మడిగా ముందుకెళ్లేందుకుగాను చాలా ఏళ్ల కిందట ఏర్పడిన 'రిక్' (రష్యా, ఇండియా, చైనా) ఫార్మాట్ పునరుద్ధరణపై తాము ఆసక్తిగా ఉన్నట్లు చెప్పారు. లావ్రోవ్... ఉరల్ పర్వతాలలోని పెర్మ్ నగరంలో పర్యటించారు. భద్రత, సహకారానికి సంబంధించి అక్కడ ఏర్పాటు చేసిన అంతర్జాతీయ సామాజిక, రాజకీయ సమావేశంలో పాల్గొన్నారు. సెర్గీ లావ్రోవ్ మాట్లాడుతూ 'ఉద్రిక్తతలు పరిష్కరించుకునే దిశగా భారత్, చైనా అవగాహనకు వచ్చిన క్రమంలో 'రిక్' పునరుద్ధరణకు సమయం ఆసన్నమైంది' అని అన్నారు. భారత్‌ను చైనాకు చైనాకు వ్యతిరేకంగా మార్చేందుకు నాటో యత్నిస్తోందని ఆరోపించారు. రెండు దేశాలను రెచ్చగొట్టే ధోరణిగా దీనిని పరిగణించవచ్చని ఆయనన్నారు.

కిరీటం ఎవరిది?

(మొదటిపేజీ తరువాయి)

అందాల భామలు సుమారు 20 రోజుల పాటు వివిధ కార్యక్రమాల్లో పాల్గొని తమ ప్రతిభ చాటుకున్నారు. ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలను సందర్శించారు. 'తెలంగాణ జరూర్ ఆనా' (తప్పకుండా తెలంగాణకు రండి) నినాదాన్ని ప్రపంచవ్యాపితం చేశారు.

'మిస్ వరల్డ్-2025' కోసం తెలంగాణ ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసింది. ఫైనల్స్‌ను అట్టహాసంగా నిర్వహిస్తోంది.ఈ కార్యక్రమానికి వ్యాఖ్యతలుగా మిస్ వరల్డ్-2016 స్టెఫానీ డెల్ వాలె, భారతీయ ప్రెజెంటర్ సచిన్ కుంభర్ వ్యవహరిస్తారు. బాలీవుడ్ తారలు జాక్వెలిన్ ఫెర్నాండెజ్, ఇషాన్ ఖట్టర్ తదితరులు తమ ప్రదర్శనలతో అదరగొట్టనున్నారు.

మిస్ వరల్డ్ న్యాయ నిర్ణేతల్లో ప్రముఖ మానవతావాది, నటుడు సోనూ సూద్, సుధా రెడ్డి, డాక్టర్ కరినా టర్రెల్ (మిస్ ఇంగ్లాండ్-2014), మిస్ వరల్డ్ సీఈఓ జూలియా మోర్లీ ఉన్నారు. మిస్ వరల్డ్-2017, బాలీవుడ్ నటి మానుషి చిల్లర్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు. ఈ అందాల పోటీల్లో భాగంగా నటుడు సోనూ సూద్‌కు 'మిస్ వరల్డ్ హ్యూమానిటేరియన్ అవార్డు'తో సన్మానిస్తారు. మిస్ వరల్డ్ 2025 గ్రాండ్ ఫినాలే 'సోనీ లివ్'లో ప్రసారం ప్రత్యక్ష ప్రసారమవుతుంది. 'డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.వాచ్ మిస్ వరల్డ్.కామ్' వెబ్‌సైట్ ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు అవకాశం కల్పించారు.

108 మంది పోటీదారులలో ప్రతి ఖండం (అమెరికా, కరీబియన్, ఆఫ్రికా, యూరప్, ఆసియా, ఓషియానియా) నుంచి 10 మంది సెమీ ఫైనలిస్టులు కాగా 40 మంది క్వార్టర్ ఫైనల్స్‌కు చేరతారు. కొందరు ఫాస్ట్-ట్రాక్ ఛాలెంజ్‌ల ద్వారా క్వార్టర్ ఫైనల్స్‌కు వచ్చారు.హెడ్ టు హెడ్ ఛాలెంజ్ ద్వారా అన్నాలిసే నాంటన్ (త్రినిటాడ్-టొబాగో), టాప్ మోడల్ ద్వారా ఆరెలీ జోకిమ్ (మార్టినిక్), బ్యూటీ విత్ ఎ పర్పస్ ద్వారా వలెరియా పెరెజ్ (ప్యూర్టో రికో), మల్టీ మీడియా అవార్డు ద్వారా మైరా డెల్గాడో (డొమినికన్ రిపబ్లిక్) ఎంపికయ్యారు.

అలాగే, ఫైత్ బ్వాల్యా (జాంబియా), టాప్ మోడల్ ద్వారా సెల్మా కమన్య (నమీబియా), బ్యూటీ విత్ ఎ పర్పస్ ద్వారా నటాషా న్యోన్యోజి (ఉగాండా), మల్టీ మీడియా అవార్డు ద్వారా ప్రిన్సెస్ ఇస్సీ (కామెరూన్), యూరప్ నుంచి స్పోర్ట్ ఛాలెంజ్ ద్వారా ఎలిసే రండ్మా (ఎస్టోనియా), హెడ్ టు హెడ్ ఛాలెంజ్‌తో పాటు బ్యూటీ విత్ ఎ పర్పస్ ద్వారా మిల్లీ మే ఆడమ్స్ (వేల్స్), టాప్ మోడల్ ద్వారా జాస్మిన్ గెర్హార్ట్ (ఐర్లాండ్), మల్టీ మీడియా అవార్డ్ ద్వారా ఆండ్రియా నికోలిచ్ (మాంటెనెగ్రో), ఆసియా- ఓషియానియాకు ప్రాతినిధ్యం వహించే వారిలో టాలెంట్ అండ్ బ్యూటీ విత్ ఎ పర్పస్ ద్వారా మోనికా కెజియా సెంబిరింగ్ (ఇండోనేషియా), హెడ్ టు హెడ్ ఛాలెంజ్ ద్వారా ఇడిల్ బిల్గెన్ (టర్కీ), టాప్ మోడల్ ద్వారా నందిని గుప్తా (భారతదేశం), మల్టీ మీడియా అవార్డు ద్వారా ఓపల్ సుచాతా (థాయిలాండ్) క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నారు. మిగిలిన సెమీఫైనలిస్టులను వ్యక్తిగతంగా ఇంటర్వ్యూ చేయడం ద్వారా జూరీ ఎంపిక చేస్తుంది. టాప్ 5గా ఎంపికయ్యే వారు చివరి ప్రశ్నకు ఇచ్చే సమాధానం ఆధారంగా మిస్ వరల్డ్ ఎన్నికవుతారు. విజేతకు మిస్ వరల్డ్ కిరీటాన్ని మాజీ క్రిస్టినా పిస్కోవా (71వ మిస్ వరల్డ్) అందజేస్తారు.

ప్రభుత్వ పథకాల అమలులో ప్రగతి సాధించాలి

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించి నకిలీ విత్తనాలు అమ్మేవారిపై కేసులు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎంత మంది రైస్ మిల్లర్లు ప్రభుత్వానికి సి.ఎం.ఆర్ బకాయిలు ఉన్నారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. మహబూబ్ నగర్ లో 2023-24కు సంబంధించి ఒక మిల్లర్ రూ.3.7 కోట్ల బకాయిలు ఉన్నారని, నారాయణపేట లో 10 రైస్ మిల్లర్ల నుంచి 2019-20 నుంచి ఇప్పటిదాకా రూ.53 కోట్ల బకాయి ఉన్నారని అధికారులు వివరించగా.... వారి నుంచి కలెక్టర్లు రికవరీ చేయాలని ఆదేశించారు. ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ... నియోజకవర్గాల వారీగా ఈ యాసంగిలో ఎంత మంది రైతులతో ఎంత ధాన్యం కొనుగోలు చేశాం, ఎంత మంది రైతులకు బోనస్ వచ్చిందనే వివరాలను,పంట నష్టం ఎంత జరిగింది,నష్ట పరిహారం వచ్చిన వివరాలను, వరి సేకరణ నియోజకవర్గం వారీగా వివరాలు ఎమ్మెల్యేలకు పంపించేలా చూడాలని మంత్రులను కోరారు. తహసీల్దార్, ఆర్డీవో, అదనపు కలెక్టర్ తమ దగ్గరకు వచ్చిన దరఖాస్తులు నిర్దేశిత సమయం లోగా పరిష్కారం చేయాలన్నారు. ప్రభుత్వ భూములు,అన్యాక్రాంతం భూములు వివరాల కోసం ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసి టోల్ ఫ్రీ నంబర్ ,వాట్సాప్ నెంబర్ ప్రజలకు తెలపాలని మంత్రి జూపల్లి కలెక్టర్లకు సూచించారు. యెన్నం మాట్లాడుతూ... గతంలో ప్రతి నియోజకవర్గంలో ఎమ్మెల్యే చైర్మన్ గా ప్రభుత్వ భూముల పంపిణీ కి ఒక అసైన్డ్ కమిటీ ఉండేదని, ఆ కమిటీని పునరుద్ధరించాలని మంత్రులను కోరారు. కోయిలకొండ పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది కొరత ఉందని ఎమ్మెల్యే చిట్టెం పర్నికా రెడ్డి మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. బేస్ మెంట్ వేసుకున్న నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని వర్తింప చేయాలని మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి కోరారు. గండీడ్ మండలంలో బీపీ, షుగర్ మాత్రలను పంపిణీ చేయడం లేదని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మంత్రికి ఫిర్యాదు చేశారు. మహబూబ్ నగర్ జిల్లా అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, మోహన్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ రెడ్డి, ముడ చైర్మన్ లక్ష్మణ్ యాదవ్ పాల్గొన్నారు.

మూడు రోజులు మోస్తరు వర్షాలు

(మొదటిపేజీ తరువాయి)

అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అన్నమయ్య జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. అలాగే కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, వైఎస్సార్ కడప, అనంతపురం, శ్రీసత్యసాయి, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది.

అంకితా భండారి కేసులో ముగ్గురికి జీవిత ఖైదు

(మొదటిపేజీ తరువాయి)

పంత్ వెల్లడించారు. ఈ కేసు విచారణ రెండేళ్ల ఎనిమిది నెలలు సాగిందన్నారు. అయితే ఈ కేసులో ముందస్తు దర్యాప్తులో వైఫల్యం, రాజకీయ ఒత్తిడి కారణంగా పక్కదోవ పట్టిస్తున్నారంటూ ఆరోపణలు కూడా వచ్చాయి. మొత్తం 97 మందిని సాక్షులుగా పేర్కొంటూ సిట్ చార్జిషీటు దాఖలైంది. అయితే 97లో నుంచి 47 మంది పేర్లను 2023, మార్చి 28న తొలగించారు. వాదనలు ముగిసిన తర్వాత ముగ్గురిని దోషులుగా తేల్చిన సెషన్స్ కోర్టు వారికి యావజ్జీవ కారాగార శిక్ష విధించింది.

అర్షద్ వార్సి దంపతులపై సెబీ నిషేధం

(మొదటిపేజీ తరువాయి)

పాటు మార్కెట్ నిషేధాన్ని విధిస్తూ సెబీ ఉత్తర్వులు జారీచేసింది. సాధనా బ్రాడ్‌కాస్ట్ (ప్రస్తుతం క్రిస్టల్ బిజినెస్ సిస్టమ్ లిమిటెడ్) ప్రమోటర్లు సహా 57 మందిపై రూ.5 లక్షల నుంచి రూ.5 కోట్ల వరకు జరిమానాలను సెబీ విధించింది. అర్షద్ వార్సి రూ.41.70 లక్షల వరకు, ఆయన భార్య రూ.50.35 లక్షల వరకు లాభాలు గడించినట్లు పేర్కొంది. 59 మంది మొత్తంగా రూ.58.01 కోట్ల వరకు లబ్ధి పొందినట్లు తెలిపింది. ఈ ఆపరేషన్ సూత్రధారులుగా గౌరవ్ గుప్తా, రాకేశ్ కుమార్ గుప్తా, మనీశ్ మిశ్రాను గుర్తించింది. మనీశ్ మిశ్రాకు, మిగతా ప్రమోటర్లకు మధ్యవర్తిగా సాధనా బ్రాడ్‌కాస్ట్ లిమిటెడ్ ఆర్‌టీఏ డైరెక్టర్ సుభాశ్ అగర్వాల్ అప్పట్లోవ్యవహరించినట్లు సెబీ పేర్కొంది.

మందగించిన జీడీపీ

(మొదటిపేజీ తరువాయి)

సంవత్సరానికి ఎన్ఎస్ఓ వెలువరించిన రెండో మందస్తు అంచనాల్లో దేశ జీడీపీ 6.5 శాతం వృద్ధి చెందొచ్చని పేర్కొంది. ప్రపంచంలోనే నాల్గో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలుస్తోందని, నాలుగు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారిందని, జపాన్‌ను వెనక్కి నెట్టిందని నీతి ఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రహ్మణ్యం ఇటీవల ప్రకటించిన క్రమంలో తాజా జీడీపీ వృద్ధి గణాంకాలు చర్చకు దారితీశాయి. ఇదిలావుంటే, జనవరి నుంచి మార్చి వరకు 5.4 శాతం వృద్ధిని చైనా నమోదు చేసింది.

ఆ ఉగ్రవాదులు బీజేపీలో చేరతారేమో: సంజయ్ రౌత్

ముంబై: శివసేన (ఉద్ధవ్ ఠాక్రే వర్గం) ఎంపీ సంజయ్ రౌత్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పహల్గాంలో కిరాతకానికి పాల్పడిన ఉగ్రవాదులను నెల దాటినా పట్టుకోకపోవడంపై మోదీ సర్కారును దునుమాడారు. పహల్గాం ఉగ్రదాడికి పాల్పడిన ఆ ఆరుగురు ఉగ్రవాదులను పట్టుకోలేకపోయారంటే... వాళ్లు బీజేపీలో చేరవచ్చునని ఆయన వ్యాఖ్యానించారు. ఏదో ఒక రోజు ఆరుగురు ఉగ్రవాదులను బీజేపీలో చేర్చుకుంటున్నట్లు పత్రికా ప్రకటన చేస్తుందని రౌత్ ఆరోపించారు. రౌత్ ఆరోపణలను బీజేపీ నిరసించింది. ఆయనను పిచ్చాస్పత్రిలో చేర్చాలని వ్యాఖ్యానించింది.

ఏపీ డీఎస్సీ హాల్ టికెట్లు రెడీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఏపీ డీఎస్సీ 2025 హాల్ టికెట్లు డౌన్ లోడ్ చేసుకునేందుకు అవసరమైన మార్గదర్శకాలు జారీ చేశారు. పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్‌లో శుక్రవారం నుంచి వాటిని అందుబాటులో ఉంచారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు వారి రిజిస్ట్రేషన్ నంబర్, పుట్టిన తేదీతో హ్టిజూం://ఖుజూ౦ం౦ఎఖుజూఎటం౦.ఱఅ ద్వారా లాగిన్ అయి వారి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. డీఎస్సీ పరీక్షలు జూన్ 6 నుంచి జులై 6 వరకు కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానంలో నిర్వహిస్తారు. ఈ పరీక్ష ద్వారా ఏపీ విద్యాశాఖలో ఖాళీగా ఉన్న 16,347 పోస్టులను కూటమి ప్రభుత్వం భర్తీ చేయనుంది. స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ), సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్‌జీటీ), ట్రయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ (టీజీటీ), పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ (పీజీటీ), ప్రిన్సిపాల్స్ పోస్టులు ఖాళీను ఆయా సబ్జెక్టులు, విభాగాల వారీగా భర్తీ చేయనున్నారు. ఈ పరీక్షకు 5.6 లక్షలకు పైగా అభ్యర్థులు దరఖాస్తు చేయడంతో పోటీ తీవ్రంగా ఉంది. డీఎస్సీ పరీక్షల ప్రాథమిక కీను జులై 8న విడుదల చేస్తారు. ఫలితాలు 2025 చివరి వారంలో వెలువడతాయి. 39 విభాగాలతో పరీక్షలు జరగనున్నాయి.

ఇందులో ఎస్‌జీటీలో సబ్జెక్టుల వారీగా, పీజీటీ ప్రిన్సిపాల్, టీజీటీ విభాగంలో సోషల్, ఫిజికల్ సైన్సెస్, మ్యాథ్స్, బయాలజికల్ సైన్సెస్, పీజీటీ విభాగంలో బయాలజికల్ సైన్సెస్, బోటనీ, పీజీటీ కామర్స్, ఎకనామిక్స్, ఇంగ్లీషు, మ్యాథ్స్, ఫిజికల్ సైన్సెస్, సోషల్, తెలుగు, జువాలజీ, టీజీటీ ప్రొఫెసెన్సీ టెస్ట్, ప్రొఫెసెన్సీ టెస్ట్ ప్రిన్సిపాల్, ప్రిన్సిపాల్, ప్రొఫెసెన్సీ టెస్ట్ పీజీటీ, టీజీటీ ఇంగ్లీషు, టీజీటీ హిందీ, టీజీటీ సంస్కృతం, టీజీటీ తెలుగు, ఎస్ఏ విభాగంలో తమిళం, ఒడియా, ఎస్ఏ, ఉర్దూ, సోషల్ స్టడీస్, బయాలజికల్ సైన్స్, ఫిజికల్ సైన్స్, మ్యాథ్స్, సంస్కృతం, హిందీ, ఇంగ్లీషు, తెలుగు, హిందీ, సంస్కృతం, వ్యాయామ విభాగంలో పీఈటీ పరీక్షలను నెల రోజులపాటు నిర్వహిస్తారు. వాటికి సంబంధించిన మాక్ టెస్టులను పాఠశాల విద్యాశాఖ వెబ్ సైట్‌లో అందుబాటులో ఉంచారు.

కృష్ణమ్మకు వరద మొదలు

(మొదటిపేజీ తరువాయి)

గమనార్హం. ప్రస్తుతం జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి భారీ వరద వచ్చి చేరుతుండడంతో... ప్రాజెక్టుకున్న 12 గేట్లు ఎత్తి 88 వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. సుంకేశుల జలాశయం నుంచి 8,824 క్యూసెక్కుల వరద దిగువ ప్రాజెక్టులకు వస్తోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం శుక్రవారం సాయంత్రానికి 818.3 అడుగులుగా ఉంది. నీటి నిల్వ 39.61 టీఎంసీలుగా నమోదైంది. ప్రస్తుతం శ్రీశైలం ప్రాజెక్టుకు 21,252 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా... 800 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదలవుతోంది. దిగువనున్న నాగార్జున సాగర్ ప్రాజెక్టులో ప్రస్తుతం నీటి నిల్వ 135.78 టీఎంసీలుండగా, 7,950 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరుతోంది. కర్నాటక- తెలంగాణ సరిహద్దుల్లో కురుస్తున్న వర్షాలతో జూరాల ప్రాజెక్టుకు మాత్రమే వరద వస్తుండగా, దానికి ఎగువన ఉన్న కర్నాటకలోని నారాయణపూర్‌కు మాత్రం ప్రవాహమేదీ లేదు. సాధారణంగా జూన్ తరువాత ఈ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద వస్తూ ఉంటుంది. దీనికి భిన్నంగా మే నెలలో వరదలు రావడం విశేషం. జూరాల ప్రాజెక్టు వద్ద రెండు విద్యుత్ యూనిట్లు, దిగువ జూరాల విద్యుత్ కేంద్రంలో ఒక యూనిట్ ద్వారా జలవిద్యుత్ ఉత్పత్తి ప్రారంభించారు. జూరాల పూర్తిస్థాయి నిల్వ సామర్థ్యం 9.65 టీఎంసీలు. ఇటీవల ఈ ప్రాజెక్టులో నీటిమట్టం పడిపోయి తాగునీటికి ముప్పు వచ్చే ప్రమాదాన్ని గమనించి ఐదు టీఎంసీలు విడుదల చేయాలని కర్నాటక ప్రభుత్వాన్ని తెలంగాణ కోరగా... ఆ రాష్ట్ర ప్రభుత్వం ఒక టీఎంసీ నీరు విడుదల చేసింది. ఈ పరిస్థితుల్లో మే నెలలో ప్రాజెక్టుకు భారీ వరద రావడం, చివరకు గేట్లు ఎత్తి దిగువకు వదిలే పరిస్థితులు నెలకొనడం దాదాపు రెండు దశాబ్దాల తర్వాత అరుదైన పరిణామంగా అధికారులు పేర్కొంటున్నారు. ఇక కృష్ణానదికి టెయిల్ ఎండ్ ప్రాంతంలో ఉన్న ప్రకాశం బ్యారేజీకి కూడా ఎగువున కురుస్తున్న వర్షాల కారణంగా 2 వేల క్యూసెక్కుల వరద వస్తోంది. ప్రస్తుతం ప్రాజెక్టు నీటి సామర్థ్యం పూర్తిస్థాయిలో 3.7 టీఎంసీలు ఉండడంతో... ఎగువ నుంచి వస్తున్న వరద నీటిని అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు.

ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి ఏమైనా చేస్తాం

రాజ్‌నాథ్ సింగ్

పనాజీ: స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి భారత్‌కు వ్యతిరేకంగా పాకిస్థాన్ ఆడుతున్న ఉగ్రవాదం అనే 'ప్రమాదకరమై ఆట' ఇక ముగిసిందని ఆ దేశం ఇకనైనా అర్థం చేసుకుంటే మంచిదని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హెచ్చరించారు. ఆపరేషన్ సిందూర్ దెబ్బతో పాకిస్థాన్ కాళ్లబేరానికి వచ్చిందని, భారతదేశాన్ని దాడులు చేయకుండా ఆపమని ప్రపంచాన్ని వేడుకుందని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. గోవాలోని విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్‌లో, నావికాదళ సభ్యులతో శుక్రవారం ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పాకిస్థాన్‌కు గట్టి హెచ్చరిక చేశారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి భారత్ ఏమాత్రం వెనుకాడదని స్పష్టం చేశారు. పాకిస్థాన్ ఊహకు కూడా అందని అన్ని పద్ధతులను ఉగ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు ఉపయోగిస్తామని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ కేవలం సైనిక చర్య మాత్రమే కాదు, ఇది ఉగ్రవాదంపై భారత్ చేసిన ప్రత్యక్ష దాడి అని రక్షణ మంత్రి అన్నారు. పాక్ తన భూభాగంలో ఉన్న ఉగ్రవాద నర్సరీలను నిర్మూలించాలని, ఇది పాకిస్థాన్‌కే ప్రయోజనకరమని హితవు పలికారు.పాక్ భూగాగం నుంచి బహిరంగంగా భారత వ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నాయని... సరిహద్దు, సముద్ర మార్గాల ద్వారా ఉగ్రవాదులపై ఎలాంటి ఆపరేషన్ నిర్వహించడానికైనా భారత్ పూర్తిగా సిద్ధంగా ఉందని రాజ్‌నాథ్ పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత నావికాదళం పాత్రను కొనియాడారు. భారత నౌకాదళం పాక్ నేలపై ఉన్న ఉగ్రస్థావరాలను నాశనం చేసినప్పుడు, అరేబియా సముద్రంలోని పాక్ నేవీని దాని సొంత తీరాలకే పరిమితం చేసిందని తెలిపారు. కేవలం మనం విధించిన షరతుల ప్రకారమే కాల్పుల విరమణకు అంగీకరించినట్లు పేర్కొన్నారు.

2023 ఉత్తమ చిత్రం బలగం

(మొదటిపేజీ తరువాయి)

2015: ప్రథమ ఉత్తమ చిత్రం: రుద్రమదేవి, రెండో ఉత్తమ చిత్రం: కంచె, మూడో ఉత్తమ చిత్రం: శ్రీమంతుడు

2016: ప్రథమ ఉత్తమ చిత్రం: శతమానం భవతి, రెండో ఉత్తమ చిత్రం: పెళ్ళి చూపులు, మూడో ఉత్తమ చిత్రం: జనతా గ్యారేజ్

2017: ప్రథమ ఉత్తమ చిత్రం: బాహుబలి 2, రెండో ఉత్తమ చిత్రం: ఫిదా, మూడో ఉత్తమ చిత్రం: ఘాజీ

2018: ప్రథమ ఉత్తమ చిత్రం: మహానటి, రెండో ఉత్తమ చిత్రం: రంగస్థలం, మూడో ఉత్తమ చిత్రం: కేరాఫ్ కంచరపాలెం

2019: ప్రథమ ఉత్తమ చిత్రం: మహర్షి, రెండో ఉత్తమ చిత్రం: జెర్సీ, మూడో ఉత్తమ చిత్రం: మల్లేశం

2020: ప్రథమ ఉత్తమ చిత్రం: అల వైకుంఠపురములో, రెండో ఉత్తమ చిత్రం: కలర్ ఫోటో, మూడో ఉత్తమ చిత్రం: మిడిల్ క్లాస్ మెలొడీస్

2021: ప్రథమ ఉత్తమ చిత్రం: ఆర్ఆర్ఆర్, రెండో ఉత్తమ చిత్రం: అఖండ, మూడో ఉత్తమ చిత్రం: ఉప్పెన

2022: ప్రథమ ఉత్తమ చిత్రం: సీతారామం, రెండో ఉత్తమ చిత్రం: కార్తికేయ 2, మూడో ఉత్తమ చిత్రం: మేజర్

2023: ప్రథమ ఉత్తమ చిత్రం: బలగం. రెండో ఉత్తమ చిత్రం: హనుమాన్, మూడో ఉత్తమ చిత్రం: భగవంత్ కేసరి

ఆరు ప్రత్యేక అవార్డులివే:

ఎన్టీఆర్ నేషనల్ ఫిల్మ్ అవార్డు: నందమూరి బాలకృష్ణ, పైడి జైరాజ్ ఫిల్మ్ అవార్డు: మణిరత్నం, బీఎన్ రెడ్డి ఫిల్మ్ అవార్డు: సుకుమార్

నాగిరెడ్డి - చక్రపాణి ఫిల్మ్ అవార్డు: అట్లూరి పూర్ణచంద్రరావు, కాంతారావు ఫిల్మ్ అవార్డు: విజయ్ దేవరకొండ, రఘుపతి వెంకయ్య ఫిల్మ్ అవార్డు: యండమూరి వీరేంద్రనాథ్ .

బాలయ్య హర్షం

గద్దర్ సినీ పురస్కారాల్లో భాగంగా తనకు ఎన్టీఆర్ నేషనల్ ఫిల్మ్ అవార్డు ప్రకటించడంపై ప్రముఖ నటుడు, హిందూపురం శాసనసభ్యుడు నందమూరి బాలకృష్ణ ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ సర్కార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తమకు ఎంతో ప్రత్యేకమైన ఈ సమయంలో ఇలాంటి పురస్కారానికి తాను ఎంపిక కావడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. "ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలు పూర్తిచేసుకున్న అద్భుతమైన ఘడియలు ఒకవైపు, ఎన్టీఆర్ నట ప్రస్థానానికి 75 సంవత్సరాల అమృతోత్సవాలు జరుగుతున్న శుభ ఘడియలు మరోవైపు.. నటుడిగా నేను 50 ఏళ్ల స్వర్ణోత్సవం పూర్తి చేసుకున్న శుభ సందర్భం ఇంకొక వైపు ఉన్నాయి.

కేంద్ర ప్రభుత్వం ఇటీవలే పద్మభూషణ్‌తో సత్కరించిన ఇలాంటి తరుణంలోనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుంచి 'ఎన్టీఆర్ జాతీయ అవార్డు'ని నాకు ప్రకటించడం నా అదృష్టంగా, దైవ నిర్ణయంగా, నా తండ్రి ఆశీర్వాదంగా భావిస్తున్నాను" అని అన్నారు. ఇంతటి ప్రతిష్ఠాత్మక పురస్కారానికి తనను ఎంపిక చేసిన తెలంగాణ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, జ్యూరీ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపకుంటున్నానని బాలకృష్ణ వెల్లడించారు.

బీఆర్ఎస్ పాలన అభివృద్ధికి దిక్సూచి

విశాలాంధ్ర-హైదరాబాద్ : దృఢ నాయకత్వం, ప్రజల జీవితాలను మార్చాలన్న చిత్తశుద్ధి ఉంటే అద్భుతమైన ప్రగతి సాధ్యమని తెలంగాణా నిరూపించిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు (కేటీఆర్) అన్నారు. 9 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ సాధించిన విజయాలు దేశానికే కాదు... ప్రపంచానికే ఆదర్శంగా నిలిచాయని తెలిపారు. స్థిరమైన వృద్ధితో ప్రపంచ ఆర్థిక రంగాన్ని నడిపించడంలో తెలంగాణా ఎందుకు ముఖ్యం అన్న అంశంపై లండన్ బ్రిడ్జ్ ఇండియా వీక్ 2025 సదస్సులో కేటీఆర్ ప్రధాన ఉపన్యాసం ఇచ్చారు. వివిధ దేశాల రాజకీయ నాయకులు, ప్రభావశీల వ్యక్తులు హాజరయిన ఈ కార్యక్రమంలో అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో విప్లవాత్మక పంథాను అనుసరించి వివిధ రంగాల్లో తీసుకొచ్చిన మార్పులు, పాలసీలపై తన అనుభవాలను, ఆలోచనలను ఆయన పంచుకున్నారు. సంపదను సృష్టించడంతో పాటు దాన్ని సమాజంలోని అట్టడుగు వర్గాలకు సమానంగా పంచడమే తమ హయాంలో తెలంగాణను దేశంలో ప్రత్యేకంగా నిలిపిందని తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలోని తమ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి మధ్య అద్భుత సమతుల్యత సాధించిందన్నారు. తలసరి ఆదాయంలో 12వ స్థానం నుంచి మొదటి స్థానానికి ఎలా ఎదగవచ్చో తెలంగాణ నుంచి భారతదేశంలోని ఇతర రాష్ట్రాలు నేర్చుకోవచ్చన్నారు. తమ హయాంలో పాలనను ప్రజలకు చేరువ చేయడంతో పాటు ప్రభుత్వ జోక్యాన్ని తగ్గించి... వ్యక్తుల కంటే విధానాలకే ప్రాధాన్యత ఇచ్చామని చెప్పారు. చైనా త్రీ గోర్జెస్ డ్యామ్‌కు సమానమైన ఇంజనీరింగ్ అద్భుతం... ప్రపంచంలోని అతిపెద్ద బహుళ ఎత్తిపోతల పథకం కాళేశ్వరంతో 80 మీటర్ల సముద్ర మట్టపు ఎత్తు నుంచి 600 మీటర్ల ఎత్తుకు నీటిని తీసుకువెళ్లి ప్రతి సీజన్‌కు 45 లక్షల ఎకరాలకు సాగునీటిని అందిస్తున్నామన్నారు. భారతదేశం వంటి ప్రజాస్వామ్య దేశంలో ఒక ప్రాజెక్టును నిర్మించడం చాలా కష్టమని, అన్ని రకాల అనుమతులు తీసుకుని, ప్రాజెక్టుతో నష్టపోతున్న నిర్వాసితులకు సరైన పరిహారం ఇచ్చి కేవలం 3 సంవత్సరాల కాలంలోనే ప్రాజెక్టును పూర్తి చేసి దేశం మొత్తం నివ్వెరపోయేలా చేశామన్నారు. కోటి ఇళ్లకు మిషన్ భగీరథతో సురక్షిత మంచినీటిని అందించదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పారిశ్రామిక అనుకూల విధానాల కారణంగా గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్, ఫేస్‌బుక్ వంటి ప్రఖ్యాత టెక్ కంపెనీలు అమెరికా తర్వాత తమ అతిపెద్ద క్యాంపస్‌లను హైదరాబాద్‌లో నెలకొల్పాయని కేటీఆర్ చెప్పారు. కార్పొరేట్ సంస్థలను హైదరాబాద్‌కు ఆహ్వానించి స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు. తాము అధికారంలోకి రావడానికి ముందు 2014లో టెక్ పరిశ్రమలో మూడు లక్షల 23 వేలు ఉద్యోగాలు మాత్రమే ఉండేవని, అయితే తాము అధికారం నుంచి దిగిపోయే నాటికి అవి 10 లక్షలకు చేరాయన్నారు. 2014లో రూ.56 వేల కోట్లుగా ఉన్న ఐటీ ఎగుమతులు, 2023 నాటికి రెండు లక్షల 41 వేల కోట్ల రూపాయలకు చేరాయన్నారు. ఇదంతా తమ ముఖ్యమంత్రి కేసీఆర్ దార్శనికత, మార్గదర్శకత్వంతోనే సాధ్యమైందని తెలిపారు. భారత్‌లో పెట్టుబడులు పెట్టాలని, ప్రగతిశీల రాష్ట్రమైన తెలంగాణాను అందుకు ఫస్ట్ ఛాయిస్‌గా ఎంచుకోవాలన్నారు. తన ప్రసంగంతో తెలంగాణ సక్సెస్ జర్నీని సాధికారికంగా వివరించిన కేటీఆర్... బ్రిడ్జ్ ఇండియా సదస్సులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సదస్సుకు హాజరయిన వివిధ దేశాల రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు కేటీఆర్ ప్రసంగానికి ముగ్ధులై ప్రత్యేకంగా ప్రశంసించారు.

యాసంగిలోనూ రికార్డ్ స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో, హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వానాకాలం సీజన్‌లో రికార్డ్ సృష్టించిన ధాన్యం దిగుబడి యాసంగి సీజన్‌లోనూ అదే రికార్డు పునరావృతం అయ్యిందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకా రైతాంగం పట్ల అనుసరించిన విధానాలే రికార్డు స్థాయిలో పంట దిగుబడికి తార్కాణ మన్నారు. శనివారం సూర్యాపేట కలెక్టర్ కార్యాలయంలో సహచర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిలతో కలసి ధాన్యం కొనుగోళ్లు, వానాకాలం సీజన్ వ్యవసాయ ప్రణాళికలు, ఇందిరమ్మ ఇళ్ళు, భూ భారతి, నీటిపారుదల రంగంపై జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ముందెన్నడూ లేని రీతిలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ జరగనంత దిగుబడి ఈ సంవత్సర కాలంలో వానాకాలం, యాసంగి సీజన్‌లలో వచ్చిందని ఒక్క మాటలో చెప్పాలి అంటే ఇది ఆల్ టైం రికార్డ్‌గా ఆయన అభివర్ణించారు. తెలంగాణా రైతాంగం పండించిన పంటలో చివరిగింజ వరకు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధంగా ఉందని ఆయన పునరుద్ఘాటించారు. రాష్ట్రంలో అర్హులైన నిరుపేదలందరికీ తెల్ల రేషన్ కార్డులు మంజూరు చేస్తామని ఆయన సుస్పష్టం చేశారు. నిరుపేదలకు సన్న బియ్యం అందించాలన్న చారిత్రత్మక నిర్ణయానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం 10,665 కోట్లను వ్యయం చేసి అర్హులైన నిరుపేదలకు ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున ఉచితంగా నాణ్యమైన బియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. పేదల ఆకలిని తీర్చేందుకు ప్రభుత్వం చేపట్టిన విప్లవాత్మకమైన నిర్ణయం సన్నబియ్యం పంపిణీ అన్నారు. అప్పటి వరకు అందించిన దొడ్డు బియ్యం ప్రజలు వినియోగించక పోగా పక్క దారులు పట్టి అనేక అక్రమాలకు తెర లేస్తుండడంతో గమనించిన రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రాజెక్టులలో నీటి సామర్థ్యం పెంపుకు రాష్ట్ర ప్రభుత్వం అంకురార్పణ చుట్టిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయంలో చేవెళ్ల-ప్రాణహిత పేరుతో కేవలము 38 వేల కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టును రీ డిజైన్ పేరుతో లక్ష కోట్లకు పెంచి రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని ఆయన దుయ్యబట్టారు. ఫిర్యాదుల విషయంలో అధికారులు సకాలంలో స్పందించని పక్షంలో చర్యలు కఠినంగా ఉంటాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డి మాట్లాడుతూ నల్గొండ జిల్లాలో 12 లక్షల భూములు సాగులో ఉన్నాయని, గతంతో పోలిస్తే ఈ సంవత్సరం రెండు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఎక్కువగా పండించామని, ఇందుకుగాను జిల్లా కలెక్టర్ ను ఆయన అభినందించారు. ఉమ్మడి నల్గొండ జిల్లాను అన్నింటిలో ముందు ఉంచేందుకు అధికారులు ఇలాగే ముందుకు వెళ్లాలని, పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కలెక్టర్లది ముఖ్య పాత్రని, సన్న బియ్యం వల్ల ప్రభుత్వానికి మంచి పేరువచ్చిందని, రాజీవ్ యువ వికాసం ద్వారా వేలాది మంది యువతకు స్వయం ఉపాధి అవకాశాలు దొరుకుతాయని, నైపుణ్యాల అభివృద్ధి వల్ల వేలాది మందికి ఉద్యోగాలు వస్తాయని అన్నారు. నల్గొండ జిల్లాలో ధాన్యం ఉత్పత్తి ఎక్కువగా ఉన్నందున అదనపు గోదాముల అవసరం ఉందని, అందువల్ల అదనపు గోదాములు మంజూరు చేయడమే కాకుండా, క్లస్టర్లను, ఏఈవో పోస్టుల ను మంజూరు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రికి విజ్ఞప్తి చేశారు. అంతకుముందు సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవర్ మాట్లాడుతూ ధాన్యం సేకరణ, ఇందిరమ్మ ఇళ్లు, భూభారతి, వ్యవసాయంపై సూర్యాపేట జిల్లాకు సంబంధించిన వివరాలను తెలియజేయగా, నల్గొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాటి, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు వారి వారి జిల్లాలకు సంబంధించిన వివరాలను తెలియజేశారు. ఈ సమావేశానికి వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, కలెక్టర్లు, జిల్లా అధికారులు, తదితరులు హాజరయ్యారు.

గత ఏడాది కంటే ఐదు రెట్లు ధాన్యం దిగుబడి

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబాబాద్/ తొర్రూర్ : గత ఏడాది కంటే ఐదు రెట్లు అధికంగా ధాన్యం దిగుబడి ఉందని అందుకు అనుగుణం గా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకొని కొనుగోలు జరుగుతుందని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లాఅదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.వీరబ్రహ్మాచారి అన్నారు. శుక్రవారం తొర్రూరు మండలం అమ్మాపురం, మాటేడు, దంతాలపల్లి మండలం కుమ్మరికుంట్ల, నరసింహులపేట మండల కేంద్రాలలో నడుస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అమ్మపురం గ్రామలోని కేంద్రంలో కేవలం 200 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కలదని, ఈ రోజు సాయంత్రం లోగా మిల్లులకు తరలించడం జరుగుతుందని తెలిపారు. మాటేడు ధాన్యం కొనుగోలు కేంద్రం, కుమ్మరి కుంట్లలో కొనుగోలు కేంద్రాలలో ఉన్న ధాన్యాన్నిమిల్లులకు తరలిస్తున్నట్లు తెలిపారు. అలాగే నరసింహపేట మండల కేంద్రంలో 200 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉందని, రవాణాలో కొంత జాప్యం ఉన్నందున సంబంధిత కాంట్రాక్టర్లతో, రైస్ మిల్లర్లు, హమాలీలతో సంబంధిత రైతులు ఆకుతోట రఘుపతి, బొమ్మ శెట్టి వెంకన్న, భూక్య సూక్య, తోట సురేష్, జాటోతు శ్రీను, తండబోయిన వెంకన్నలతో మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులు వివరిస్తూ వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా లారీలను సమకూర్చినట్లు తెలిపారు. ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా కేంద్రంలోని కంట్రోల్ రూమ్‌లో సంప్రదించాలని ఆయన కోరారు. ధాన్యం కేంద్రాలలో టార్పాలిన్స్, గన్ని సంచులు, ప్యాడీ క్లీనర్స్, అందుబాటులో ఉంచుకోవాలని, ఏలాంటి నిర్లక్ష్యం వహించిన సంబంధిత వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ప్రేమ్ కుమార్, డిఎం సివిల్ సప్లై కృష్ణవేణి, సంబంధిత తాసిల్దారులు, వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

కేజీబీవీకి ఇంటర్ అగ్రికల్చర్ క్రాప్ ప్రొడక్షన్ కోర్సు మంజూరు

విశాలాంధ్ర - తొర్రూరు : ఈ విద్యా సంవత్సరం నుండి తొర్రూరు కేజీబీవీ పాఠశాలకు ఇంటర్ అగ్రికల్చర్ క్రాప్ ప్రొడక్షన్ కోర్సు మంజూరి అయినట్లు మండల విద్యాశాఖ అధికారి మహంకాళి బుచ్చయ్య శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 అడ్మిషన్లతో మంచూరియా ఈ కోర్సు ఆసక్తి కళ బాలికలు ఎలాంటి ఎంట్రెన్స్ పరీక్షలు లేకుండా నేరుగా జాయిన్ కావచ్చు అన్నారు. పూర్తిగా ఇంగ్లీష్ మీడియం కేవలం బాలికలకు మాత్రమే ఈ అవకాశం వర్తిస్తుందని తెలిపారు. పూర్తి రెసిడెన్షియల్ ఉంటుందన్నారు. ఆసక్తి గలవారు మేమో, టీసీ, క్యాస్ట్, ఇన్కమ్ సర్టిఫికెట్లతో స్థానిక కేజీబీవీ స్పెషల్ ఆఫీసరుకు గాని, మండల విద్యాశాఖ కార్యాలయంలో కానీ సంప్రదించవచ్చు అని ఆయన తెలిపారు.

నకిలీ పత్తి విత్తనాల తయారీపై పోలీసుల దాడులు

విశాలాంధ్ర - ఖమ్మం : కుటీర పరిశ్రమలాగా నకిలీ ప్రత్తి విత్తనములు తయారు చేస్తున్న స్థావరంపై పోలీసులు దాడి చేశారు. మూడు వేర్వేరు కేసుల్లో 14 లక్షల విలువ చేసే 560 కేజీల నకిలీ విత్తనాలు పట్టుకున్నారని, తొమ్మిది మందిని అరెస్ట్ చేసినట్లు ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. జిల్లాలోని ఏనుకూరు మండలంతో పాటు పలు మండలాల్లో జరిగిన పోలీసు తనిఖీల్లో కల్తీ విత్తనాలు పట్టుకున్నట్టు ఆయన తెలిపారు. శుక్ర వారం అయినా మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా పకడ్బంది చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఎవరైనా ప్రముఖ బ్రాండెడ్ కంపెనీల విత్తనాల పేరుతో నాసి రకం, నకిలీ విత్తనాలు అంటగట్టి రైతులను మోసం చేయాలని చూస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ నెల 28 ఉదయం ఏన్కూర్ పోలీస్, వ్యవసాయ అధికారుల ఉమ్మడి తనిఖీలలో భాగంగా ఏనుకూరు గ్రామానికి చెందిన గాజుల నరసింహారావు వయసు (49) కొద్దిమంది రైతులకు అనుమతిలేని పత్తి విత్తనాలను అమ్ముతున్నా డని సమాచారం మేరకు తనిఖీ నిర్వహించగా అతని వద్ద 450 గ్రాములు బరువు గల అడ్వాన్స్ 555 పేర్లతో ఉమ్మడి పత్తి విత్తనాల ప్యాకెట్లు దొరకగా, సీజ్ చేయడం జరిగింది. ఎస్సై కల్లూరు డి హరితతో ఒక టీం ఏర్పాటు చేసి తదుపరి విచారణ చేయగా ఇట్టి పత్తి విత్తనాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మైలవరం మండలానికి చెందిన చంద్రు గూడెం గ్రామానికి చెందిన శాలివాహన అనే వ్యక్తి వద్ద నుండి కిలో 450 గ్రాముల ప్యాకెట్లను 400 రూపాయలకు కొనుక్కొచ్చినట్లు తేలింది అన్నారు. అతను కర్ణాటక నుండి ప్రతి విత్తనాలు వాటిని ట్యాగ్ చేయడానికి ప్రింటెడ్ అడ్వాన్స్ త్రిబుల్ ఫై నెంబర్ గల కవర్తో ఉన్న ప్యాకెట్స్ తో తీసుకొచ్చి తన విత్తనాలను రైజోబెల్ మిశ్రమాన్ని కలిపి ఆరబెట్టి ఇట్టిపత్తి విత్తనాలను ప్యాకెట్లలో నింపి సీల్ చేసి గాజుల నరసింహారావు, కొంతమంది ఏజెంట్లు ద్వారా విక్రయాలు నిర్వహిస్తున్నాడు. అతని ఇంటి వద్ద నుండి ఒక క్వింటా రైజోబెల్ మిశ్రమం కలిపి పెట్టి ప్యాక్ చేయన్ని పత్తి విత్తనాలు, 450గ్రాములు బరువు కలిగి అరుణోదయ లేబల్ తో ఉన్న (272) పత్తి విత్తన ప్యాకెట్లను అలాగే ప్యాకెట్ సీల్ చేయడానికి వాడే (2) మిషన్లు, ఒక వేయింగ్ మిషన్, ప్రత్తి విత్తనములు పక్క చేయుటకు అరుణోదయ లేబల్ తో ఉన్న సుమారు (400) ఖాళీ పాక్కెట్లు మరియు రెండు లీటర్ల రైజోబెన్ మిశ్రమమును సీజ్ చేయడం జరిగింది, అన్నారు. 9 మంది నిందితులపై కేసులు నమోదు చేసి రిమాండుకు పంపినట్లు తెలిపారు.

ఏకరూప దుస్తులు నాణ్యంగా తయారు చేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అందించే యూనిఫామ్లు (ఏకరూప దుస్తులు) నాణ్యంగా ఉండేలా చూడాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారు లను ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని ఈద్గాం, మంజులాపూర్‌లో ఏర్పాటు చేసిన యూనిఫాం తయారీ కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుస్తుల కుట్టు నాణ్యతను, తయారీ విధానాన్ని సమీక్షించిన కలెక్టర్... విద్యార్థులకు ఇవ్వబోయే దుస్తులు కచ్చితంగా కొలతలకు తగినట్లుగా ఉండాలని అన్నారు. పాఠశాలలు ప్రారంభం అయ్యేలోపు విద్యార్థులకు యూనిఫామ్లు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దుస్తుల తయారీదారులకు పలు సూచనలు చేసిన కలెక్టర్... నాణ్యత విషయంలో ఏమాత్రం తేడా ఉండకూడదన్నారు. ఈ పరిశీలనలో డీఆర్డిఓ విజయలక్ష్మి, మెప్మా పీడీ సుభాష్, విద్యాశాఖ అధికారులు లింబాద్రి, ప్రవీణ్, తహసీల్దార్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు అధికారుల ఆకస్మికంగా తనిఖీ

విశాలాంధ్ర - గూడూరు: గూడూరు మండల కేంద్రంలో ఏరువుల దుకాణాలను శుక్ర వారం అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల తాసిల్దార్ నాగ భవాని, సిఐ సూర్య ప్రకాష్, ఎస్సై గిరిధర్ రెడ్డి, ఏవో అబ్దుల్ మాలిక్‌లు దుకాణ యజమానుదారులతో మాట్లాడుతూ నాసిరకమైన విత్తనాలను కొనుగోలు, అమ్మకాలు జరిపిన చట్టపరమైన చర్యలకు గురి అవుతారని, నాణ్యమైన విత్తనాలను దిగుమతి చేసుకోవాలని తెలిపారు. రైతులకు ఎరువులను అమ్మినప్పుడు రశీద్ తప్పనిసరిని అన్నారు. రైతులకు పారదర్శకంగా సేవలు అందించాలని అధికారులు వారికి సూచన ప్రయాణంగా తెలిపారు.

రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

విశాలాంధ్ర - దంతాలపల్లి : రైతులకు ఎలాంటి ఆందో ళన చెందవల సిన అవసరం లేదని ధాన్యాన్ని వెంట వెంటనే మిల్లులకు తరలిస్తామని జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ) కే బ్రహ్మాచారి అన్నారు. శుక్రవారం నరసింహపేట మండల కేంద్రంలో 200 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉందని, రవాణాలో కొంత జాప్యం ఉన్నందున సంబంధిత కాంట్రాక్టర్లతో, రైస్ మిల్లర్లు, హమాలీలనుతో సంబంధిత రైతులు ఆకుతోట రఘుపతి బొమ్మ శెట్టి వెంకన్న, భూక్య సూక్య, తోట సురేష్, జాటోతు శ్రీను, తండబోయిన వెంకన్నలతో మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులు వివరిస్తూ వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా లారీలను సమకూర్చమన్నారు. (శుక్రవారం)ఈ రోజు సాయంత్రం, రేపు ఉదయం లోగా ఈ కేంద్రంలో ధాన్యాన్ని మిల్లులకు తరలించడం జరుగుతుందని తెలిపారు. ధాన్యం సేకరణ రవాణాపై అధికారులు తీసుకుంటున్న చర్యలను స్వయంగా చూసి రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు. పూర్తిస్థాయిలో జిల్లా కలెక్టర్, ప్రత్యేక అధికారులు, యంత్రాంగం ధాన్యం కొనుగోళ్లపై నిమగ్నమై ఉందని రైతులు ఎలాంటి భయాందోళనలకు చెందాల్సిన అవసరం లేదని అన్నారు. ఏలాంటి నిర్లక్ష్యం వహించిన సంబంధిత వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఆయన వెంట జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ప్రేమ్ కుమార్, డిఎం సివిల్ సప్లై కృష్ణవేణి, సంబంధిత తాసిల్దారులు, వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ఉపాధి హామీ చట్ట పరిరక్షణకు సిపిఎం ఆందోళన

విశాలాంధ్ర - ఖమ్మం : ఉపాధి హామీ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న కూలీలకు అన్యాయం జరుగుతోందని మోడీ ప్రభుత్వం నానాటికి పనితనాలు తగ్గించి వేస్తుందని సిపిఎం ఖమ్మం అనుబంధ వ్యవసాయ కార్మిక సంఘం, ఇతర సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. శుక్రవారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్ ఎదురుగా ధర్నా నిర్వహించిన ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు కలెక్టరేట్లోకి చొచ్చుకుపోయేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఇరు వర్గాలకు మధ్య తోపులాట జరిగింది. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మెరుగు సత్యనారాయణ అధ్యక్షతన సభ జరిగింది. ఈ సభలో పొన్న వెంకటేశ్వరరావు నున్న నాగేశ్వరరావు బుగవీటి సరళ బొంతు రాంబాబు మాట్లాడుతూ రైతు కూలీలకు ప్రభుత్వాలు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని, వ్యవసాయ కూలీలకు మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టమును సమర్థవంతంగా అమలు చేయాలని, డిమాండ్ చేశారు. కేంద్ర బడ్జెట్లో 3 లక్షల కోట్ల రూపాయల కేటాయించాలని, 200 రోజులు పని దినాలు కల్పించాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు చేసిన ఆరు గ్యారెంటీ వాగ్దానాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంవత్సరానికి 12,000 రూపాయలు అందిస్తామన్న వాగ్దానం షరతులు లేకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. సభానంతరం కలెక్టర్ ముజమ్ముల్ ఖాన్‌కు కూలీల డిమాండ్లతో కూడిన మెమోరాండం అందజేయడం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి కూలీల పెండింగ్ బిల్లులు విడుదల చేయడానికి కృషి చేస్తానని పని ప్రదేశాల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సహాయ కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు, తాళ్లపల్లి కృష్ణ వత్సవాయి జానకి రాములు కొండబోయిన నాగేశ్వరరావు, పొన్నగంటి సంగయ్య, కె.వి.రెడ్డి ప్రతాపనేని వెంకటేశ్వరరావు, జాజిరి శ్రీనివాసరావు, తన్నీరు కృష్ణార్జునరావు నాంద్ర ప్రసాద్ బంధం రాజ్యం వడ్లమూడి నాగేశ్వరరావు, రైతు సంఘం నాయకులు సుదర్శన్ రెడ్డి, రాజు, ఎస్ కే మీరా గొడవర్తి నాగేశ్వరరావు బిక్కసారి గంగాధర్ రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బసంత్‌నగర్‌లో రక్తదాన శిబిరం

విశాలాంధ్ర బ్యూరో - పెద్దపల్లి: తెలంగాణ రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖమంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు పుట్టినరోజు సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు డీసీసీ ప్రధానకార్యదర్శి సూర సమ్మయ్య ఆధ్వర్యంలో బసంత్ నగర్ టోల్ గేట్ వద్ద రక్తదాన శిబిరం ఏర్పాటు చేయబడిందని ఈ శిబిరంలో 25 యూనిట్ల రక్తాన్ని సేకరించి మంచిర్యాల రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకుకు పంపించడం జరిగిందని ఈ శిబిరంలో పెద్దపల్లి జిల్లా ఐఆర్‌సిఎస్ చైర్మన్ కావేటి రాజగోపాల్, జనరల్ సెక్రటరీ సాదుల వెంకటేశ్వర్లు, ట్రెజరర్ వీరగోని శ్రీనివాస్, మంచిర్యాల బ్లడ్ బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారని చైర్మన్ కావేటి రాజగోపాల్, జనరల్ సెక్రటరీ సాదుల వెంకటేశ్వర్లు తెలుపారు.

జూన్ 2 రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - సంగారెడ్డి : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని జూన్ 2న ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు విస్తృతంగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్, అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం పోలీస్, రెవెన్యూ, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖ మునిసిపల్ అధికారులు, పలు శాఖల అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ అధికారుల సమన్వయంతో రాష్ట్ర అవతరణ దినోత్సవాలు ఘనంగా నిర్వహించాలన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అన్ని ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. పూర్తి భద్రతా ఏర్పాట్లు చేయాలని, ట్రాఫిక్ నియంత్రణ, జన సమూహాల భద్రత దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక పోలీస్ బృందాలు అందుబాటులో ఉండాలన్నారు. సీసీ టీవీ నిఘా, స్పెషల్ సెక్యూరిటీ బృందాలు ఏర్పాటు చేయాలన్నారు. మున్సిపల్ శాఖ, పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో స్వచ్ఛత కార్యక్రమాలు చేయాలని, జిల్లాను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. గ్రామాలు, పట్టణాల్లో స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించి, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద శు భ్రపరచాలన్నారు. విద్యుత్ శాఖ, నీటి సరఫరా శాఖలతో సహకరించి వేడుకలు జరిగే ప్రాంతాల్లో నిరంతర సరఫరాకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. శకటాలు, స్టాళ్లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలు పెద్దఎత్తున ఈ వేడుకల్లో పాల్గొని తెలంగాణ సంస్కృతి, గౌరవాన్ని ప్రదర్శించాలని సూచించారు. కార్యక్రమాలన్నీ సజావుగా జరిగేలా అన్ని శాఖల సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదుపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

విశాలాంధ్ర - కారేపల్లి : నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి భట్టు అశోక్ కారేపల్లి ఎస్ఐ ఎన్ రాజారాం హెచ్చరించారు. శుక్రవారం సింగరేణి మండల పరిధిలో ఉన్న విత్తన డీలర్ల షాపులను ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా డీలర్లతో వారు మాట్లాడుతూ రైతులకు మేలు రకం విత్తనాలను విక్రయించే క్రమంలో తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలన్నారు. విత్తనాలు కొనే ప్రతి రైతు కూడా తప్పనిసరిగా తాము కొనుగోలు చేసే విత్తనాలకు సంబంధించిన బిల్లులను తీసుకొని పంట పూర్తిగా పండే వరకు ఆ బిల్లులను భద్రపరచుకోవాలని సూచించారు. మండలంలోని ప్రతి షాపును కూడా తనిఖీ చేస్తామని డీలర్లు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి బ్రాండెడ్ కంపెనీల విత్తనాలను కొని మాత్రమే విక్రయించాలన్నారు.

జిల్లా ఎస్పీ ఎదుట 17 మంది మావోయిస్టుల లొంగుబాటు

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : మావోయిస్టుల లొంగుబాటు కోసం కొత్తగూడెం జిల్లా పోలీసులు చేస్తున్న ప్రయత్నాలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. తాజాగా శుక్రవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఎదుట 17 మంది మావోయిస్టులు లొంగిపోయారు. దింతో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు సుమారు 282 మంది సభ్యుల తోపాటు వివిధ క్యాడర్‌కు చెందిన వారు లొంగి పోయినట్లు ఎస్పీ మీడియా సమావేశంలో వెల్లడించారు. జిల్లా పోలీసుల తోపాటు 81, 141, సి ఆర్ పి ఎఫ్ బెటాలియన్ అధికారులు ఆదివాసీ ప్రజల అభివృద్ధి, సంక్షేమం. కొరకు నిర్వహిస్తున్న ఆపరేషన్ చేయూత మంచి ఫలితాలు ఇస్తుంది. లొంగిపోయిన సభ్యులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు శాఖ కల్పిస్తున్న సదుపాయల గురించి తెలుసుకుని, నక్సలిజాన్ని విడనాడి లొంగిపోతున్నట్టు ఎస్పీ తెలిపారు. ప్రస్తుతం మావోయిస్టు సాయుధదళాల సంచారం తెలంగాణ-చత్తీస్గఢ్ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాలలో ఉన్నదన్నారు. ఈ మధ్య ప్రజలు అందించిన సమాచారం ద్వారానే ములుగు జిల్లాలో 20 మంది సాయుధ దళ సభ్యులను అరెస్టు చేయడం జరిగిందన్నారు. లొంగిన వారి కోసం తెలంగాణ, చత్తీస్ ఘడ్ ప్రభుత్వాలు, పోలీస్ శాఖ సహకారంతో దీర్ఘకాలిక పునరావాస చర్యలు కూడా తీసుకొవడం జరుగుతుందని ఎస్పీ హామీ ఇచ్చారు. సాయుధ దళాలు తెలంగాణ ప్రాంతంలో సంచరించినట్లయితే ఏ ఒక్కరు కూడా పోలీసు శాఖ చర్యల నుంచి తప్పించుకోలేరని ఎస్పీ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఇటీవలే వివిధ ప్రాంతాలలో జరిగిన ఎదురుకాల్పులలో మావోయిస్టులు మొత్తం 31 మంది తమ విలువైన ప్రాణాలను కోల్పోవడాన్ని మనం మరువకూడదనీ ఎస్పీ ఆవేదనతో చెప్పారు.

2న రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : సింగరేణి కార్పొరేట్ ఏరియా ఆధ్వర్యంలో కొత్తగూడెం ప్రకాశం స్టేడియం గ్రౌండ్‌లో జూన్ 2 న ఘనంగా 11వ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్లు డైరెక్టర్ పా (పి అండ్ పి) కే.వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం సంబురాలలో పాల్గొనే ప్రముఖ సినీ, టీవి కళాకారుల ప్రదర్శనల గురించి తెలిపే గోడపత్రికను ఆయన ఆవిష్కరించారు. అనంతరం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 136 సంవత్సరాల ఘన చరిత్ర గల సింగరేణి సంస్థ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ప్రతిష్టాత్మకముగా కోల్ బెల్ట్‌లోని అన్ని ఏరియాలలో నిర్వస్తున్నట్లు వెల్లడించారు. అందులో భాగంగా కార్పొరేట్ ఏరియా ఆధ్వర్యంలో కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలొ వేడుకలు నిర్వహించటానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ వేడుకలకు సింగరేణి సంస్థ సి ఎండి ఎన్.బలరామ్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. ముందుగా ఉదయం 8 గంటలకు సింగరేణి ప్రధాన కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరిస్తామ న్నారు. అనంతరం తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి తదుపరి ప్రకాశం స్టేడియం నుండి బస్ స్టాండ్ సెంటర్ వద్ద గల తెలంగాణ అమరవీ రుల స్తూపం వరకు తెలంగాణ రన్ నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో అమరులైన తెలంగాణ వీరులకు నివాళులు అర్పించటం జరుగుతుందన్నారు. అనంతరం సి ఎండి బలరామ్ ఉదయం 9.15 నిమిషాలకు ప్రకాశం స్టేడియం నందు పతాక ఆవిష్కరణ చేయడం జరుగుతుందన్నారు. జిఎం (పర్సనల్) ఐఆర్ పిఎం కవితా నాయుడు, జిఎం వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్, ఏజిఎం జి.రాజేంద్ర ప్రసాద్, డిజిఎం ముకుంద సత్యనారాయణ, డివై.పిఎం జి కే.కిరణ్ కుమార్, పిఓ టి.శ్రీనివాస రావు, మేనేజ్మెంట్ ట్రైనీ ఉదయ్ కుమార్, వరప్రసాద రావు, స్పోర్ట్స్ సూపర్ వైజర్ పోస్ నెట్, సేవా కొ-ఆర్డినేటర్ ఇజాజ్ షరీఫ్‌లు పాల్గొన్నారు.

ఘనంగా బాల పెద్దమ్మ తల్లి విగ్రహా ప్రతిష్ఠ

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలంలోని తొట్టిపంపు గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ బాల పెద్దమ్మ తల్లి జీవద్వజ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు శుక్రవారం ఘనంగా కొనసాగు తున్నాయి. ఆలయ అభివృద్ధి వ్యయ ప్రధాత ధర్మకర్త హరిహర ఫౌండేషన్ వ్యవస్థాపకులు మారగాని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శ్రీ బాల పెద్దమ్మ అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమలకు మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామ ఆడపడుచులతో కోలాట బృందం సభ్యులతో కలిసి ఉత్సాహాన్ని నింపారు. నాగేశ్వరరావుకు ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు. నిర్వహణ ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. ఈనెల 31 శనివారం ప్రతిష్ఠా మహోత్సవం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. రెండో రోజు పూజ కార్యక్రమంలో భాగంగా దేవత విగ్రహాలు ఊరేగింపుగా పురవీధిలో కోలాటాలు ఆడుతూ పాడుతూ పిల్లలు, ఆడపడుచులు, పెద్దలు కలిసి నిర్వహించి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరించారు. నూతన పెద్దమ్మతల్లి ఆలయాన్ని ఆలయ పరిసరాలను సర్వంగా సుందరంగా అలంకరించారు. తొట్టిపంపు గ్రామంలో ఆధ్యాత్మిక శోభతొ పండుగ వాతావరణం నెలకొంది. భక్తుల రాకతో అమ్మవారి సన్నిధిలో కిక్కిరిసింది సుమారు 5 వేల మంది భక్తులకు అన్న సంతర్పణ కార్యక్రమంకు ఏర్పాటు చేసినట్లు మారగాని శ్రీనివారావు అన్నారు. తొట్టిపంపు గ్రామ ప్రజలతోపాటు ప్రముఖులు పాల్గొన్నారు.

హైడల్ ప్రాజెక్ట్ ఓ తెల్ల ఏనుగు...

హిమాచల్ ప్రదేశ్‌లో నిర్మాణాన్ని తప్పుపట్టిన హరీశ్‌రావు

విశాలాంధ్ర - హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ పనితీరు చూస్తుంటే కూట్లో రాయి తీయని వాడు ఏట్లో రాయి తీసినట్టుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో హామీలు అమలు చేయడం చేతకాని రేవంత్ ప్రభుత్వానికి హిమాచల్ ప్రదేశ్‌లో హైడల్ పవర్ ప్రాజెక్టు నిర్మాణానికి పూనుకోవడం... మింగ మెతుకు లేదు కానీ మీసాలకు సంపంగి నూనె అనే సామెతను గుర్తు చేస్తోందన్నారు. అప్పులు పుట్టడం లేదని, తమను ఎవరు నమ్మడం లేదని ప్రతి వేదిక మీద తన చేతకాని తనాన్ని ప్రదర్శిస్తున్న సీఎం రేవంత్‌కు రూ.6,200 కోట్లతో హిమాచల్ ప్రదేశ్‌లో తెల్ల ఏనుగు లాంటి హైడల్ ప్రాజెక్టు నిర్మాణానికి టీజీ జెన్‌కోను రంగంలోకి దింపడం ఇంకో తుగ్లక్ చర్య తప్ప మరొకటి కాదన్నారు. హైడల్ ప్రాజెక్టు నిర్మాణ పనుల నుంచి మోసర్ బేర్ వంటి ప్రతిష్టాత్మక కంపెనీ పారిపోయినా, ఎన్టీపీసీ లాంటి కేంద్ర ప్రభుత్వరంగ కంపెనీ మూడేళ్ల తర్వాత సాధ్యం కాదని వదిలేసిన 510 మెగావాట్ల ప్లాంట్‌ని కట్టేందుకు టీజీ జెన్‌కో ఒప్పందం ఎందుకు చేసుకుందో తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రెండు దశాబ్దాల కాలంగా ఎవరూ కట్టేందుకు ముందు రాని ప్రాజెక్ట్‌ను ఎందుకు తెలంగాణ ప్రభుత్వం చేపట్టవలసి వస్తోందని నిలదీశారు. డీపీఆర్ లేకుండానే తెలంగాణ ప్రభుత్వం హిమాచల్ ప్రభుత్వంతో ఎంవోయు చేసుకొని అప్ ఫ్రంట్ ప్రీమియం కింద రూ.26 కోట్లను చెల్లించి మరో రూ.26 కోట్లు చెల్లించేందుకు సిద్ధపడడాన్ని బట్టి తెలంగాణ ప్రభుత్వం దివాలా తీసిందని సీఎం రేవంత్ రెడ్డి చెపుతున్న మాటలు ప్రజల చెవుల్లో పూలు పెట్టడానికేనని తేలిపోయిందన్నారు. హైడల్ ప్రవర్ ప్రాజెక్టుపై రేవంత్ రెడ్డి సర్కారు ఎందుకు ఉబలాటపడుతుందో శ్వేతా పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజిబిలిటీ రిపోర్టు, డీపీఆర్‌లు లేకున్నా, జెన్ కో బోర్డు ఆమోదం లేకున్నా ఎంవోయూ చేసుకొని రూ.26 కోట్లు ఎందుకు చెల్లించారో ప్రజలకు చెప్పాలని, అసెంబ్లీలో చర్చించాలన్నారు.

సంపాదకీయం

నిరాయుధ సైనికుడు ఒమర్

పహల్గాం సంఘటన తరవాత కేంద్ర హోం మంత్రి అమిత్ షా గురువారం శ్రీనగర్‌లో శాంతి భద్రతల పరిస్థితిని సమీక్షించారు. పహల్గాం దురంతం తరవాత అమిత్ షా జమ్మూ-కశ్మీర్‌లో పర్యటించడం ఇది రెండవసారి. రెండేళ్లుగా సలసల కాగుతున్న మణిపూర్ మీద ఏ మాత్రం దృష్టి పెట్టని మోదీ ప్రభుత్వం పహల్గాం దురంతం తరవాతనైనా జమ్మూ-కశ్మీర్‌లో శాంతి భద్రతల గురించి ఆలోచించడం అభినందించదగిందే. "యాత్రికులకు సకల సదుపాయాలు అందించడానికి కేంద్ర ప్రభుత్వం, కశ్మీర్ పరిపాలనా విభాగం సకల ప్రయత్నాలు చేస్తుంది" అని కేంద్ర హోం మంత్రి అమిత్ షా గురువారం హామీ ఇచ్చారు. జూన్ 3వ తేదీన ప్రారంభం అవుతున్న అమర్‌నాథ్ యాత్ర సజావుగా సాగడానికి కావాల్సిన ఏర్పాట్లను సమీక్షించడానికి అమిత్ షా శ్రీనగర్ వెళ్లారు. యాత్రికులకు ఏ ఇబ్బంది లేకుండా "కేంద్ర ప్రభుత్వం, జమ్మూ-కశ్మీర్ పరిపాలనా విభాగం సకల ప్రయత్నాలు చేస్తుంది" అని మాత్రమే అమిత్ షా చెప్పిన విషయాన్ని ప్రత్యేకంగా గమనించాలి. ఇందులో ఆయన ఎక్కడా ఒమర్ అబ్దుల్లా నాయకత్వంలోని జమ్మూ-కశ్మీర్ ప్రభుత్వం గురించి ప్రస్తావించని అంశం కూడా జాగ్రత్తగా గమనించాలి. జమ్మూ-కశ్మీర్ శాంతి భద్రతలతో అక్కడి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి, మంత్రివర్గానికి ఏ పాత్రా లేనట్టే. ఇది కేంద్ర ప్రభుత్వం అన్నీ తానై అయి చూసుకోవడం కాదు. ఆ ప్రభుత్వాన్ని నిర్లక్ష్యం చేయడమే. కశ్మీర్ ప్రస్తుతం కేంద్ర పాలిత ప్రాంతమే అయి ఉండొచ్చు. అక్కడి శాంతి భద్రతలు కేంద్ర ప్రభుత్వ బాధ్యతే కావచ్చు. కానీ అక్కడ ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం ఉంది. ఆ ప్రభుత్వాన్ని పట్టించుకోకుండా కేంద్రం సర్వం తానై వ్యవహరించడం స్థానిక ప్రభుత్వాన్ని అవమానించడమే. శాంతి భద్రతలపై తమకే సంపూర్ణమైన పట్టు ఉండాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ బాధ్యత ఎంత అస్తవ్యస్తంగా నిర్వహిస్తున్నారో పహల్గాం ఘాతుకమే రుజువు చేసింది. శాంతి భద్రతలు తమ అధీనంలోనిదే అని పదే పదే చెప్తున్న హోం మంత్రి పహల్గాంలో భద్రతా ఏర్పాట్ల లోపానికి బాధ్యత వహించడానికి మాత్రం సిద్ధపడరు. జమ్మూ-కశ్మీర్‌లో శాంతి భద్రతల విషయంలో ఒమర్ అబ్దుల్లా ప్రభుత్వాన్ని ఏ మాత్రం ఖాతరు చేయకపోవడం ఇది మూడోసారి. కేంద్ర హోం మంత్రి సమీక్షించేది అక్కడి లెఫ్టినెంట్ గవర్నర్‌తో మాత్రమే. ముఖ్యమంత్రిని ఇలాంటి సమీక్షల నుంచి మినహాయించడం పనిగట్టుకుని అవమానించడం మాత్రమే కాదు తమ పార్టీకి భిన్నమైన ప్రభుత్వం గనక జమ్మూ-కశ్మీర్‌లో అధికారంలో ఉంటే ఇలాంటి తిరస్కార భావం తప్పదని చెప్పడమే. గత నెలలో శ్రీనగర్‌లో అమిత్ షా ఉన్నతస్థాయి సమావేశం ఏర్పాటు చేసినప్పుడు శాంతి భద్రతల అంశం చర్చకు వచ్చేటప్పటికి ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా లేచి వెళ్లిపోయారు. జమ్మూ-కశ్మీర్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పోలీసు డైరెక్టర్ జనరల్ మాత్రం సమావేశంలో పాల్గొన్నారు. గత ఫిబ్రవరిలో శ్రీనగర్‌లోని పోలీసు కంట్రోల్ రూంలో లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా సమీక్షా సమావేశం నిర్వహించినప్పుడు కూడా ఒమర్ అబ్దుల్లాను పట్టించుకోనేలేదు. ముఖ్యమంత్రిని ఖాతరు చేయకపోవడం అంటే ఇదే. జమ్మూ-కశ్మీర్‌కు ఇదివరకటిలాగా సంపూర్ణ రాష్ట్రప్రతిపత్తి ఉండి ఉంటే భద్రతా వ్యవహారాలను పరిశీలించే వ్యవస్థ అంతా ముఖ్యమంత్రి అధీనంలో ఉండేది. ఇప్పుడు రాష్ట్రప్రతిపత్తి లేదు కనక ముఖ్యమంత్రితో ఏం పని అని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నట్టు ఉంది.

కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే 370వ అధికరణాన్ని 2019 ఆగస్టున రద్దు చేసి, రాష్ట్రప్రతిపత్తి లేకుండా చేసి, ఆ ప్రాంతాన్ని కేంద్ర పాలిత ప్రాంతంగా దిగజార్చినప్పుడు వీలైనంత త్వరలో మళ్లీ రాష్ట్రప్రతిపత్తి పునరుద్ధరిస్తామని కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. కేంద్రం అయితే ఆ మాటే ఎత్తడం లేదు. పహల్గాం సంఘటన తరవాత ఒమర్ అబ్దుల్లా ప్రభుత్వం ఆ విషయం ప్రస్తావించే అవకాశమే లేకుండా పోయింది. 2019 జమ్మూ-కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం అక్కడ మంత్రివర్గం ఉన్నా శాంతి భద్రతలు లెఫ్టినెంట్ గవర్నర్ అధీనంలోనే ఉంటాయి. ఢిల్లీలోనూ శాంతి భద్రతలు రాష్ట్ర ప్రభుత్వ అధీనంలో ఉండవు. అక్కడి భద్రతా దళాలు నేరుగా కేంద్ర హోం మంత్రి అధీనంలో పని చేస్తాయి. జమ్మూ-కశ్మీర్ లో మాత్రం శాంతిభద్రతలు లెఫ్టినెంట్ గవర్నర్ అధీనంలో ఉంటాయి. లెఫ్టినెంట్ గవర్నర్‌ను నియమించేది ఎటూ కేంద్ర ప్రభుత్వమే గనక, ఆ పదవిలో ఉండే వారు సాధారణంగా కీలు బొమ్మలే గనక అసలు అధికారం కేంద్రం గుప్పెట్లోనే ఉండేందు వీలుగా 2019 నాటి జమ్మూ-కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టాన్ని రూపొందించారు. ఒమర్ అబ్దుల్లా మంత్రివర్గాన్ని పక్కన పెట్టడంలో అసలు మతలబు ఇదే. శాంతి భద్రతల వ్యవహారంలో స్థానిక ప్రభుత్వానికి ఏ మాత్రం సంబంధం లేకపోతే పరిస్థితి ఎంతగా దిగజారుతుందో పహల్గాం దురంతం నిరూపించింది. కానీ కేంద్ర ప్రభుత్వానికి కావాల్సింది అధికారం తమ చేతిలో కేంద్రీకృతం అయి ఉండడమే. ఏప్రిల్ 22న జరిగిన పహల్గాం ఘాతుకానికి సరైన భద్రతా ఏర్పాట్లు లేకపోవడమేనని రుజువైంది. దీనికి నిజానికి ప్రధానమంత్రి మోదీ ప్రభుత్వం, జమ్మూ-కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా బాధ్యత వహించాలి. వీరిద్దరిలోనూ ఇలాంటి ఛాయలైనా కనిపించలేదు. మోదీ అయితే పాకిస్థాన్ దుష్ట పాత్ర మీదకు జనం దృష్టి మరల్చి నేర్పుగా తప్పించుకున్నారు. భద్రతా ఏర్పాట్లలో తన బాధ్యత ఉందని లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా మాటవరసకైనా అంగీకరించలేదు. ఇలాంటి దుర్ఘటనలు జరిగినప్పుడు దీనికి బాధ్యులైన వారు నైతిక బాధ్యత వహించి రాజీనామా చేసే సంప్రదాయం ఎప్పుడో మాయమై పోయింది. ఒక వేళ జమ్మూ-కశ్మీర్ శాంతి భద్రతలే ఒమర్ అబ్దుల్లా ప్రభుత్వ పరిధిలో ఉంటే ఈ పాటికి బీజేపీ నాయకులు ఎంతగా గగ్గోలు చేసేవారు సులభంగానే ఊహించుకోవచ్చు. శాంతి భద్రతలు కేంద్రం చేతిలోనే ఉన్నాయి కనక కేంద్ర ప్రభుత్వ పెద్దలు, నోరు పారేసుకోవడానికి అలవాటుపడిన బీజేపీ నాయకులు కిమ్మనడం లేదు. లేకపోతే ఈ పాటికి ఒమర్ అబ్దుల్లాను చీల్చి చెండాడే వారు. పహల్గాం దురంతం తరవాత ప్రజల్లో విశ్వాసం కల్పించడానికి, పర్యాటకులను ఆకర్షించడానికి బుధవారం పహల్గాంలోనే మంత్రివర్గ సమావేశం ఏర్పాటు చేశారు. అక్కడ ఒమర్ అబ్దుల్లా సైకిల్ తొక్కుతూ కనిపించారు. కానీ శాంతి భద్రతలు ఆయన ప్రభుత్వం చేతిలో లేనప్పుడు ఇలాంటి జనాకర్షక చేష్టలకే పరిమితం కావాల్సి వస్తుంది. పర్యాటకుల బాధ్యత ముఖ్యమంత్రిదేనట. కానీ వారి భద్రత మాత్రం అక్కడి ప్రభుత్వానిది కాదట. ఏర్పాటు వింతగా ఉంది కదూ. మోదీ హయాంలో సమస్త విషయాల్లోను ఇదే వైపరీత్యం అంతటా పరుచుకుని ఉంటుంది.

కఠినం అనగానేమి...!?

చక్రవాకం

\- ముక్కాముల చక్రధర్

ఈ కఠినం అనే పదం ఈ మధ్యే కాదు... ఆ మధ్య కూడా చాలామంది నుంచి విన్నాను. "నేను చాలా కఠినమండి. ఒక్కసారి నిర్ణయం తీసుకుంటే ఇక మార్పు ఉండదు" అనడం విన్నాను. అప్పుడే ఈ కఠినం అనే మాట మీద పరిశోధన వంటిది చేద్దామనిపించింది. "నేను ఏ విషయంలోనైనా కఠినంగానే ఉంటాను. ఎంతటి కదలికైనా సరే మారను" అని కూడా అంటూంటారు. అది కఠినం ఎందుకు అవుతుందో నాకు అర్థం కాదు. దాన్ని నేను ఆత్మ విశ్వాసం గానే పరిగణిస్తాను తప్ప కఠినంగా మాత్రం చూడను. పోనీ, కఠిన నిర్ణయమే అనుకుందాం. "ఇక నీ గురించి ఆలోచించను. నువ్వు ఏమైపోయినా పరవాలేదు. అప్పుడే నేను ఎంత కఠినమో నీకు తెలుస్తుంది" అని కూడా అంటూంటారు చాలామంది. అలా అనిపించుకున్న వ్యక్తి ఆడో/ మగో... అన్నవాళ్లు స్త్రీ కావచ్చు... పురుషుడు కావచ్చు. ఆ వ్యక్తి ఆపదలో ఉంటేనో, పరమ సంతోషంగా ఉంటేనో ఈ కఠిన పరులు బాధపడకుండాను, వారి ఆనందాన్ని అనుభవించకుండానూ ఉంటారా...!? అని అనిపిస్తూంటుంది.

కురుక్షేత్ర యుద్ధం ముందు శ్రీకృష్ణుడి దగ్గరికి అర్జునుడు, దుర్యోధనుడు ఒకేసారి వస్తారు సాయం కోసం. అర్జునుడికి శ్రీకృష్ణుడు ఓ హామీ ఇస్తారు. "ఆయుధముల్ ధరింప... అని నూరకే సాయము సేయువాడ" అని చాలా కఠినంగానే చెబుతాడు. ఈ అర్జునుడు కూడా "యుద్ధమున నా రథమందు వశింపుమయ్య. మధ్యందిన భానుమండల విధంబున... నీ వెందును ఆయుధము దరికేగని ఒప్పుదు గాక" అని అంటాడు. అంటే నీ కఠినత్వాన్ని అంగీకరించడమే కాదు... గౌరవిస్తున్నాను అని కూడా కదా అర్థం. కానీ శ్రీకృష్ణుడు ఏం చేశాడు. తన కఠిన నిర్ణయాన్ని పక్కన బెట్టి భీష్ముడి మీదే రథచక్రం ఎత్తుతాడు. అది ఆవేశం ఆపుకోలేకపోవడమే కదా...! మరి అప్పుడు శ్రీకృష్ణుడు తన కఠిన నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నట్లే కదా...! నిజానికి దేవదేవుడిగా కొలుస్తున్న శ్రీకృష్ణుడికి తన కఠిన నిర్ణయం గుర్తుకు రాలేదనుకుందామా...! పరమాత్ముడిగా భావించిన వాడే తన కఠిన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని ఆవేశపడ్డాడు కదా...! మరింక కఠినత్వం ఎందుకుంటుంది. అందులోనూ సాధారణ మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి వారికి ఎందుకు ఉంటుంది. అసలు ఎందుకు ఉండాలి అన్నదే నన్ను వేధిస్తున్న ప్రశ్న.

కథకుడి పేరు గుర్తు లేదు. భారత్, పాకిస్థాన్ విడిపోయినప్పుడు వచ్చిన కథలన్నీ కలిపి నేషనల్ బుక్ ట్రస్ట్ వారు వేసిన సంకలనంలో ఓ కథ అది. రెండున్నర దశాబ్దాల క్రితం చదివాను. ఇంతకీ కథ ఏంటంటే... ఒక మతాన్ని వ్యతిరేకించే వ్యక్తి. ఆ మతం పట్ల తీవ్రమైన కఠిన నిర్ణయాలతో ఉండే వ్యక్తి. రెండు మతాల మధ్య విద్వేషాలు పెరుగుతున్న వేళ. ఓ మతం వారు మరో మతానికి చెందిన కుటుంబాన్ని చంపేందుకు వారిని వెంటాడతారు. తాను వ్యతిరేకించే... కఠినాతికఠినంగా ఉంటానని తనకు తానే చెప్పుకునే ఆ వ్యక్తి దగ్గరకు ఆ కుటుంబం వస్తుంది. ముందు ఇతగాడిని చూసి వారు భయపడతారు. వణికిపోతారు. కానీ, ఈ కఠినస్తుడైన వ్యక్తి వారికి ధైర్యం చెబుతాడు. వారిని తన ఇంట్లో పెట్టుకుని రక్షిస్తాడు. ఆ కుటుంబాన్ని వెంటాడిన వాళ్లు వెళ్లిపోయాక... ఆ కుటుంబం అతనికి రెండు చేతులతో నమస్కరించి ఇలా "మీలో మానవత్వం ఉంది. ఈ కఠినమైన ప్రపంచంలో మీలాంటి వారు ఉన్నారు" అంటుంది.. ఆ మాటలకు అతను కరిగిపోతాడు. కన్నీరవుతాడు. 'నాకున్నది పరమతంపై కఠినత్వమే కదా! వీళ్లేమిటి మానవత్వం అంటున్నారు' అని తనలో తానే అనుకుంటాడు. నువ్వు మాటిమాటికి కఠినాత్ముడిని లేదూ కఠినాత్మురాలిని అనుకుంటున్నావంటే నువ్వు మానవతావాదివి అని అర్థం. నీ కోపం, నీ ఆవేశం, నీ దుఃఖం, నువ్వు ఎదుర్కొన్న మోసం, నీ ప్రేమ రాహిత్యం, నీకంటూ నీ మనిషి లేకపోవడం... ఉన్నా అనుమానపు చూపులతో ఉన్న వారిని చూసి నువ్వు కఠినంగా ఉండాలనుకుంటావు. కానీ నీకు చేత కాదు అలా ఉండడం. నువ్వు నీలో కన్నీరవుతావు. నువ్వు నీలో వేదన చెందుతావు. పైకి మాత్రం గంభీరంగా ఉండేందుకు అనేకానేక ప్రయత్నాలు చేస్తావు. దానికే నువ్వు కఠినత్వం అని పేరు పెట్టుకుంటావు. నీ ఒంటరితనం, నీ బేలతనం నేను కఠినం అనే మాటని పదే పదే గుర్తు చేస్తాయి. నువ్వు వాకింగ్‌కి వెళ్లినప్పుడో... సరుకుల కోసం మార్కెట్‌కి వెళ్లినప్పుడో... లేదూ బస్సులోనో, రైలులోనో ప్రయాణిస్తున్నప్పుడు ఓ చిన్నారి ఇసుకలో ఆడుకుంటునో, మరో పువ్వు వికసిస్తూనో... ఉదయాన్నే కిటికీలోంచి సూర్యుడు ఉదయిస్తూనో నీ కంట పడినప్పుడో, సాయం సంధ్యలో నెలవంక నిన్ను చూసి నవ్వుతూ పలకరిస్తేనో, నీ పక్కన ఉన్న వారు నిండుగా నవ్వుతూనో కనిపిస్తారు చూడు... అప్పుడు నీకు అర్థం అవుతుంది. నీలో కఠినత్వం లేదని. నువ్వు అనుకుంటున్న కఠినత్వమంతా నీ పైపై వేదనే అని. నిన్ను మోసం చేయాలనుకున్న వాళ్లు నీ చిరునవ్వు చూసి వాళ్లే మోసపోయామని అనుకుంటారు చూడు... అప్పుడు నువ్వు వాళ్లని చూసి లోలోపల నవ్వుకుంటావు చూడు, అదే నీ కఠినత్వం అనుకుంటావు. అంతకు మించి ఇంకేమి మిగలదు. అది కఠినత్వం కాదు. అది నీ విజయం.

నిన్ను మనసుకు.... గుండెలకు... జీవితానికి దగ్గర చేసుకుని ఓ మందార పువ్వులా... జీవితాన్ని వెలిగించే ఓ దివ్వెలా... నీ పేరు ఉన్న ఏ బోర్డు చూసినా దాని వైపు ఆరాధనగా చూస్తూంటారు చూడు, అప్పుడు తెలుస్తుంది నీకు నీ కఠినత్వం ఓ ముసుగని... నీ కఠినత్వం ఓ ఆవేశమని... నీ కఠినత్వం నిన్ను కమ్మేసిన తెల్లవారుజాము మంచు బిందువని. ఓ స్త్రీ... మరో పురుషుడా... ఇంకో థర్డ్ జండర్... మన స్కూల్ కఠినత్వం కాదర్రా... మనది ప్రేమతత్వం రా... బీపీకి మందులుంటాయి. మధుమేహానికి టానిక్కులుంటాయి. కఠినత్వానికి ప్రేమే మందు. ఒక్కసారి ప్రేమించి చూడు... మహా అయితే తిరిగి ప్రేమిస్తారు.... సినిమా డైలాగే... కానీ వంద శాతం నిజం.

సీనియర్ జర్నలిస్టు, 99120 19929

వర్సిటీల్లో అతిథి ఆచార్యులే కీలకం

డాక్టర్ జీకేడీ ప్రసాదరావు

ఆంధ్రప్రదేశ్ కళాశాలలు, విశ్వవిద్యాలయాలు గత పదిహేనేళ్ల నుంచి అతిథి అధ్యాపకులు, ఆచార్యులతో నెట్టుకెళ్తోంది. కళాశాలల్లో ఉండవలసిన అధ్యాపకులు, ఆచార్యుల్లో ఏభైశాతానికి పైగా వీరే. 2009 తర్వాత ఈ రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో పూర్తిస్థాయి ఆచార్యుల భర్తీ జరగలేదు. ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ ఆచార్యుల భర్తీ మాత్రమే అరకొరగా రెండుసార్లు జరిగాయి. ఈ ఆచార్యులే ఇప్పుడు చాలా విభాగాల్ని నిర్వహిస్తున్నారు. తర్వాత ప్రభుత్వాలు కనీసం ఒప్పంద ఆచార్యులతో కూడా ఖాళీలు భర్తీ చేయలేక పోయాయి. అప్పటి వీసీలు ప్రభుత్వాల నుంచి ఆర్థికశాఖల అనుమతులు రాక తమ పదవీకాలాన్ని అతి సాధారణంగా ముగించుకుని వెళ్లిపోయారు. అందుకే ఇప్పుడు విశ్వవిద్యాలయాల్లో అతిథి ఆచార్యులే కీలకంగా మారారు. ఒప్పంద అధ్యాపకులు, ఒప్పంద ఆచార్యుల కంటే ఇది దిగువస్థాయి ఉపాధ్యాయ వృత్తి. కళాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేస్తున్న వారి విద్యార్హతలు యూజీసీ నిర్దేశిత మార్గదర్శకాలకు అనుగుణంగానే వున్నాయి. రాష్ట్రం మొత్తం మీద గెస్ట్ ఫ్యాకల్టీగా పదిహేనేళ్ల నుంచి పనిచేస్తున్న ఉన్నత విద్యావంతులు వేలల్లో వున్నారు. ఇప్పుడు వీరే ఆధారమయ్యారు. ఇటీవల ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులకు ప్రభుత్వం వేతనాలు పెంచింది. గత పదేళ్లుగా విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న అతిథి ఆచార్యుల వేతనాల్ని పైసా కూడా పెంచలేదు. పైగా ప్రతి ఏటా విద్యాసంవత్సరం ఆరంభంలో 'గెస్ట్ ఫ్యాకల్టీని తొలగిస్తున్నారని' అనే వదంతులు షికార్లు చేస్తున్నాయి. ఇది శాశ్వత ఆచార్యులు ఆడుతున్న మానసిక క్రీడగా చెప్పొచ్చు. ఎందుకంటే శాశ్వత ఆచార్యుల కంటే బోధనా సామర్థ్యాలు అధికంగా గల అతిథి ఆచార్యులు రాష్ట్రంలో చాలా మంది వున్నారు. ఇటువంటి పరిణామాలన్నీ పీహెచ్‌డీ, పోస్ట్ డాక్టరల్ డిగ్రీలు పూర్తి చేసి అతిథి ఆచార్యులుగా పని చేసుకుంటున్న వారిపై భారం పెడుతున్నారు.

విజ్ఞానవంతులయిన, మానవ వనరుల్ని అభివృద్ధి చేయవలసిన శాశ్వత ఆచార్యులు అందుకు విరుద్ధంగా అతిథి ఆచార్యులను కృంగదీస్తున్నారనే చెప్పాలి. వివిధశాఖల్లో ఎప్పటికప్పుడు ఆచార్యుల భర్తీ జరగకపోవడానికి ఇదే కారణం. కొత్త ఆచార్యులు వస్తే మన ఆటలు సాగవని భావించి కొంతమంది ఆచార్యులు విభాగాల్ని నిర్వీర్యం చేశారు. ఈ కుట్రని ప్రభుత్వాలు పసిగట్టలేక పోయాయి. అందుకే ప్రస్తుత ప్రభుత్వం ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో అధ్యాపకులు, ఆచార్యుల భర్తీ ప్రక్రియకు చుట్టూ అలుముకున్న అవరోధాల పరిష్కారానికి వీసీలు, రిజిస్ట్రార్లతో జూన్ మొదటివారంలో ముఖ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ప్రకటించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన తర్వాత 2014లో నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత 2017-2018 మధ్య సుమారు రెండు వేల సహాయక, సహ, ఆచార్యుల ఉద్యోగాల భర్తీ కోసం రెండు ప్రకటనలు విడుదల చేశారు. నిర్దేశిత సమయం ప్రకారమే వీటికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. అయితే కొంతమంది ఉపకులపతులు, రోస్టర్ పాయింట్లను నిర్ణయించే అధికారుల తప్పిదాల కారణంగా ఈ రెండు ప్రకటనలు భర్తీ కాకుండా న్యాయస్థానాల్లో నిలిచిపోయాయి. ఆ సమయంలో ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం అతిథి అధ్యాపకుల్ని నియమించుకుంది. వీరు విశ్వవిద్యాలయ బోధనాపద్ధతులను అలవర్చుకుని, పరిశోధన వ్యాసాలు రాసుకుంటూ, సెమినార్లు, వర్క్‌షాప్‌లకు హాజరవుతూ అకడమిక్ పెర్ఫార్మెన్స్ పెంచుకుంటున్నారు. రేపటి ఆచార్యులుగా తయారయ్యేందుకు తగిన విధంగా ఈ అతిథి ఆచార్యులకు ఇది ఉద్యోగం శిక్షణగా నిలిచింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వ హయాంలో విశ్వవిద్యాలయాలు పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాయి. కొందరు వీసీలు అతిథి ఆచార్యుల మీద వేటు వేసి తమకు నచ్చినవారిని తమ ఇష్టానుసారంగా నియమించుకున్నారు.

ఒక్క ఆంధ్ర విశ్వవిద్యాలయంలోనే నాలుగు వందల మంది అతిథి అధ్యాపకుల్ని తొలగించి వీధిన పడేశారు. వైసీపీ ప్రభుత్వం ఎన్నికలకు మూడు నెలల ముందు ఉద్యోగ ప్రకటన చేసి ఫీజుల రూపేణా నిరుద్యోగుల నుంచి కోట్లు కొల్లగొట్టేసారని చెప్తున్నారు. ఒక విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ తానే ముఖ్యమంత్రినన్నట్టు విర్రవీగిపోయి చట్టాలను అతిక్రమించారు. రాష్ట్రంలో గల అన్ని విశ్వవిద్యాలయాలు నాశనానికి ఆయనే నాయకత్వం వహించారు. ఆయన నిర్ణయాల హవా, ప్రభుత్వంలో పలుకుబడి చూసి మిగతా విశ్వవిద్యాలయాల ఉపకులపతులు తమ స్వతంత్ర ఆలోచనల్ని అమలు చేయలేక పోయారు. ఎయిడెడ్ కళాశాలల అధ్యాపకులు, ప్రొఫెసర్లు, ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్, హనరరీ ప్రొఫెసర్లు మొదలయిన పేర్లతో కనీస ప్రకటనలు కూడా చేయకుండా తన సొంతానికి నియమించేసుకుని వర్సిటీలో ఉద్యోగాలు భర్తీ కాకుండా అడ్డుకున్నారు. ఆశావాహుల బతుకుల్ని మంటగలిపారు.

> వైసీపీ నేతలు ఆంధ్రా విశ్వవిద్యాలయం, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ప్రధానంగా తమ హవా కొనసాగించారు. ఉన్నత విద్యావంతులు సమాజాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తారనే ప్రాథమిక విచక్షణ కూడా లేకుండా నాటి ప్రభుత్వం వ్యవహరించింది. అతిథి ఆచార్యులు కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లోనూ, రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లోను కీలకపాత్ర పోషిస్తున్నారు. వీరి ఉద్యోగాలకు యూజీసీ మార్గదర్శకాలు వున్నాయి.

వైసీపీ నేతలు ఆంధ్రా విశ్వ విద్యాలయం, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ప్రధానంగా తమ హవా కొనసాగించారు. ఉన్నత విద్యావంతులు సమాజాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తారనే ప్రాథమిక విచక్షణ కూడా లేకుండా నాటి ప్రభుత్వం వ్యవహరించింది. అతిథి ఆచార్యులు కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లోనూ, రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లోను కీలకపాత్ర పోషిస్తున్నారు. వీరి ఉద్యోగాలకు యూజీసీ మార్గదర్శకాలు వున్నాయి. ప్రత్యేకించి ఉద్యోగాలు భర్తీకాని క్లిష్టపరిస్థితుల్లో ఏపీ విశ్వ విద్యాలయాలకు అండగా నిలిచి అతిథి అధ్యాపకులు సేవలందించారు. కోవిడ్-19 మహమ్మారిలో సైతం ఆన్‌లైన్‌లో తరగతులు బోధించి వెన్నెముకగా నిలిచారు. విభజన ఆంధ్రప్రదేశ్ భవితవ్యమంతా ఇక్కడ విశ్వవిద్యాలయాల మీదే ఆధారపడి వుంది. ఈ విశ్వ విద్యాలయాల మనుగడకు అతిథి ఆచార్యులే సేవలు అందిస్తున్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలు మొదలయ్యాయి. వచ్చే ఏడాది ప్రధానమంత్రి ముఖ్య అతిథిగా, ముఖ్యమంత్రి సమక్షంలో ఈ వేడుకలు జరగనున్నట్టు ఇప్పటికే వర్సిటీ అధికారులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో విశ్వవిద్యాలయాల్లో ఉద్యోగాలు భర్తీ కావలసివుంది. అయినప్పటికీ అతిథి ఆచార్యులు కీలకంగానే కొనసాగుతారు. అలాగే ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయడంలో వీరు కూడా ప్రధాన భూమిక పోషించవలసి వుంటుంది. ఆపై ఉద్యోగాల భర్తీలోను అన్ని అర్హతలు గల అతిథి ఆచార్యులు ముందంజలో నిలుస్తారనడంలో సందేహం ఎవరికీ వుండదు. ఈ క్రమంలో ప్రభుత్వం సైతం వీరికి చేయూతనిచ్చే విధంగా మార్గదర్శకాలు రూపొందించాలి. జూన్ మొదటి వారంలో ఉన్నత విద్యామండలి నిర్వహించనున్న వీసీలు, రిజిస్ట్రార్ల సమావేశంలో విశ్వ విద్యాలయాల్లో ఉద్యోగాల భర్తీనే ప్రధాన అజెండాగా వుంది. ఈ సందర్భంగా ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలన్నీ ఫలప్రదం కావాలని అందరూ కోరుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్ విశ్వవిద్యాలయాలు మేధోసంపత్తితో పూర్వవైభవాన్ని సంతరించుకోవాలనేదే అందరి ఆశ.

సెల్: 9393111740

శాంతి స్నేహ యోధుడు సుకుమారన్

కాగితాల రాజశేఖర్

విశాఖ అంటే సముద్రమూ, ఆంధ్రా యూనివర్సిటీ, యారాడకొండ మదిలో మెదిలినట్టే ఇక్కడ ఏ సాంస్కృతిక కార్యక్రమం జరిగినా చటుక్కున గుర్తుకు వచ్చే పేరు ఎస్. సుకుమారన్. నలుగురు కలిసి ఏ సమావేశం జరుపుకున్న అతన్నొకసారి వెచ్చగా తలవాల్సిందే. అంతలా అందరికీ స్నేహపాత్రుడైన సుకుమారన్ ఒక్కసారిగా మే 20, 2025న శాంతి, స్నేహ, సాంస్కృతిక ఉద్యమాలకు దూరమై పోయాడు. భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం (ఇస్కస్) జాతీయ కార్యదర్శిగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షుడిగా సుకుమారన్ విశిష్ట సేవలు అందించారు. దేశవ్యాప్తంగా ఇస్కఫ్‌లో పని చేస్తున్న ఎందరో నాయకులూ, కార్యకర్తలను పేర్లతోనే పలకరించేంత సాన్నిహిత్యం సుకుమారన్‌కు ఉండేది. ఇస్కఫ్‌తో దాదాపు యాభై సంవత్సరాల అనుబంధం ఆయనది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ, రాష్ట్రం విడిపోయిన తర్వాత ఇస్కఫ్ కార్యకలాపాల్లోనూ, నిర్మాణంలోనూ ఆయన పాత్ర ఎనలేనిది.

1954, జూన్ 11న విజయవాడలో ఇండో సోవియట్ మిత్ర మండలి (ఇస్కస్) ఏర్పాటు అయినప్పటి నుంచి సోవియట్ యూనియన్ అంతర్ధానం అయ్యాక 1993లో ఇస్కఫ్‌గా పేరు మార్చుకునేంత వరకు ఉప్పల లక్ష్మణరావు, వేములపల్లి శ్రీకృష్ణ, పద్మావతి శాస్త్రి, గూడవల్లి నాగేశ్వరరావు, కె. సుబ్బరాజు లాంటి ఎందరో ప్రముఖులు ఈ సంస్థకు రాష్ట్రంలో వన్నెతెచ్చారు. ఇప్పుడు వీరి సరసన టీఎస్ సుకుమారన్ నిలిచారు. శాంతి, స్నేహ, సాంస్కృతిక పయనంలో ఆయన పేరు ఒక మైలురాయిగా నిలుస్తుంది. ఆయనతో కలిసి పనిచేసిన జ్ఞాపకాలు, జరిపిన కార్యక్రమాలు ఇంకా మదిలో మెదులుతూనే వున్నాయి. దాదాపు 16 రాష్ట్రాల కళాకారులను ఒక వేదిక మీదకు తీసుకువచ్చి నాలుగుసార్లు అంతర్రాష్ట్ర సాంస్కృతిక ఉత్సవాలు విశాఖపట్నంలో ఒంటిచేత్తో నిర్వహించిన కార్యదక్షుడు సుకుమారన్. కేరళ నుంచి ఉద్యోగరీత్యా విశాఖపట్నం వచ్చి అందరితో కలిసిపోయిన సుకుమారన్ బహుముఖ ప్రజ్ఞాశాలి. బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల సంఘంలోనూ, భారత కమ్యూనిస్టు పార్టీ విశాఖ శాఖలోను, విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్‌గాను ఆయన సేవలు అందించారు. ఈ ఏడాది ఏప్రిల్ 26, 27 తేదీల్లో మదనపల్లిలో జరిగిన ఇస్కఫ్ రాష్ట్ర 20వ మహాసభలో పాల్గొని సభల విజయవంతానికి కృషిచేసి మార్గదర్శకుడిగా నిలిచారు. ఇస్కఫ్‌కు ఆయన అందించిన సేవలకు రాష్ట్ర మహాసభ ఆయనను సత్కరించింది. రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి వైదొలిగి అధ్యక్షవర్గ సభ్యులుగా ఎన్నిక అయ్యారు.

> రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, ఇజ్రాయిల్-పలస్తీనా పోరు, నేపాల్లో మళ్లీ రాచరికంకోసం జరుగుతున్న హింసాత్మక ఆందోళనలు మానవాళికి ఆందోళకరంగా వున్నాయని, ప్రపంచం పురోగమనం సాధించాలంటే యుద్ధాల ద్వారా కాదని, శాంతి, పరస్పర గౌరవం, సంభాషణల ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని ఇస్కఫ్ తన కార్యకలాపాల ద్వారా తెలియ చేయాలని సుకుమారన్ ఎప్పుడు అనేవారు.

కశ్మీర్‌లోని పహల్గాం జిల్లాలో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది అమాయక ప్రజలను హత్య చేయటాన్ని ఖండించాలని ఇస్కఫ్ రాష్ట్ర మహాసభలో తీర్మానాన్ని సుకుమారన్ ప్రవేశపెట్టారు. ఈ దాడిని ఖండిస్తూ కశ్మీర్ ప్రజలు, ముఖ్యంగా ముస్లింలు రోడ్డెక్కి నిరసన వ్యక్తంచేసిన తీరు కూడా దేశ ప్రజలు గమనించాలని, మతసామరస్యాన్ని పాటించాలని, మతోన్మాదాన్ని ఖండించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం గతంలో ఆర్టికల్ 370, 35ఎ రద్దు చేస్తే మౌలిక సమస్యలు పోతాయని ప్రకటించినా, అవి సరైన ఫలితాన్ని ఇవ్వలేదని ఈ ఘటన నిరూపించిందని సుకుమారన్ అనటం గుర్తుకు వస్తుంది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, ఇజ్రాయిల్-పలస్తీనా పోరు, నేపాల్లో మళ్లీ రాచరికంకోసం జరుగుతున్న హింసాత్మక ఆందోళనలు మానవాళికి ఆందోళకరంగా వున్నాయని, ప్రపంచం పురోగమనం సాధించాలంటే యుద్ధాల ద్వారా కాదని, శాంతి, పరస్పర గౌరవం, సంభాషణల ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని ఇస్కఫ్ తన కార్యకలాపాల ద్వారా తెలియ చేయాలని సుకుమారన్ ఎప్పుడు అనేవారు. మెరుగైన సమాజం కోసం, మంచి భవిష్యత్తు కోసం జరిగిన అన్ని పోరాటాల్లోనూ సుకుమారన్ ముందు వుండేవారు. బయటకు కఠినంగా అనిపించినా అసలు విషయంలో మాత్రం స్పష్టత, నిజాయితీగల వాదన చేసేవారు. సుకుమారన్ భౌతికంగా దూరమైనా ఆయన ఇస్కఫ్ కార్యక్రమాల్లో, పోరాటాల్లో సజీవంగానే వుంటారు.

అధ్యక్షులు, ఇస్కఫ్, ఆంధ్ర ప్రదేశ్

(విశాఖపట్నంలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఈ రోజు సుకుమారన్ సంస్మరణ సభ జరుగుతున్న సందర్భంగా)

క్షమాపణ చెప్పను : కమల్ హాసన్

చెన్నై: కన్నడ భాషపై తాను చేసిన వ్యాఖ్యల విషయంలో క్షమాపణలు చెప్పాలని వస్తున్న డిమాండ్లను ప్రముఖ సినీనటుడు కమల్ హాసన్ తోసిపుచ్చారు. తప్పు చేస్తేనే క్షమాపణ చెబుతానని ఆయన తెగేసి చెప్పారు. 'థగ్ లైఫ్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఆయన కన్నడ భాషపై చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. ఈ నేపథ్యంలో ఓ ఇంటర్వ్యూలో తాజాగా కమల్‌హాసన్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. 'నేను ఏ విషయంలోనైనా తప్పు చేస్తేనే క్షమాపణ చెబుతాను. లేదంటే చెప్పను. అది నా శైలి. భారత్ ప్రజాస్వామ్య దేశం. నేను చట్టాన్ని, న్యాయాన్ని నమ్ముతాను. వాటిని గౌరవిస్తాను' అని చెప్పారు. ఈ విషయంలో ప్రజలు జోక్యం చేసుకోవద్దని కోరారు. తమిళం నుంచి కన్నడ పుట్టిందంటూ కమల్ చేసిన వ్యాఖ్యలపై ఇప్పటికే అధికార, విపక్ష పార్టీలు ఆగ్రహం వ్యక్తంచేయగా... కర్నాటక ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కూడా తీవ్రంగా స్పందించింది. కమల్‌హాసన్ క్షమాపణ చెప్పకుంటే... ఆయన 'థగ్ లైఫ్' సినిమా విడుదలను రాష్ట్రంలో అడ్డుకుంటామని బెదిరించింది. మరోవైపు తన వ్యాఖ్యలపై ఇప్పటికే కమల్ హాసన్ వివరణ ఇచ్చారు. అవి ప్రేమతో చేసిన వ్యాఖ్యలేనని, ప్రేమ ఎన్నడూ క్షమాపణ చెప్పదన్నారు. భాష చరిత్ర గురించి ఎంతోమంది చరిత్రకారులు తనకు చెప్పారని, తన వ్యాఖ్యల్లో మరో ఉద్దేశం లేదన్నారు. అయితే, భాష గురించి మాట్లాడే అర్హత రాజకీయ నాయకులకు లేదని, ఇది తనకు కూడా వర్తిస్తుందన్నారు.

శశి థరూర్ బాటలో సల్మాన్ ఖుర్షీద్



న్యూఢిల్లీ: మోదీ సర్కారుపై కాంగ్రెస్ నేతలు వరుసగా ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇప్పటి వరకు కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ మోదీ ప్రభుత్వాన్ని కొనియాడుతుండగా తాజాగా మరోనేత సల్మాన్ ఖుర్షీద్ కూడా అదే బాట పట్టారు. కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సల్మాన్ ఖుర్షీద్ కొనియాడారు. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించిన ఆర్టికల్ 370 రద్దుపై కితాబిచ్చారు. ఆపరేషన్ సిందూర్‌పై ఏర్పాటైన అఖిలపక్ష బృందంలో భాగంగా ఇండోనేసియాలో పర్యటించిన సందర్భంగా ఖుర్షీద్ ఈ వ్యాఖ్యలు చేశారు. 'కశ్మీర్‌కు చాలాకాలం ఒక పెద్ద సమస్య ఉండేది. ప్రత్యేక ప్రతిపత్తి కారణంగా అది దేశంలోని మిగిలిన ప్రాంతాలతో వేరే అనే భావన కలిగించేది. కానీ ఆర్టికల్ 370 రద్దుతో ఆ భావనను అంతం చేశారు' అని అన్నారు. ఆ ప్రాంతంలో సానుకూల మార్పు, అభివృద్ధివైపు పయనానికి ఈ రద్దు దోహదం చేసిందనే అభిప్రాయం వ్యక్తం చేశారు. అక్కడ ఎన్నికలు జరిగాయని, 65 శాతం మంది ప్రజలు ఎన్నికల్లో పాల్గొన్నారన్నారు. ఇప్పుడు అక్కడ ఎన్నికైన ప్రభుత్వం ఉందని అన్నారు. ఉగ్రవాదంపై పాకిస్థాన్ అనుసరిస్తున్న విధానాన్ని ఎండగట్టేందుకు భారత పార్లమెంటరీ అఖిలపక్ష ప్రతినిధి బృందాలు పలు దేశాల్లో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. ఇండోనేసియా, మలేసియా, దక్షిణ కొరియా, జపాన్, సింగపూర్ దేశాల్లో పర్యటిస్తోన్న బృందంలో సల్మాన్ ఖుర్షీద్ సభ్యుడిగా ఉన్నారు.

కులం, మతం వీడండి

విద్యార్థులకు హీరో విజయ్ సూచన

చెన్నై: కుల, మత అంశాలతో మనసు పాడుచేసుకోవద్దని 'తమిళగ వెట్రి కళగం' అధినేత, ప్రముఖ హీరో విజయ్ విద్యార్థులకు సూచించారు. వాటి ఆధారంగా విభజనను తోసిపుచ్చాలని కోరారు. 10, 12 తరగతుల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించిన అనంతరం విజయ్ పలు సూచనలు చేశారు. ఈ ప్రకృతికి మతం, కులం ఉన్నాయా అని ప్రశ్నించారు. తమిళనాడు రాజధాని చెన్నైలో నిర్వహించిన కార్యక్రమంలో విజయ్ మాట్లాడుతూ 'ప్రజాస్వామ్యం అందరికీ సమాన అవకాశాలు ఇచ్చింది. ప్రజాస్వామిక విలువలు పాటించాలని మీ కుటుంబ సభ్యులకు చెప్పండి. అవినీతి కార్యకలాపాలకు దూరంగా ఉండే... విశ్వసనీయత కలిగిన వ్యక్తులకు ఓటు వేయాలని కోరండి. కులం, మతం ఆధారంగా విభజనను తోసిపుచ్చండి. అలాంటి అంశాలతో మీ మనసు పాడుచేసుకోకండి. సూర్యుడు, వరణుడు... వంటి వాటితో నెలవైన ప్రకృతికి ఆ భేదం ఉందా? డ్రగ్స్‌ను దూరం పెట్టినట్టే కులం, మతం వంటి వాటినీ దరిచేరనీయొద్దు. ప్రజాస్వామ్యం ఉన్నప్పుడే ఈ ప్రపంచంలో స్వేచ్ఛ ఉంటుంది' అని సూచించారు. విజయ్ అధికార డీఎంకేను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. బీజేపీపైనా విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు.

పాక్ ఐఏకి భారత్ సిమ్‌కార్డుల సరఫరా...వ్యక్తి అరెస్ట్

న్యూఢిల్లీ: పాకిస్థాన్ నిఘా సంస్థ ఐఎస్ఐ భారత్‌లో విధ్వంసం సృష్టించడమే లక్ష్యంగా భారత పౌరులనే లక్ష్యంగా చేసుకుని గూఢచర్య కార్యకలాపాలు నిర్వహిస్తోంది. వివిధ ప్రలోభాలకు గురిచేసి ఇండియన్ ఆర్మీ, సైనిక స్థావరాల రహస్యాలను చేజిక్కించుకుంటోంది. 'పహల్గాం' ఉగ్రదాడి తర్వాత భారత్‌లో ఉంటూ పాక్‌కు సహకరిస్తున్నవారిపై ప్రభుత్వం నిఘా సారించింది. తాజాగా పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ ఆపరేటివ్స్‌కు అక్రమంగా భారత సంస్థల మొబైల్ సిమ్ కార్డులను సరఫరా చేస్తున్న రాజస్థాన్‌కు చెందిన కాసిమ్ (34) అనే వ్యక్తిని ఢిల్లీ పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. డీగ్ జిల్లాలోని గంగోరా గ్రామానికి చెందిన కాసిమ్ ... రెండుసార్లు పాకిస్థాన్‌కు వెళ్లాడని , దాదాపు 90 రోజులపాటు అక్కడే ఉన్నాడని అధికారులు తెలిపారు. మొదటిసారి ఆగస్టు, 2024, రెండోసారి మార్చి, 2025 లో పాక్‌కు వెళ్లాడని చెప్పారు. పాక్ గూఢచారి సంస్థ ఇంటర్-సర్వీసెస్ ఇంటెలిజెన్స్ అధికారులను కలిసినట్లు అనుమానాలున్నాయని ఒక సీనియర్ పోలీసు అధికారి వెల్లడించారు. భారత సైన్యంతోపాటు ప్రభుత్వ సంస్థల కీలక సమాచారాన్ని సేకరించడానికి భారత మొబైల్ నంబర్లను దుర్వినియోగం చేస్తున్నాడని స్పెషల్ సెల్‌కు నిఘా సమాచారం అందింది. మొబైల్ సిమ్ కార్డులను భారత్‌లో కొనుగోలు చేసి, ఇక్కడి పౌరుల సహాయంతో సరిహద్దు మీదుగా పాక్‌కు పంపాడనే ఆరోపణలున్నాయని ఆయనపై ఉన్నాయని తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు చట్టప్రకారం కాసిమ్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నామన్నారు.

జర్నలిస్టుల ముసుగులో పాక్ గూఢచారులు

సీఆర్‌పీఎఫ్ ఏఎస్ఐ కీలక సమాచారం లీక్

న్యూఢిల్లీ: టీవీ జర్నలిస్టుల ముసుగులో సీఆర్‌పీఎఫ్ అధికారికి పాక్ గూఢచారులు గాలం వేస్తున్నారు. కీలక సమాచారం లీక్ చేస్తే ప్రోత్సాహకాలు ఇచ్చారు. ఇటీవల ఢిల్లీలో అరెస్టైన సీఆర్‌పీఎఫ్ ఏఎస్ఐ మోతీరామ్ జాట్‌ను విచారించే కొద్దీ కీలక విషయాలు బయటపడుతున్నాయి. పహల్గాం ఉగ్రదాడి జరిగిన కొన్ని గంటలకే హోంమంత్రి అమిత్‌షా పర్యటన వివరాలు, 50 పర్యాటక ప్రాంతాల మూసివేత, సీఆర్‌పీఎఫ్ బలగాల సంఖ్య, వాటి కదలికలు, పహల్గాం ఉగ్రవాదులు నక్కినట్లు బలగాలు అనుమానిస్తున్న ప్రదేశాలు వంటి కీలక సమాచారాన్ని అతడు పాక్‌కు చేరవేసినట్లు అధికారులు గుర్తించినట్లు ఓ ఆంగ్లపత్రిక పేర్కొంది. అతడు దాదాపు రెండేళ్లుగా టీవీ జర్నలిస్టుల ముసుగులో ఉన్న పాక్ ఇంటెలిజెన్స్ అధికారులకు నిరంతరం టచ్‌లో ఉన్నట్లు గుర్తించారు. పహల్గాం ఉగ్రదాడి జరిగిన ఏప్రిల్ 22కు దాదాపు ఐదు రోజుల ముందు వరకు అతడు అక్కడి సీఆర్‌పీఎఫ్ బెటాలియన్‌లోనే విధులు నిర్వహించాడు. 'చండీగఢ్‌కు చెందిన ఓ ప్రముఖ న్యూస్ ఛానల్ రిపోర్టర్‌గా తనను తాను పరిచయం చేసుకొంటూ ఓ మహిళ అతడిని సంప్రదించింది. కొంత సమాచారం ఇవ్వాలని ఆమె కోరింది. వీరి మధ్య కొన్ని ఫోన్, వీడియో కాల్స్, మెసేజ్‌లు చోటుచేసుకొన్నాయి. ఆ తర్వాత నుంచి మోతీరామ్ జాట్ ఆమెకు కీలక సమాచారం ఇవ్వడం మొదలుపెట్టాడు. ఆ తర్వాత మూడు నెలలకు పాక్‌కు చెందిన ఇంటెలిజెన్స్ అధికారి ఒకడు అదే న్యూస్ ఛానెల్‌లో పని చేస్తున్నట్లు చెప్పి పరిచయం చేసుకున్నాడు. అతడు భద్రతా దళాల మోహరింపునకు సంబంధించి కీలక సమాచారం, పత్రాలు పాక్‌కు అందించాడు. వీటిల్లో దళాల కదలికలు, మల్టీ ఏజెన్సీ సెంటర్ ఇంటెలిజెన్స్ నివేదికలు, ఉగ్రవాదుల కదలికలను గుర్తించిన లొకేషన్లు కూడా వీటిల్లో ఉన్నాయి. బహిరంగంగా అందుబాటులో ఉన్న సమాచారాన్ని పంపొద్దని పాక్‌కు చెందిన వ్యక్తి మోతీరామ్‌కు సూచించాడు. పాక్‌లోని వ్యక్తులతో సంబంధాలు మొదలైన నాటినుంచి ప్రతినెలా నాలుగో తేదీన రూ.3,500 అతడికి అందాయి. కీలక సమాచారం అందజేసిన ప్రతిసారీ రూ.12 వేలు ముట్టజెప్పారు. ఈ సొమ్మును మోతీరామ్, అతడి భార్య ఖాతాకు అందేవి. అమిత్‌షా పర్యటన, పహల్గాం ఉగ్రదాడికి సంబంధించిన సమాచారం బహిరంగంగానే అందుబాటులో ఉంది. కానీ, అతడు ఢిల్లీ వెళ్లాక కూడా... భద్రతా కారణాలతో కశ్మీర్‌లో మూతపడిన 50 పర్యాటక ప్రాంతాల జాబితాను పాక్‌కు అందజేశాడు' అని సీఆర్‌పీఎఫ్ వర్గాలు పేర్కొన్నాయి. మోతీరామ్ పాక్‌కు అందించిన సమాచారానికి సంబంధించి ఎటువంటి మెసేజ్‌లను ఫోన్ నుంచి డిలీట్ చేయలేదని అధికారులు గుర్తించారు.

295 మంది పోలీసులకు పదోన్నతి

చత్తీస్‌గఢ్ ప్రభుత్వ ఉత్తర్వులు

రాయ్‌పూర్: మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలలో ప్రధానంగా బస్తర్ డివిజన్‌లో ధైర్యసాహసాలతో విధులు నిర్వహిస్తున్న క్రింది, మధ్యస్థాయి అధికారులు సహా 295 మంది పోలీసు సిబ్బందికి చత్తీస్‌గఢ్‌లోని బీజేపీ ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. పోలీసుల పదోన్నతికి సంబంధించిన ఉత్తర్వును పోలీస్ డైరెక్టర్ జనరల్ (డీజీపీ) అరుణ్ డియో గౌతమ్ గురువారం సాయంత్రం జారీ చేశారు. ఈ విషయాన్ని అధికారులు శుక్రవారం వెల్లడించారు. హోం శాఖ బాధ్యతలు చూస్తున్న ఉప ముఖ్యమంత్రి విజయ్ శర్మ తన సోషల్ మీడియా ఖాతాలో పదోన్నతి ఉత్తర్వులను పంచుకున్నారు. 'మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలలో ధైర్యం, అంకితభావంతో పనిచేస్తున్న 295 మంది పోలీసు సిబ్బందికి పదోన్నతి అభినందనలు' అని ఆయన పేర్కొన్నారు. 'రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి మావోయిస్టులకు వ్యతిరేకంగా ముందు వరుసలో పోరాడుతున్నప్పుడు పోలీసులు అజేయమైన ధైర్యాన్ని ప్రదర్శించారు. సైనికుల ఆయుధ బలంతో భవిష్యత్‌లో బస్తర్ అభివృద్ధి, ఆనందం, శాంతి, కొత్త ఉత్సాహంతో నిండి ఉంటుంది' అని శర్మ అన్నారు. పదోన్నతి పొందిన సిబ్బందిలో దుర్గ్ డివిజన్‌లోని మోహ్లా-మన్‌పూర్-అంబాఘర్ చౌకి జిల్లాలో ఒక జవాను మాత్రమే పదోన్నతి పొందగా, మిగిలిన వారు ఏడు జిల్లాలతో కూడిన బస్తర్ డివిజన్‌లోని స్పెషల్ టాస్క్ ఫోర్స్, ఇంటెలిజెన్స్ బ్రాంచ్ సహా వివిధ పోలీసు యూనిట్లకు అనుబంధంగా ఉన్నారని ఒక అధికారి తెలిపారు. ఉప ముఖ్యమంత్రి శర్మ విలేకరులతో మాట్లాడుతూ 'మన జవాన్ల బలం, ధైర్యసాహసాల ఆధారంగా బస్తర్ నుంచి వామపక్ష ఉగ్రవాదాన్ని నిర్మూలిస్తున్నాం' అని అన్నారు. బంగ్లాదేశ్ నుంచి వచ్చిన వారితో సహా అక్రమ వలసదారులను గుర్తించి... వారిపై చర్యలు తీసుకోవడానికి రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ఒక ఎస్‌టీఎఫ్ ఏర్పాటు చేసినట్లు ఒక ప్రశ్నకు సమాధానంగా శర్మ చెప్పారు. బంగ్లాదేశ్ జాతీయులు నకిలీ గుర్తింపులు పొంది చత్తీస్‌గఢ్‌లో అక్రమంగా నివసిస్తున్నట్లు గుర్తించిన చాలా కేసులు వెలుగులోకి వచ్చాయని హోంమంత్రి నొక్కి చెప్పారు. 'వారి వ్యక్తిగత వివరాలను ధ్రువీకరించకుండా ఎవరికీ ఇళ్లు అద్దెకు ఇవ్వవద్దని రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాను. ప్రజలు తమ అద్దెదారుల వివరాలను స్థానిక పోలీసులతో పంచుకోవాలి' అని ఆయన అన్నారు.

ఈడీ డిప్యూటీ డైరెక్టర్ అరెస్ట్

భువనేశ్వర్: సమాజంలో అవినీతిని కట్టడి చేయాల్సిన అధికారులే లంచాలకు అలవాటుపడ్డారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ డిప్యూటీ డైరెక్టర్ చింతన్ రఘువంశీని సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ అధికారులు రూ.20 లక్షల లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు.

2013 బ్యాచ్ ఇండియన్ రెవెన్యూ సర్వీస్ (ఐఆర్ఎస్) అధికారి అయిన రఘువంశీ, ఓ మైనింగ్ కేసును పరిష్కరించేందుకు ఏకంగా రూ.50 లక్షల లంచం డిమాండ్ చేశాడు. ఒక మైన్ ఆపరేటర్... రఘువంశీ లంచం అడిగిన విషయాన్ని సీబీఐకి సమాచారం అందించగా... పక్కా ప్రణాళికతో చింతన్ రఘువంశీని అదుపులోకి తీసున్నారు. ఒకటిన్నర సంవత్సరాలుగా భువనేశ్వర్ జోనల్ ఆఫీస్‌లో ఈడీ డిప్యూటీ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న రఘువంశీని శుక్రవారం ఉదయం అధికారులు అరెస్ట్ చేసి భువనేశ్వర్‌లోని సీబీఐ ప్రధాన కార్యాలయంలో ప్రశ్నిస్తున్నారు. పూర్తి విచారణ తర్వాత మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వస్తాయి.

బాణసంచా ఫ్యాక్టరీలో పేలుడు

ఐదుగురు కార్మికుల మృతి



చండీగఢ్: పంజాబ్‌లో గురువారం అర్ధరాత్రి ఘోర ప్రమాదం జరిగింది. బాణసంచా ఫ్యాక్టరీలో భారీ పేలుడు సంభవించి ఐదుగురు కార్మికులు చనిపోగా... 27 మందికి గాయాలయ్యాయి. కాంట్రాక్టర్ పరారీలో ఉన్నాడు. లంబి నియోజకవర్గానికి సమీపంలోని సింఘేవాలా-ఫుతుహివాలా గ్రామంలోని పొలాల్లో ఉన్న బాణసంచా కర్మాగారంలో భారీ పేలుడు సంభవించింది. ఈ పేలుడులో ఫ్యాక్టరీ భవనంలోని రెండంతస్తులు పేక ముక్కలా కుప్పకూలాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని... శిథిలాల నుండి ముగ్గురి మృతదేహాలను బయటకు తీశారు. గాయపడిన 27 మందిని బఠిండా ఎయిమ్స్‌కు తరలించారు. కర్మాగారంలో బాణసంచా తయారీ ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్ నివాసి అయిన కాంట్రాక్టర్ రాజ్ కుమార్ అధ్వర్యంలో జరుగుతుంది. ఫ్యాక్టరీ ప్యాకింగ్ యూనిట్‌లో పనిచేస్తున్న వలస కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం దాదాపు 40 మంది కార్మికులు రెండు షిఫ్టులలో పనిచేస్తున్నారు. ఎక్కువమంది ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాలకు చెందినవారన్నారు.

బీఎస్‌ఎఫ్ దెబ్బకు పాక్ కకావికలం: అమిత్ షా



శ్రీనగర్: పాకిస్థాన్ దుశ్చర్యలను దీటు గా తిప్పికొట్టిన భారత సరిహద్దు భద్రతా దళాల (బీఎస్‌ఎఫ్)పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రశంసలు కురిపించారు. సైనిక ఆపరేషన్ సమయంలో పాక్‌లోని 118 పోస్టులను మన దళాలు ధ్వంసం చేశాయని అన్నారు. వారి సమాచార, నిఘా నెట్‌వర్క్‌ను కూల్చివేశాయన్నారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారిగా జమ్మూకశ్మీర్‌లో పర్యటించిన అమిత్‌షా... బీఎస్ఎఫ్ కొట్టిన దెబ్బకు పాకిస్థాన్ కోలుకునేందుకు కొన్నేళ్లు పడుతుంద న్నారు. 'ఉగ్రవాద స్థావరాలే లక్ష్యంగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు ప్రతిస్పందనగా పాకిస్థాన్ సైన్యం మన సరిహద్దులోని పౌరులపై దాడులు చేసింది. వీటిని మన బీఎస్ఎఫ్ దళాలు దీటుగా తిప్పికొట్టాయి. దాదాపు 118 పాక్ పోస్టులను ధ్వంసం చేశాయి. శత్రువుల నిఘా వ్యవస్థను ఒక్కొక్కటిగా కూల్చివేశాయి. వాటిని పునరుద్ధరించేందుకు శత్రువులకు దాదాపు నాలుగు నుంచి ఐదేళ్లు పడుతుంది' అని అమిత్ షా చెప్పారు. బీఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ నుంచి తనకు అందించిన సమాచారం ప్రకారం... పాక్ సైనిక సమాచార, నిఘా వ్యవస్థలకు భారీ దెబ్బ తగిలిందన్నారు. కొంతకాలం పూర్తి సమాచార ఆధారిత యుద్ధం చేసే పరిస్థితిలో వారు లేరన్నారు. బీఎస్ఎఫ్ సంసిద్ధతపై అమిత్ షా ప్రశంసలు కురిపించారు. అప్రమత్తంగా ఉంటూ స్పష్టమైన వ్యూహాలను విజయవంతంగా అమలు చేశారని కొనియాడారు. భారత సరిహద్దులో ఎటువంటి దాడులు జరిగినా మొదట ఆ భారాన్ని మోసేది బీఎస్ఎఫ్ జవాన్లేనని అన్నారు. జమ్మూ కశ్మీర్‌లో రెండు రోజుల పర్యటనలో భాగంగా ఇటీవల పాకిస్థాన్ జరిపిన దాడుల సందర్భంగా నష్టపోయిన కుటుంబాలను అమిత్ షా పరామర్శించారు. పాక్ దాడుల్లో దెబ్బతిన్న ఇళ్లు, వ్యాపార కేంద్రాలు, ప్రార్థనా మందిరాలకు సంబంధించిన పరిహార ప్యాకేజీని కేంద్రం త్వరలో ప్రకటిస్తుందన్నారు. పాక్ దాడుల్లో దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించిన ఆయన అక్కడి స్థానికులతో మాట్లాడారు.

ఉగ్రవాదులు హతమైతే సంతాపమా

కొలంబియా ప్రభుత్వ తీరుపై శశిథరూర్

న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌లో ప్రాణాలు కోల్పోయిన వారికి కొలంబియా ప్రభుత్వం సంతాపం తెలపడంపై కాంగ్రెస్ నాయకుడు శశిథరూర్ అసహనం వ్యక్తం చేశారు. ఉగ్రవాదంపై పాకిస్థాన్ అనుసరిస్తున్న విధానాన్ని ఎండగట్టేందుకు భారత పార్లమెంటరీ అఖిలపక్ష ప్రతినిధి బృందాలు పలు దేశాల్లో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. అందులో శశిథరూర్ నాయకత్వంలోని బృందం కొలంబియా వెళ్లింది. అక్కడ ఆయన మీడియాతో మాట్లాడుతూ 'ఉగ్రవాద దాడుల బాధితులపై సానుభూతి వ్యక్తపరచకుండా... భారత్ దాడుల తర్వాత పాక్‌లో ప్రాణాలు కోల్పోయిన వారికి కొలంబియా ప్రభుత్వం సంతాపం తెలపడం మమ్మల్ని నిరాశ పరిచింది. మా ఆత్మరక్షణ హక్కును మాత్రమే మేము వినియోగించుకున్నాం. ఆపరేషన్ సిందూర్‌కు దారితీసిన పరిస్థితుల గురించి కొలంబియా అధికారులతో వివరంగా మాట్లాడేందుకు సిద్ధంగా ఉన్నాం. ఈ దేశం కూడా అనేక ఉగ్రదాడులు చూసింది.

దాదాపు నాలుగు దశాబ్దాలుగా భారత్ అనేక దాడులు భరించింది. పాకిస్థాన్ తన సైనిక పరికరాలను వారి రక్షణ కోసం కాకుండా... పక్క దేశాలపై దాడి కోసం వినియోగిస్తోంది. ఉగ్రదాడికి వ్యతిరేకంగా మాత్రమే మా విధానాలు ఉంటాయి' అని థరూర్ చెప్పారు. పహల్గాం దాడి వెనక పాక్ ప్రాయోజిత ఉగ్రవాదం ఉందనడానికి భారత్ వద్ద కచ్చితమైన ఆధారాలున్నాయని థరూర్ వెల్లడించారు. పాక్‌లోని మొత్తం రక్షణ పరికరాల్లో 81 శాతం చైనా నుంచి అందుతున్నవేనని తెలిపారు.

విజిలెన్స్‌కు చిక్కిన అవినీతి తిమింగలం

భువనేశ్వర్: ఒడిశాలోని భువనేశ్వర్‌లో ఓ భారీ అవినీతి తిమింగలం విజిలెన్స్‌కు చిక్కింది. రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖలో చీఫ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న బైకుంతనాథ్ సారంగి నివాసాల్లో భారీ మొత్తంలో నోట్ల కట్టలు బయటపడ్డాయి. సారంగి ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణల నేపథ్యంలో అధికారులు సోదాలు చేపట్టారు. ఒడిశాలోని అంగుల్, భువనేశ్వర్, పూరిలోని పిపిలి సహా మొత్తం ఏడు ప్రాంతాల్లోని సారంగి నివాసాలు, కుటుంబ సభ్యులు, సన్నిహితుల ఇళ్లలో అధికారులు ఏకకాలంలో దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో దాదాపు రూ.2.1 కోట్ల నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ అధికారులు తన ఫ్లాట్ వద్దకు రాగానే సారంగి ఇంట్లో ఉన్న నోట్ల కట్టలను కిటికీలోంచి బయటపడేసేందుకు ప్రయత్నించాడు. వెంటనే అతడిని అదుపులోకి తీసుకుని సొమ్ము స్వాధీనం చేసుకున్నారు. అంగుల్‌లోని అతడి నివాసంలో జరిపిన సోదాల్లో రూ.1.1 కోట్లు, భువనేశ్వర్ ఫ్లాట్‌లో మరో రూ.కోటి దొరికాయి. నగదుతోపాటు పలు పత్రాలు, బంగారు ఆభరణాలను కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎనిమిది మంది డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అధికారులు, 12 మంది ఇన్‌స్పెక్టర్లు, ఆరుగురు అసిస్టెంట్ సబ్-ఇన్‌స్పెక్టర్లు సహా 26 మంది పోలీసు అధికారుల బృందంతో పాటు ఇతర సహాయక సిబ్బంది సోదాల్లో పాల్గొన్నారు.

కరోనా విజృంభణ

1828కి పెరిగిన కేసులు

న్యూఢిల్లీ: కరోనా ప్రపంచాన్ని మరోసారి అతలాకుతలం చేస్తోంది. అమెరికా, సింగపూర్, హాంకాంగ్, థాయిలాండ్ దేశాలలో ఇప్పటికే అనేక ఆసుపత్రులు కరోనా కేసులతో నిండిపోయాయి. భారతదేశంలోనూ కరోనా వేగంగా వ్యాప్తి చెందుతోంది. దేశంలో 1,828 యాక్టివ్ కేసులు నమోదయ్యాయి. 15 మంది కరోనాతో మృతి చెందారు. అందులో ఆరుగురు మహారాష్ట్రకు చెందిన వారు ఉన్నారు. గుజరాత్‌లో గురువారం ఆరు కొత్త కేసులు నమోదయ్యాయి. వారిలో 8 నెలల శిశువు కూడా ఉంది. ప్రస్తుతం ఆ శిశువు ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. కేరళలో మొత్తం 727 యాక్టివ్ కేసులు నమోదయ్యాయి. రాష్ట్రంలో ఓమిక్రాన్ జేఎన్ వేరియంట్ ఎల్ఎఫ్ 7 కేసులు పెరుగుతున్నాయని ముఖ్యమంత్రి పినరయి విజయన్ ధృవీకరించారు. జనవరి నుంచి మహారాష్ట్ర కోవిడ్ పరీక్షలు నిర్వహించగా మొత్తం ఇప్పటి వరకు 9,500కి పైగా కేసులు నమోదయ్యాయి. గురువారం ఒక్క రోజే 79 కొత్త కేసులు నమోదు అయినట్లు తెలుస్తోంది. ముంబైలో 373 కేసులు పెరిగాయి. జమ్మూకశ్మీర్‌లో గురువారం రెండు కొత్త కేసులు నిర్ధారించారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ కరోనా కేసులు నమోదవుతున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మాస్కులు ధరించాలని వైద్యులు సూచిస్తున్నారు.

స్తంభించిన జనజీవనం

- కర్నాటకలో కుండపోత
- కొండచరియలు విరిగిపడి ముగ్గురి మృతి
- కేరళలో పొంగుతున్న నదులు







తిరువనంతపురం/బెంగళూరు : దేశంలోని అనేక ప్రాంతాలలో రుతుపవన వర్షాలు ప్రజా జీవనాన్ని స్తంభింపజేశాయి. కేరళను శుక్రవారం తెల్లవారుజామున బలమైన గాలులతో కూడిన భారీ వర్షాలు ముంచెత్తాయి. దీంతో నివాస ప్రాంతాలు నీట మునిగాయి. ఇళ్లకు నష్టం వాటిల్లింది. కనీసం 1,200 మంది పౌరులు ప్రభుత్వం నిర్వహించే సహాయ శిబిరాల్లో ఆశ్రయం పొందవలసి వచ్చింది. భారీ వర్షాల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. కేరళలో నదుల్లో నీటి మట్టం పెరగడంతో వాటి ఒడ్డున నివసించే ప్రజలకు హై అలర్ట్ ప్రకటించారు.

దక్షిణ కన్నడ జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడిన వేర్వేరు సంఘటనల్లో ఇద్దరు పిల్లలు సహా ముగ్గురు మరణించారు. మొదటి సంఘటనలో, దక్షిణ కన్నడ జిల్లా ఉల్లాల్‌లోని దెరాలకట్టేలోని బెల్లాగ్రామ్‌లోని కనకరేలోని నౌషాద్ ఇంటి వెనుక కొండ, రిటైనింగ్ గోడ కూలిపోయింది. ఫలితంగా, శుక్రవారం ఉదయం ఇంటి కిటికీ కింద చిక్కుకున్న నౌషాద్ కుమార్తె నయీమా మరణించింది. రెండవ సంఘటనలో మంజానాడి గ్రామంలోని మోంటెపదవు కోడిలో కొండ కూలిపోవడంతో సీతారాం కుటుంబం శిథిలాల కింద చిక్కుకుంది. సీతారాం తల్లి ప్రేమ (50), కుమారుడు ఆర్యన్ (2) బురదలో చిక్కుకుని మరణించారు. సీతారాం తండ్రి కాంతప్ప పూజారి గాయపడగా, రెండవ కుమారుడు గాయాలతో బయటపడ్డాడు. సీతారాం భార్య అశ్విని కూడా అదే శిథిలాల కింద చిక్కుకుంది. ఆమెను రక్షించడానికి సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఆ ఇంట్లో మొత్తం ఐదుగురు నివసిస్తున్నారు. వారు నిద్రిస్తున్న గదిపై కొండ కూలిపోవడంతో ఈ ప్రమాదం జరిగింది. కానీ సీతారాం సురక్షితంగా బయటపడ్డారు. ఉల్లాల్ బైలిలోని అనేక ఇళ్లు వరద నీటిలో మునిగిపోయాయి, ఎడతెరపి లేని వర్షాలు, వరదల కారణంగా, సాధారణ జనజీవనం అస్తవ్యస్తమైంది. అనేక కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. భారీ వర్షాల నేపథ్యంలో దక్షిణ కన్నడ జిల్లాలోని అంగన్‌వాడీ, ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, ప్రభుత్వ సహాయక, ప్రైవేట్ పాఠశాలలకు జిల్లా కలెక్టర్ ఆనంద్ సెలవు ప్రకటించారు. ఇక తూర్పు తీరం పశ్చిమ బెంగాల్‌లోని కొన్ని ప్రాంతాలలో గురువారం భారీ వర్షాలు కురిశాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం గురువారం పశ్చిమ బెంగాల్-బంగ్లాదేశ్ తీరాన్ని దాటింది. ఈ కఠినమైన పరిస్థితుల కారణంగా రాబోయే ఐదు రోజులు సముద్రంలోకి వెళ్లకుండా ఉండాలని మత్స్యకారులకు హెచ్చరికలు జారీ చేశారు.

మిజోరంలో ముగ్గురి మృతి

మిజోరాంలోని ఐజ్వాల్‌లో రాతి గోడ కూలి ముగ్గురు మరణించగా, సిక్కింలోని తీస్తా నదిలో పర్యాటక వాహనం పడిపోవడంతో ఒకరు మరణించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఐజ్వాల్ జిల్లాలోని పాఠశాలలు వరుసగా రెండవ రోజు కూడా మూతపడ్డాయి. బుధవారం నుంచి ఈ పర్వత ప్రాంత రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. హిమాచల్ ప్రదేశ్‌లో తీవ్రమైన ఉరుములు, భారీ వర్షాలు, వరదలకు జన జీవనం స్తంభించింది.

3-4 రోజుల్లో భారీ వర్షాలు: ఐఎండీ

రాబోయే 3-4 రోజుల్లో కేరళలోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనా వేసింది. పతనంతిట్ట, కొట్టాయం, ఎర్నాకుళం, ఇడుక్కి, కోజికోడ్, వయనాడ్, కన్నూర్, కాసరగోడ్ జిల్లాలతో సహా కేరళలోని ఎనిమిది జిల్లాలకు వర్షపాతం కోసం వాతావరణ కేంద్రం రెడ్ అలర్ట్ జారీ చేసింది. తిరువనంతపురం, కొల్లం, అలప్పుజ, త్రిస్సూర్, పాలక్కాడ్, మలప్పురం అనే ఆరు జిల్లాలకు వర్షపాతంపై ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

విశాలాంధ్ర హైదరాబాద్

నాలా పనులు వేగంగా పూర్తి చేయాలి: కమిషనర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా నాలా పనులు వేగవంతంగా పూర్తి చేయాలని జిహెచ్ ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం చార్మినార్ జోన్ సంతోష్ నగర్ సర్కిల్‌లో నాలా పనులు యాకుత్ పుర ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్, ఎమ్మెల్సీ మీర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెండీలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మౌలానా కా చిల్ల, గంగానగర్ నాలాలను కమిషనర్ పరిశీలించారు. మౌలానా కా చిల్ల, గంగానగర్ నాలాల వలన పలు కాలనీ ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ కమీషనర్‌కు వివరించారు. గంగానగర్ నాలా మరమ్మత్తు పనులు కొనసాగుతున్నాయని, ఇప్పటి వరకు 70 శాతం పనులు పూర్తయ్యాయని ప్రాజెక్టు ఈఈ బి.ఎల్.శ్రీనివాస్ కమిషనర్‌కు వివరించారు. మిగిలిన 30 శాతం పనులు తొందరగా పూర్తి చేయాలని కమిషనర్ ప్రాజెక్టు అధికారిని ఆదేశించారు. గంగానగర్ నాలాకు ఇరువైపులా జలమండలి పైప్‌లైన్ సమాంతరంగా ఉన్నందున జిహెచ్ఎంసి మెయింటెనెన్స్ ఇంజనీరింగ్ వింగ్, జలమండలి అధికారులు కలిసి క్లీన్ చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. జహంగీర్ నగర్ కాలనీ నుండి మౌలానా కా చిల్ల నాలా వరకు డ్రైనేజీ కాలువ నిర్మాణం ఆవశ్యకత కార్పొరేట్ కమీషనర్‌కు వివరించగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కమీషనర్ వెంట జలమండలి ఎం.డి అశోక్ రెడ్డి, జోనల్ కమిషనర్ వెంకన్న, జోనల్ ఎస్.ఈ మహేశ్వర రెడ్డి, ప్రాజెక్టు ఈఈ బి.ఎల్ శ్రీనివాస్, డిప్యూటీ కమీషనర్ మంగతాయారు, పత్తర్‌గట్టి కార్పోరేటర్ సోహెల్ మహమూద్ ఖాద్రీ, డబీర్ పుర కార్పొరేటర్ అలందార్ హుస్సేన్ ఖాన్, రెయిన్ బజార్ కార్పొరేటర్ వాసా ఉద్దీన్, సంతోష్ నగర్ కార్పొరేషన్ ముజఫర్ హుస్సేన్, తలాబ్ చంచలం డాక్టర్ సమీనా బేగం, మొఘల్ పుర కార్పొరేటర్ నస్రీన్ సుల్తానా, కుర్మగూడ కార్పొరేషన్ షఫత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

ఈ కిడ్ బాగున్నాడు : జెరార్డ్ బట్లర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : యూనివర్సల్ పిక్చర్స్, డ్రీమ్‌వర్క్స్ ఆనిమేషన్‌లు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్న సినిమా "హౌ టు ట్రైన్ యువర్ డ్రాగన్"ను లైవ్-యాక్షన్ ఎపిక్‌గా తిరిగి ప్రెజెంట్ చేయనున్నట్లు ప్రకటించాయి. ఇది 2025 జూన్ 13న థియేటర్‌లలో విడుదల కానుంది. మూడు సార్లు అకాడమీ అవార్డు నామినీ, గోల్డెన్ గ్లోబ్ విజేత డీన్ డెబ్లాయిస్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో, బెర్క్ అనే ఊరులోని మాయాజాలాన్ని కొత్తగా పరిచయం చేయనున్నారు. ఈ కథలో కేంద్ర పాత్ర హికప్‌గా మేసన్ థేమ్స్ కనిపించనున్నాడు. ధైర్యంతో కూడిన పాత్ర ఇది. బిఎఎఫ్‌టిఎ నామినీ నికో పార్కర్, ధైర్యవంతమైన అస్ట్రిడ్‌గా నటించనున్నారు. హికప్ తండ్రిగా, బెర్క్ నాయకుడిగా, స్టోయిక్ ది వాస్ట్ పాత్రలో జెరార్డ్ బట్లర్ మళ్లీ తెరపై దర్శించనున్నారు. అలాగే నిక్ ఫ్రాస్ట్, జూలియన్ డెనిసన్, గాబ్రియల్ హెూవెల్, బ్రోన్విన్ జేమ్స్, హ్యారీ ట్రెవాల్డ్‌విన్, రూత్ కోడ్, పీటర్ సేరఫినోవిచ్ ముర్రే మాకార్తర్ తదితరులు కూడా నటిస్తున్నారు. స్టోయిక్ ది వాస్ట్ పాత్రలో మళ్లీ నటిస్తున్న జెరార్డ్ బట్లర్, మేసన్ థేమ్స్ ప్రతిభను చూసి ఆశ్చర్యపోయినట్లు చెప్పారు. "మేసన్ మంచి నటుడని తెలుసు. ఆ పాత్ర అందుకోవడానికి అంతకంటే తక్కువతనంతో సాధ్యమయ్యేది కాదన్నారు. కానీ అతనితో కలిసి నటించే సమయంలో నాకు ఎప్పటికప్పుడు 'వావ్. ఈ కిడ్ బాగున్నాడు' అనిపించేది," అని చెప్పారు.

సొంతింటి కల నెరవేరుస్తున్న కాంగ్రెస్

విశాలాంధ్ర - మొయినాబాద్ : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సొంతింటి కల నెరవేరుస్తున్నదని చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ పామెన భీం భరత్ అన్నారు. శుక్రవారం మొయినాబాద్ మండల పరిధిలోని కాశీంబౌలి, కనకమామిడి గ్రామాల్లో నిరుపేదలకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ళ లబ్ధిదారుల గృహాలకు శంకుస్థాపన గావించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం జోరుగా సాగుతుందన్నారు. ఇండ్ల నిర్మాణం ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్మించుకునే వారికి రూ. 5 లక్షలు నాలుగు దపాలుగా ప్రభుత్వం అందిస్తుందన్నారు. అధికారులు సూచించిన విధంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరి సతీష్, మండల కాంగ్రెస్ ప్రెసిడెంట్ తమ్మలి మానయ్య, చేవెళ్ళ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్ రెడ్డి, మాజీ సర్పంచులు మాడి వెంకట్ రెడ్డి, సత్యనారాయణ, కాశీంభౌలి జయరాం రెడ్డి, దయాకర్ రెడ్డి, సామ జగన్ రెడ్డి, ఎంపిటీసీలు గణేష్ గౌడ్, కేబుల్ రాజు, నర్సింగ్ రావు, ఫిషర్మెన్ కమిటీ మండల అధ్యక్షుడు తలారి బిక్షపతి, రవీందర్ రెడ్డి, ఏఎంసి డైరెక్టర్ బాలకృష్ణారెడ్డి, రాఘవేందర్ రెడ్డి, ఇంద్రమ్మ కమిటీ సభ్యులు ఆలూరు రాములు, వంశి రెడ్డి, మహేష్, నరేందర్, గ్రామ కమిటీ అధ్యక్షులు నిరంజన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులను పరిశీలించిన మాజీ మేయర్

విశాలాంధ్ర - మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 16వ డివిజన్ శ్రీరామ ఆర్టీసీ కాలనీలో శుక్రవారం ఉదయం మాజీ మేయర్ అమర్ సింగ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బండి సతీష్‌తో కలిసి స్థానిక కాలనీ ప్రజల సమక్షంలో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో మాజీ మేయర్ అమర్ సింగ్ మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనుల నాణ్యతను ప్రత్యేకంగా పరిశీలించి, సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బండి సతీష్, వంగూరి పరమేష్, సబీర్ హుస్సేన్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చట్టరీత్యా చర్యలు

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

విశాలాంధ్ర - హైదరాబాద్ : లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని స్కానింగ్ సెంటర్లో అర్హులైన డాక్టర్లు రికార్డులు రిపోర్టులు అనుమతి పొందిన స్కానింగ్ మిషన్లు మాత్రమే ఉండాలని మార్పులు ఉంటే వెంటనే జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి హైదరాబాద్‌కు తెలియజేయాలని అతిక్రమించిన వారిపై చట్టరీత్యా కేసులు నమోదు చేసి జరిమానా విధిస్తామని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి హెచ్చరించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో నిర్వహించిన జిల్లా అప్రోప్రీట్ అథారిటీ కమిటీ పిసిపి ఎన్డిటి చట్టం సమీక్ష సమావేశంలో, జిల్లాలో ఉన్న అన్ని స్కానింగ్ కేంద్రాలు విధిగా నిర్దేశించిన రూల్స్ ప్రకారం నిర్వహించాలని స్కానింగ్ చేయించుకున్న గర్భిణీ స్త్రీల వివరాలు తప్పనిసరిగా రిజిస్టర్‌లో నమోదు చేసి అదే రోజు ఆన్లైన్లో వారి వివరాలు ప్రభుత్వానికి సమర్పించాలని సూచించారు. జిల్లాలో స్టేట్ మానిటరింగ్ జిల్లా తనిఖీ బృందాలు నిర్వహించిన తనిఖీలో సికింద్రాబాద్‌లోని న్యూ లైఫ్ ఆసుపత్రిలో అనుమతి లేని స్కానింగ్ మిషన్‌ను గుర్తించి సీజ్ చేసి యాజమాన్యంపై చట్టరీత్య కోర్టులో కేసు నమోదు చేయాలని, సైదాబాద్‌లోని వివేకాసుపత్రిలో అనుమతి లేకుండా ఉన్న రెండు స్కానింగ్ మిషన్లు గుర్తించినందుకు 2 లక్షల రూపాయలు జరిమానా విధించాలని ఆదేశించినారు. జిల్లాలో సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్లు నిర్వహించిన తనిఖీలో నిబంధనలు ఉల్లంఘించిన 26 స్కానింగ్ సెంటర్లకు 50 వేల రూపాయల చొప్పున జరిమానా విధించి వసూలు చేయాలన్నారు. తిరిగి అదే విధంగా నిబంధనలు అతిక్రమించినట్లయితే స్కానింగ్ సెంటర్ల రిజిస్ట్రేషన్ రద్దు చేయాలన్నారు. సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్లు, జిల్లా ప్రోగ్రాం అధికారులు జిల్లాలోని అన్ని స్కానింగ్ సెంటర్లను నిరంతరం తనిఖీ చేసి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా కేసులు నమోదు జరిమానా విధించుటకు తోడ్పాటు అందించాలని ఆదేశించినారు. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న కేంద్రాలు, వీటికి సంబంధించిన సమస్యలపై టోల్ ఫ్రీ నెంబర్ 1800..599..3366 ద్వారా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి పిర్యాదు చేయాలని, దీనిపై చట్టంపై విరివిగా అవగాహన సదస్సులు, ప్రచారం నిర్వహించాలన్నారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమం, విద్యాశాఖ స్వచ్ఛంద సంస్థల సహకారముతో చట్టంపై అన్ని ప్రభుత్వ కళాశాలలో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జె.వెంకటి జిల్లాలో లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టం అమలుపై, నిర్వహిస్తున్న కార్యక్రమాలపై, నిబంధనలు ఉల్లంఘించిన స్కానింగ్ సెంటర్ల పై తీసుకోనున్న చర్యలపై, స్వచ్ఛంద సంస్థల సహకారంతో నిర్వహించిన అవగాహన సదస్సులపై నివేదిక సమర్పించి నివేదించినారు. ఈ సమీక్షా సమావేశంలో సహాయ పోలీస్ కమిషనర్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి వందన, సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్లు, జిల్లా మీడియా అధికారి జక్కుల రాములు, టి నరసింహ అంజయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ ప్రశ్నలకు బీజేపీ సమాధానం చెప్పాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఏఐసీసీ పిలుపుమేరకు నిర్వహించిన జైహింద్ యాత్రలో సీఎం.రేవంత్‌రెడ్డి చాలా భావోద్వేగంతో దేశం గర్వించదగ్గ విషయంలా మాట్లాడారని ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు అన్నారు. ముఖ్యంగా బీజేపీ రేవంత్ లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం చెప్పాలని సూచించారు. శుక్రవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో అయన మాట్లాడుతూ రాహుల్ గాంధీ అడిగిన ప్రశ్నలకు మోడీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. భారత్ పాక్ మధ్య 6 సిరియస్ యుద్ధాలు జరిగాయని గుర్తు చేశారు. పెహల్గమ్ ఘటన తరువాత మన దేశం ఏదో చేస్తున్నట్లు క్రియేట్ చేశారు. కాని ఏమి జరగలేదన్నారు. ఎవరో సంబంధం లేని వ్యక్తులు యుద్ధం లేదని సీజ్ ఫైర్ అయ్యిందని ఎలా చెపుతారని ట్రంప్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. మిలిటరీ చేసే పనులలో పొలిటికల్ ఇన్వాల్వ్ మెంట్ ఎందుకు చేసుకోవాల్సి వస్తుందని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ అడగని ప్రశ్నలు రేవంత్ రెడ్డి కేంద్రంను అడిగారని, మనం ఇప్పటి వరకు ఎంత నష్టపోయామనేది అనేది కేంద్రం చెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు. మనం ఎన్ని జెట్స్ కోల్పోయామనేది కేంద్రం చెప్పాలని, ఇండియా ఒక్కసారి యూరిన్ పోస్తే పాకిస్థాన్ కొట్టుకుపోతుందని, మనం అందరం నేషనలిస్ట్ లమే అంటూ వ్యాఖ్యానించారు. మనం వార్ గెలిచామని ఇంటర్ నేషనల్ పేపర్‌లు ఎక్కడైనా రాశాయా.. మన పేపర్‌లో తప్ప వేరే వాళ్ళు ఎవరు రాయలేదన్నారు. సీజ్ ఫైర్ కాకపోతే పాకిస్తాన్ మీద గెలిచే వాళ్ళమని, పాకిస్తాన్ ఓడిపోయిందని ఏ దేశం చెప్పడం లేదన్నారు. పెహల్గమ్ ఘటన కారకులు ఎంత మంది దొరికారని, ఎంత మంది ఉన్నారని నిలదీశారు. తెలంగాణలో ప్రజాస్వామ్య బద్ధంగా పాలన నడుస్తుందన్నారు. మావోయిస్టులు శాంతి చర్చలకు వస్తామని చెపితే చర్చలు జరిపాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందన్నారు. కవిత మాట్లాడిన మాటలు ఆమెను కాంగ్రెస్ సిరియస్‌గా తీసుకోలేదని, ప్రజా పాలంలో ప్రజలతో పాలన.. లీడర్‌లతో ఏమి సంబంధం.. కవితతో పెద్దగా కలిసి వస్తుందని నేను అనుకోవడం లేదన్నారు. నేను కాంగ్రెస్ లోనే ఉన్నాను నేను కాంగ్రెస్‌లోనే చస్తానని, తెలంగాణ ఇవ్వనందుకు నేను అప్పట్లో పార్టీ మారాల్సి వచ్చిందని గుర్తు చేశారు.

రేషన్ షాపులు నిర్వహణలో సమయపాలన పాటించాలి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీ రేషన్ కార్డ్ దారులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజేయేందర్‌రెడ్డి రేషన్ డీలర్లకు సూచించారు. శుక్రవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయం లోని సమావేశ మందిరంలో ఎయస్ ఓలు, డిప్యూటి తహశీల్దార్లు (సివిల్ సప్లయ్), రేషన్ డీలర్లు, స్టేజీ-1, స్టేజీ -2 కాంట్రాక్టర్లతో రేషన్ కార్డ్ లబ్దిదారలుకు వచ్చే నెల 1వ తేది నుండి మూడు నెలలకు సన్న బియ్యం ఒకేసారి పంపిణీ చేయనున్నందున అందుకు తీసుకోవల్సిన జాగ్రత్తలు, స్టాక్ నిల్వలు, విధివిధానాలు తదితర అంశాలపై డియం. సుగుణబాయి, డియస్ ఓ శ్రీనివాసరెడ్డిలతో కలిసి సమీక్షించి, దిశానిర్దేశం చేశారు. జిల్లాలో 618 షాపులు ఉండగా, మూడు నెలలకు 32933.198 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం కేటాయించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రంలో భాగంగా రేషన్ కార్డు కలిగిన ప్రతి లబ్దిదారులకు వచ్చే నెల 1వ తారీఖు నుండి జూన్, జూలై, అగస్టు-2025 (3) మాసాలకు సరిపడా సన్న బియ్యం ఒకేసారి పంపిణీ చేయనున్నందున తగిని జాగ్రత్తలు తీసుకోవాలని అదికారులను, డీలర్లను ఆయన ఆదేశించారు. రేషన్ షాపులు ఉదయం, సాయంత్రం తప్పక సమయపాలన పాటించాలని సూచించారు. మూడు నెలల కాలానికి ఒకే పంపిణీ చేస్తున్నందున ప్రతి షాపులో తగినంత స్టాకును నిల్వలు ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని, సరిపడా స్టాక్ లేని యేడల సత్వరమే సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చి, తెప్పించుకోనుటకు చర్యలు తీసుకోవాలన్నారు. రేషాన్ షాపులలో 50 శాతం స్టాక్ ఉన్న సమయంలోనే తిరిగి గోదాముల నుండి సరుకు వచ్చేవిధంగా ఆర్డర్ చేయాలన్నారు. నిర్దేశించిన సమయంలోపు స్టాక్ పాయింట్లకు సన్న బియ్యం చేరుటకు చర్యలు తీసుకోవాలని స్టేజీ-2 కాంట్రాక్టర్లను ఆదేశించారు. రేషన్ షాపులకు దిగుమతి అయిన స్టాక్, పంపిణీ చేసిన బియ్యం వివరాలను రోజువారిగా క్షేత్రస్థాయిలో పరిశీలించి, నివేదించాలని సంబంధిత అధికారును అదనపు కలెక్టర్ ఆదేశించారు. అధికారులు, డీలర్లు, స్టేజి 1, 2 కాంట్రాక్టర్లు, సమన్వయంలో పనిచేసి, ఈ పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేసి, ప్రజల మన్ననలతో పాటు జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతలు తెవాలని అదనపు కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో సివిల్ సప్లయ్ డిటీలు శ్రీనయ్య, శ్రీపాల్, ఎయస్‌ఓలు సంధ్య, కళ్యాణ్, రేషన్ షాపుల డీలర్లు, స్టేజీ-1, స్టేజీ-2 కాంట్రాక్టర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

మురుగునీటి సమస్యల శాశ్వత పరిష్కారానికి సంయుక్త కార్యచరణ

విశాలాంధ్ర - హైదరాబాద్ : యాకుత్‌పుర శాసనసభ నియోజకవర్గంలో మురుగునీటి సమస్యల శాశ్వత పరిష్కారానికి ఇరుశాఖల ఆధ్వర్యంలో సంయుక్త కార్యచరణ చేపట్టనున్నారు. నియోజకవర్గం మౌలనా చిల్లా ప్రాంతంలోని గంగానగర్ నాలా పరివాహక ప్రాంతంలో వర్షాకాలంలో మురుగునీరు నివాసాలకు చేరి ఈ ప్రాంత నివాసులు పలు ఇక్కట్లు పడుతున్నారు. ఈ నేపథ్యంలో జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, జీహెచ్ఎంసీ కమీషనర్ కర్ణన్, స్థానిక శాసన సభ్యుడు జాఫర్ హుస్సేన్ కలిసి జాయింట్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించారు. ఈ ప్రాంతంలో రోడ్డు విస్తరణ, జీహెచ్ఎంసీ ప్రాజెక్టు విభాగం చేపట్టిన నాలా విస్తరణ పనుల కారణంగా సమీప ప్రాంతాలలో జీహెచ్ఎంసీ చిన్న చిన్న రెయిన్‌వాటర్ డ్రెన్లు, జలమండలికి సంబంధించిన సీవరేజ్ లైన్లలో పూడిక పెరిగి వార్షాల సమయంలో మురుగు సమస్య తీవ్రమైంది. ఈ సమస్య పరిష్కారానికై స్థానిక ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ చొరవతో జలమండలి ఎండీ, జీహెచ్ఎంసీ కమీషనర్ సంబంధిత అధికారులతో కలిసి ఏకకాలంలో నాలాలు, సీవరేజ్ లైన్లలోని పూడికతీత పనులు చేపడితే ఓ మేరకు సమస్య తీరినట్టేనని అంచనా వేశారు. అలాగే కొన్ని ప్రాంతాలలో ఇంటికింద భాగంనుంచి ప్రవహించే నాలాలు ఉన్నట్లు గుర్తించారు. ఈ నాలాల పనులు చేపట్టడానికి సాధ్యసాధ్యాలను పరిశీలించాలని ఇరుశాఖల అధికారులను సూచించారు. అలాగే నాలా విస్తరణ పనుల సమయంలోని సమాంతరంగా జలమండలి సీవరేజ్ లైన్ల నిర్మాణం సైతం పూర్తి చేయాలని జలమండలి అధికారులకు ఎండీ అశోక్ రెడ్డి ఆదేశించారు. అలాగే నిర్మాణ సమయంలో సీవరేజ్ ఫ్లోకు అనుగుణంగా సీవరేజ్ లైన్ల లెవల్ మ్యాచ్ అయ్యేలాగా జాగ్రత్త వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఆపరేషన్ డైరెక్టర్ అమరేందర్ రెడ్డి, సీజీఎంలు నాగేంద్ర, వినోద్ భార్గవ, జీఎంలు సంతోష్‌కుమార్, శ్యామ్‌సుందర్ నాయక్, అశోక్‌లతో పాటు జీహెచ్ఎంసీ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

రజాకార్, పుష్ప-2 సినిమాలకు అవార్డులను తిరస్కరించాలి

విశాలాంధ్ర - హనుమకొండ : రజాకార్ సినిమాకు, పుష్ప-2 సినిమాలో స్మగ్లర్ పాత్ర పోషించిన అల్లు అర్జున్‌కు ఇచ్చిన గద్దర్ అవార్డులను తిరస్కరించాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండ బాల సముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో సీనియర్ నాయకులు మోతె లింగారెడ్డి అధ్యక్షతన జరిగిన సిపిఐ జిల్లా మహాసభల ఆహ్వాన సంఘం ముగింపు సమావేశంలో తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమర వీరులను అవమానపరుస్తూ తీసిన రజాకార్ సినిమాకు ఉత్తమ చారిత్రక వారసత్వ సినిమా అవార్డు ఇవ్వడం సిగ్గు చేటైన చర్య అన్నారు. నాడు సాగిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం సాగిందని, భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా, జమీందారులకు, జాగిర్దార్లకు వ్యతిరేకంగా భూమి పంచాలని, హిందు వులకు, ముస్లింలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంగా వక్రీకరిస్తూ తీసిన రజాకార్ సినిమాకి ఉత్తమ చారిత్రక వారసత్వ సినిమా అవార్డు రావడం సిగ్గుచేటని అన్నారు. ఆనాడు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించి మూడు వేల గ్రామాలను విముక్తి చేసి, 10 లక్షల ఎకరాల భూములను పంచిపెట్టిన చరిత్ర ఎర్రజెండా పార్టీకి దక్కిందన్నారు. ఆనాడు కాంగ్రెస్ పార్టీ పటేల్ సైన్యాలతో గ్రామాలపై పడి ప్రజలపై దాడి చేసి చంపించారని, నేడు అదే తీరుగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం సాయుధ పోరాటాన్ని వక్రీకరిస్తూ తీసిన సినిమాలకు ఉత్తమ సినిమా అవార్డులు ఇవ్వడం అమరవీరులను అవమాన పరచడమే అన్నారు. అలాగే సమాజంలో విష సంస్కృతిని పెంచి పోషించే విధంగా ఎర్ర చందనం స్మగ్లర్ పాత్రలో నటించిన అల్లు అర్జున్‌కు ఉత్తమనటుడి అవార్డు ఇవ్వడం సరికాదని, ఇలాంటి పాత్రలకు గద్దర్ పేరుతో అవార్డు ఇవ్వడం ద్వారా ప్రభుత్వం ప్రజలకు ఏం సందేశం ఇస్తున్నదని ప్రశ్నించారు. అలాగే మూఢనమ్మకాలను అశాస్త్రీయ భావజాలాన్ని పెంపొందిస్తూ వచ్చిన కల్కి సినిమాకి కూడా ఉత్తమ సినిమా అవార్డు రావడం భారత సమాజాన్ని మూఢ విశ్వాసాలవైపు తీసుకెళ్లడమే నన్నారు. ఇలాంటి సినిమాలకు అవార్డుల ప్రకటన వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, జిల్లా మాజీ కార్యదర్శి సిరబోయిన కర్ణాకర్, రాష్ట్ర సమితి సభ్యురాలు మండ సదాలక్ష్మి, ఎన్. అశోక్ స్టాలిన్,డాక్టర్ మార్క శంకర్ నారాయణ, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, కార్యవర్గ సభ్యులు మంచాల రమాదేవి, కర్రె లక్ష్మణ్, మునిగాల బిక్షపతి, బాషమెూయిన సంతోష్, జక్కు రాజు గౌడ్, బత్తిని సదానందం, కొట్టెపాక రవి, నకీర్త ఓదెలు, మెట్టు శ్యామ్ సుందర్ రెడ్డి, దుప్పటి సాంబయ్య పాల్గొన్నారు.

కేంద్రం జాతీయ కనీస వేతనాలు వెంటనే నిర్ణయించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : కేంద్ర ప్రభుత్వం వెంటనే జాతీయ కనీస వేతనాన్ని నిర్ణయించాలని, జాతీయ కనీస వేతన బోర్డులో అన్ని యూనియన్‌లకు ప్రాతినిధ్యం కల్పించాలని ఎఐటియుసి జాతీయ ఉపాధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు యం.డి.యూసుఫ్ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కనీస వేతనాల బోర్డు వేతనాలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆమోదానికి పంపించటం జరిగింది. కావున రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆమోదించి జి.ఓ.లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో మెడికల్ డిపార్ట్‌మెంట్‌లో అన్ని గవర్నమెంట్ హాస్పిటల్స్ ఏఐటీయూసీ యూనియన్‌లోనే ఉన్నాయని, అలాగే ఇతర రాష్ట్రాల్లో కూడా ఈ సంఘాలు బలంగా ఉన్నాయని కాబట్టి తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఫెడరేషన్ ఏర్పాటుకు కేంద్ర ఏఐటీయూసీ ప్రయత్నించాలని కోరారు. ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా, యాజమాన్యాలకు అనుకూలంగా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లను కార్మిక సంఘాలు వ్యతిరేకిస్తున్నప్పటికి కేంద్రం తెచ్చిందని, అందులో ఉన్నటువంటి కార్మిక వ్యతిరేక యాజమాన్యాలకు అనుకూలంగా ఉన్న అంశాలను కార్మికులకు పూర్తి అవగాహన కల్పించాలని కోరారు. ఔట్ సోర్సింగ్ కాంట్రాక్టు ఉద్యోగులను పర్మనెంట్ కొరకు పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. తెలంగాణలో ఏఐటీయూసి బలోపేతం చేస్తామని అన్నారు. కౌన్సిల్ సమావేశంలో ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్, జాతీయ కౌన్సిల్ సభ్యులు పి.ప్రేమపావని, ఎస్. విలాస్, నరాటి ప్రసాద్, సింగు నర్సింహారావు, ప్రవీణ్ కుమార్, వై.ఓమయ్య, ఎస్.కరుణ కుమారి, టి.సమ్మయ్య, కె.ఏసురత్నం, కె.రాజకుమార్, కె.సారయ్య, హసీనా బేగం, సీతామహాలక్ష్మి, బి.జి.క్లెమెంట్‌లు పాల్గొన్నారు.

ఉదయపూర్ డిక్లరేషన్‌ను ఉల్లంగించిన కాంగ్రెస్

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ)లో ఏఐసీసీ ఆమోదించిన ప్రస్తుత కమిటీల నియామకాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ డా.దాసోజు శ్రావణ్ ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండిరచారు. ఈ నియామకాలు ఉదయపూర్ డిక్లరేషన్‌కు విరుద్ధంగా ఉన్నాయని, కుల గణన ఆత్మకి, సామాజిక న్యాయ తత్వానికి విరుద్ధంగా చేసినట్లు ఆయన పేర్కొన్నారు. "ఓబీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీలు, మహిళలు వీళ్లే దేశం బలస్థంభాలని, రాహుల్ గాంధీ నినదించిన 'జిత్నీ ఆబాదీ, ఉత్తనా హక్' ఆత్మ ఈ నియామకాలలో ఎక్కడ ఉంది" అని ప్రశ్నించారు. ఈ కమిటీలు ఎల్కైట్ వర్గాలు, ఫ్యూడల్ శక్తుల ఆధిపత్యంతో నిండిపోయినవిగా ఉన్నాయని, తక్కువ వర్గాలను వ్యవస్థాపితంగా అణిచివేయడమే కాక, వారి రాజకీయ శక్తిని పూర్తిగా నిరాకరించారని మండిపడ్డారు. మహిళలకు న్యాయమైన ప్రాతినిధ్యం ఇవ్వకుండా కాంగ్రెస్ పార్టీ తమ పబ్లిక్ స్టేజిలపై లింగ సమానత్వంపై చేసే ప్రసంగాలు కేవలం బూటకం అని తేలిపోయిందదని డా.శ్రవణ్ దాసోజు అభిప్రాయపడ్డారు. "రాష్ట్ర ఆర్థిక కమిషన్, వ్యవసాయ కమిషన్ లాంటి రాజ్యాంగ పదవులు నిర్వర్తిస్తున్న నేతలనే మళ్లీ పార్టీ లోపలి కీలక పదవుల్లో నియమించడం చట్టరీత్యా పెద్ద తప్పిదంగా పేర్కొన్నారు. వీరిద్దరి నియామకాలు పార్టీ నిబంధనలకు విరుద్ధంగా, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే చర్య" అని దాసోజు పేర్కొన్నారు. ఉదయపూర్ డిక్లరేషన్ కేంద్రంగా పేర్కొన్న, వికేంద్రీకరణ, సబ్బండ వర్గాల ప్రాతినిధ్యం అన్నవి ఇప్పుడున్న కమిటీల్లో ఎక్కడా కనిపించడంలేదని దాసోజు విమర్శించారు. కులగణన కేవలం సంఖ్యల సేకరణ కోసం కాదు అది సబ్బండ వర్గాల ఆత్మ గౌరవం కోసం, అట్టడుగు వర్గాలకు రాజకీయ శక్తి పంపిణీ కోసం అన్న విషయం కాంగ్రెస్ మరవడం సామజిక మోసంగా అభివర్ణించారు. కోట్లాది ఎస్సీ, ఓబీసీ, ఎస్టీ, మైనారిటీ ప్రజలు రాహుల్ గాంధీ పిలుపును నమ్మి ఓట్లేసి అధికారమిస్తే, ఇప్పుడు వారికి ఏ సందేశం ఇచ్చారని ప్రశ్నించారు. "జిత్నీ ఆబాదీ ఉత్తనా హక్" అనే నినాదాన్ని స్టేజిపై గట్టిగా అరిచిన వాళ్లు, అదే వర్గాలకు రాజకీయ కుర్చీలు ఇవ్వకపోతే అది కేవలం హిపోక్రసీ కాదని, అది నైతికంగా ఘోర ద్రోహం!" అని తీవ్రంగా విమర్శించారు. కాంగ్రెస్ కమిటీ నియామకాలు సంకల్పబద్ధంగా బహుజన వర్గాలను అణచివేయడమే అని ఇది సామాజిక న్యాయాన్ని గంగలో కలిపేసిన చర్యగా పేర్కొన్నారు. కాంగ్రెస్ హైకమాండ్‌ను, ముఖ్యంగా తెలంగాణ కాంగ్రెస్ "బలవంతపు శక్తుల ఆధిపత్యం నుంచి బయట పడాలని, మీరు నిజంగా సామాజిక న్యాయాన్ని నమ్మితే దాన్ని మీ పార్టీలో అమలు చేయడం మొదలు పెట్టాలని విజ్ఞప్తి చేశారు.

VIRAT CRANE INDUSTRIES LTD.,

CIN No : L74999AP1992PLC014392 Website: www.cranegroup.in

D.No. 25-18-54,OPP.Crane Betel Nut Powder Works Office, Main Road, Sampath Nagar, GUNTUR. Ph.: 0863-2223311

STATEMENT OF AUDITED FINANCIAL RESULTS FOR THE 4TH QUARTER AND FINANCIAL YEAR ENDED ON 31-03-2025 (Rs.In Lakhs)

Sl. No.	Particulars	Quarter Ended 31-03-2025 (Audited)	Quarter Ended 31-12-2024 (Unaudited)	Quarter Ended 31-03-2024 (Audited)	Year Ended 31-03-2025 (Audited)	Year Ended 31-03-2024 (Audited)
1	Total Income from Operations	4020.14	3894.73	3605.27	13921.65	13452.91
2	Net Profit / (Loss) for the period (before Tax, Exceptional and/or Extraordinary items)	(81.66)	139.77	399.90	629.65	1144.39
3	Net Profit / (Loss) for the period before tax (after Exceptional and/or Extraordinary items)	(81.66)	139.77	399.90	629.65	1144.39
4	Net Profit / (Loss) for the period after tax (after Exceptional and/or Extraordinary items)	(81.66)	104.59	399.90	466.55	1012.26
5	Total Comprehensive Income for the period [Comprising Profit / (Loss) for the period (after tax) and Other Comprehensive Income (after tax)]	(81.66)	104.59	399.90	466.55	1012.26
6	Equity Share Capital	2042.38	2042.38	2042.38	2042.38	2042.38
7	Reserves (excluding Revaluation Reserve) as shown in the Audited Balance Sheet of the previous year	4831.75	4898.68	4365.19	4831.75	4365.19
8	Earnings Per Share (of Rs.10/- each) (for Continuing and discontinued operations) - Basic:	(0.40)	0.51	1.96	2.28	4.96
	Diluted:	(0.40)	0.51	1.96	2.28	4.96

Notes : 1) The above financial results were reviewed and approved by the Board of Directors at its Meeting held on 29th May 2025. These results are as per regulation 33 of the SEBI (Listing obligations and Disclosure Requirements) Regulation, 2015 (as amended). The Statutory auditors have carried out an audit of these results for the year ended 31st March 2025. They have given an unqualified report on the above results.
2) This statement has prepared in accordance with the Companies (Indian Accounting Standards) Rules, 2015 (Ind AS) (as amended) prescribed under section 133 of the Companies Act, 2013 (as amended) and other recognised accounting practices and policies to the extent applicable.
3) The Company is presently operating in only one business segment i.e. Dairy Products.
4) The Adavipalli kalam plant underwent its trail run at the end of December 2024 and the first week of January 2025, subsequently commencing commercial operations. This transition led to increased operational expenses and depreciation, contributing to a negative profit for Q4 of F.Y. 2024-25. The company management anticipates that the plant will achieve breakeven during Q3 of F.Y. 2025-26. This scenario is common in the industrial sector, where new plants often experience initial financial strain due to ramp-NL costs. However with optimized operations and increased production efficiency, the plant is expected to reach breakeven as projected.
5) During the F.Y. 2023-24, the company took legal action against the proprietor of the cold storage and the in-charge of Sree Lakshmi Swamy Frozen Foods for not releasing the goods needed for the production of finished goods as per the agreement with them for storing the goods. The value of inventory stored in this godown is Rs. 4.75 Crores. Management is taking necessary stringent actions and the process of releasing the goods from this godown is underway. Due to this, no provision for impairment has been made till date.
6) The figures for the last quarter in each of the years is balancing figures between the audited figures of the full financial year and the published year to date figures up to the third quarter of the respective financial year.
7) Previous period figures are re-arranged/re-grouped wherever necessary in line with the current period presentation.
8) The detailed above said financial results is also available on the website: https://viratcraneindustries.com

Place : GUNTUR
Date : 30-05-2025

on behalf of the Board of Directors
Sd/- G.V.S.L. KANTHA RAO
(Managing Director)

Scan this QR Code for viewing full Financial Report.

జోనల్ కమిషనర్‌ని కలిసిన గాంధీ

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి జోన్ జోనల్ కమిషనర్‌గా నియమితులైన శుభ సందర్భంగా హేమంత్ బోరడేని శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ మర్యాదపూర్వకంగా కలిసి శాలవతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో నెలకొన్న పలు సమస్యలు చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులపై జోనల్ కమిషనర్‌తో చర్చించడం జరిగింది. పెండింగ్‌లో ఉన్న పనులు త్వరితగతిన పూర్తయ్యేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని, అసంపూర్తిగా మిగిలిపోయిన పనులు త్వరిత గతిన పూర్తయ్యేలా చూడలని, అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని, పనులలో వేగం పెంచాలని సకాలంలో నిధులు మంజూరయ్యేలా చూడాలని, వర్షాకాలంను దృష్టిలో పెట్టుకొని ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని, రోడ్ల మరమ్మత్తులు చేపట్టాలని జోనల్ కమిషనర్ హేమంత్ బోరడే దృష్టికి తీసుకువెళ్లారు. చెరువుల సుందరికరణ, పార్కులు అభివృద్ధి చేపట్టాలని, రోడ్ల మరమ్మతులు చేపట్టాలని, అధికారులతో చర్చించి తక్షణమే చర్యలు తీసుకోవాలని, మౌలిక వసతులు ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. దీనిపై జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించారు.

సన్‌ఫీస్ట్ మామ్స్ మ్యాజిక్ 'షైన్స్' ని విడుదల చేసిన ఐటీసీ

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రముఖ ఫుడ్ విభాగ ఉత్పత్తుల సంస్థ ఐటీసీ సన్‌ఫీస్ట్ మామ్స్ మ్యాజిక్, తమ మామ్స్ మ్యాజిక్ షైన్స్ షైనీ బటర్ (వెన్న) కుకీని విడుదల చేసింది. ఇది బటర్ కుకీ ప్రియులకు ఆనందకరమైన కొత్త అనుభవాన్ని అందిస్తామనే వాగ్దానం చేస్తోంది. ఒక తల్లి తన బిడ్డలో ప్రతిభను బయటకు తీసుకువచ్చినట్లే, ఈ కరకరలాడే, వెన్నతో కూడిన కుకీని సున్నితమైన చక్కెర గ్లేజింగ్ ద్వారా ప్రత్యేకంగా తయారు చేశారు. ఇది కుకీ మెరుపును సజీవంగా తెస్తుంది. దీని కోసం, మామ్స్ మ్యాజిక్ నదియా మొయిదుతో ప్రత్యేకంగా తీర్చిదిద్దిన కొత్త టీవీసీని విడుదల చేసింది. రుచి ఆకృతిని పెంచే ప్రత్యేకమైన మెరిసే చక్కెర గ్లేజింగ్‌తో రూపొందించబడిన, ఈ కుకీలో నోరూరించే వెన్న నింపబడింది. దీనిలోని కరకరలాడే ఎనిమిది పొరలు ఒక ప్రత్యేకమైన, నోటిలో కరిగిపోయే అనుభవాన్ని సృష్టిస్తాయి. మామ్స్ మ్యాజిక్ ఒక టీవీసీని విడుదల చేసింది, ఇది తన బిడ్డ ఎదుగుదలలో ఒక తల్లి తిరుగులేని మద్దతు సారాంశాన్ని అందంగా ఒడిసిపడుతుంది. ఈ చిత్రంలో, నదియా మొయిదు ఒక తల్లి పాత్రను పోషించారు. ఆమె క్రంచీ బటర్ కుకీపై సున్నితమైన చక్కెర గ్లేజింగ్‌ను వర్తింపజేయడం వల్ల దానిలోని మెరుపు ఎలా బయటపడుతుందో అందంగా తెలియజేస్తారు. తమ పిల్లలలోని ఉత్తమతను బయటకు తీసుకురావడానికి అదనపు కృషి చేసే తల్లులకు ఈ టీవీసీ ఒక నివాళి అని ఈ ఆవిష్కరణ సందర్భంగా ఐటీసీ లిమిటెడ్ బిస్కెట్స్ అండ్ కేక్స్ క్లస్టర్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అలీ హారిస్ షేర్ తెలిపారు.

కర్ణాటక, తమిళనాడు, ఏపీలో ఐటీసీ ఆశీర్వాద్ స్మార్ట్ ఇండియా ప్రోగ్రాం విజయవంతం

విశాలాంధ్ర - అదిలాబాద్ : ఇన్ స్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ డవలప్మెంట్ సహకారంతో ఐటిసి లిమిటెడ్ ఆశీర్వాద్ స్మార్ట్ ఇండియా ప్రోగ్రాంను విజయవంతంగా ముగించింది. ఈ సందర్భంగా ఐటీసీ లిమిటెడ్ న్యూట్రిషన్ సైన్సెస్ లీడ్ డాక్టర్ అగాథ బెట్సీ, ఇన్ స్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ డవలప్ మెంట్ డైరెక్టర్ డాక్టర్. శంతను శర్మ మాట్లాడుతూ అక్టోబర్ 2024లో ప్రారంభించబడిన ఈ కార్యక్రమం అయోడిన్ లోపం వలన కలిగే వ్యాధుల (ఐడీడీ)పై చైతన్యం కలిగించే లక్ష్యాన్ని కలిగి ఉందన్నారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణాల్లోని 30 జిల్లాల్లో ఆరోగ్యకరమైన ఆహారపు పద్ధతులను గురించి ప్రచారం చేస్తోందన్నారు. కేవలం ఏడు నెలల స్వల్ప కాలంలో, కార్యక్రమం తన ప్రారంభపు లక్ష్యాన్ని అధిగమించిందని, గర్భిణీలు, పాలిచ్చే తల్లులు, యుక్త వయస్సు బాలికలు బాలురు సహా 7.5 లక్షల ప్రజలపై వినూత్నమైన పెద్ద ఎత్తున ప్రభావవంతమైన పద్ధతుల ద్వారా సానుకూలంగా ప్రభావం చూపించిందన్నారు. పాఠశాలల్లో 48 స్మార్ట్ బోర్డ్స్ ఏర్పాటు చేయడంతో పాటు 42 వాల్ పెయింటింగ్స్, విద్యార్థులతో కూడిన 67 పాఠశాల అవగాహన సమావేశాలు నిర్వహించబడ్డాయని, పోషకాహారంపై డిజిటల్ అభ్యాసనలు ప్రారంభించబడ్డాయన్నారు. 33 సమావేశాల్లో 5,462 మంది ఫ్రంట్ లైన్ కార్యకర్తలకు శిక్షణ ఇవ్వబడింది అన్నారు. అయోడిన్ ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం గురించి ముందస్తుగా రికార్డ్ చేసిన ఆడియో సందేశాలు 48,000 మందిలో వ్యాప్తి చేయబడగా, షార్ట్ టెక్స్ట్ మెసేజ్లు 39,000 మందికి పైగా ప్రజలకు పంపించబడ్డాయని చెప్పారు.

ట్రాఫిక్ కష్టాల నుండి విముక్తి కల్పించాలి

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : హైటెక్ సిటీ ప్రాంతంలో కిలోమీటర్ రెండు కిలోమీటర్లు వెళ్లాలి అంటే గంటల తరబడి ప్రయాణించాలి వస్తుందని, ముఖ్యంగా హైటెక్ సిటీ పరిసర ప్రాంతాలలో ఐటీ ఉద్యోగులు ఉదయం 8. బయటికి జాబులకు వెళ్తా ఉంటారు. కానీ ట్రాఫిక్‌లో ఇరుక్కొని నరకయాతన అనుభవిస్తున్నారని సిపిఐ. శేరిలిగంపల్లి నియోజకవర్గం కార్యదర్శి సిపిఐ రామకృష్ణ తెలిపారు. రోజు రోజుకు పెరుగుతున్న ట్రాఫిక్‌ను పట్టించుకోక సరైన ప్రణాళిక లేక ప్రజలు ఇబ్బందులు గురవుతున్నారన్నారు. హైటెక్ సిటీ ప్రాంతంలో ట్రాఫిక్ కష్టాల నుండి ప్రజలకు విముక్తి కల్పించాలని కోరుతూ సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో మాదాపూర్ ట్రాఫిక్ సిఐకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు కూన సుధాకర్, డిహెచ్‌పీఎస్ శేరిలిగంపల్లి కార్యదర్శి ఎస్ కొండలయ్య పాల్గొన్నారు.

భారతీయ ప్రజా విజయోత్సవ పుష్కర మేళ

విశాలాంధ్ర - మల్కాజిగిరి : ఆపరేషన్ సింధూర కార్యక్రమంలో భాగంగా మల్కాజిగిరిలోని లక్ష్మీ సాయి గార్డెన్లో జరిగిన భారతీయ ప్రజా విజయోత్సవ పుష్కర మేళా కార్యక్రమం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా "శ్రీ లలితా సహస్ర నామ స్తోత్రం". "హనుమాన్ చాలీసా" "సౌందర్య లహరి" పారాయణం వివిధ రకాల సహస్రనామాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రామ యాదవ దంపతులు హాజరై పూజలో పాల్గొన్నారు.

ఆదివాసి బిడ్డగా నాకు ఆకలి బాధ తెలుసు

సెస్ సర్వే నివేధికను విడుదల చేసిన మంత్రి సీతక్క

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఒక ఆదివాసి బిడ్డగా తనకు ఆదివాసులు ఎదుర్కొంటున్న ఆకలి బాధలు తెలుసని మంత్రి సీతక్క అన్నారు. అందుకే ఎక్కడ ఫుడ్ గ్యాప్స్ లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆమె వెల్లడిరచారు. శుక్ర వారం బేగంపేటలోని సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్ ప్రాంగణంలో వారు చేపట్టిన యంగ్ లైవ్స్ రౌండ్ - 7 సర్వే నివేదికను రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క విడుదల చేశారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ తెలంగాణలో విద్య, ఆరోగ్యం, పౌష్టికాహారం, నేర్చుకునే సామర్థ్యం, పని, కుటుంబ పరిస్థితులపై సెస్ సర్వే చేయడం అభినందనీయమన్నారు. సర్వే నివేదికలు విధాన రూపకల్పనలో ప్రభుత్వానికి ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. క్షేత్రస్థాయి అధ్యయనాల వల్ల ప్రభుత్వ విధానాల్లో ఏవైనా లోటుపాట్లు ఉంటే సవరించుకోవచ్చన్నారు. తెలంగాణలో విద్య, వైద్యం, పౌష్టికాహారం కోసం తెలంగాణ ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. పాఠశాలల్లో ప్రభుత్వ హాస్టల్లలో మెరుగైన విద్యతోపాటు, మెరుగైన భోజన సదుపాయాలను కల్పిస్తున్నామని చెప్పారు. సరైన పౌష్టికాహారం లేకపోతే విద్యార్థులు విద్య మీద దృష్టి సారించలేకపోతున్నారని అభిప్రాయపడ్డారు. అమ్మాయిల్లో రక్తహీనతను నివారించేందుకు పోషకాలతో కూడిన చిక్కిల పంపిణీ పథకాన్ని ప్రారంభించామని వివరించారు. సెస్ నిర్వహిస్తున్న సర్వేలకు, అధ్యయనాలకు మా ప్రభుత్వం సహకారం పూర్తిస్థాయిలో ఉంటుందని వివరించారు. మీరు ఇచ్చే వాస్తవాల ప్రాతిపదికన ప్రజా సంక్షేమం కోసం మరిన్ని పథకాలు తీసుకొస్తామని పేర్కొన్నారు. సర్వేలు కేవలం సర్వేల కోసమే జరగకూడదదని, ప్రజల సమస్యలు, అభివృద్ధి ఆకాంక్షలు, విధానపరమైన లోటుపాట్లు తెలిపేలా సర్వేలు జరగాలని సూచించారు. వాస్తవాల ప్రాతిపదికన రూపొందిన సర్వేలను పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి పథకాలను రూపొందిస్తామని అన్నారు.

కేసీఆర్ కుటుంబంలో మొదలైన వాటాల పంచాయితీ

విశాలాంధ్ర - హైదరాబాద్ : బీఆర్ఎస్ అనేది ఇప్పటికే మునిపోయిన నావ అని అందులోని ఉన్న వస్తువులు కోసం కేసీఆర్ కుటుంబంలో కొట్లాట నడుస్తుందని దాంతో కాంగ్రెస్‌కు ఒరిగేది లేదా నష్టపోయేది ఏమి లేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ స్పష్టం చేశారు. 8 సీట్లు ఉన్న బీజేపీతో బీఆర్ఎస్ కలిస్తే 8స్థానాలకే పరిమితం అవుతుందని అభిప్రాయ పడ్డారు. నిజంగా బీజేపీ, బీఆర్ఎస్‌ల మధ్య ఏమి లేదనుకుంటే బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలకు రాష్ట్ర పార్టీ అధ్యక్షుని హెూదాలో కిషన్‌రెడ్డి సమాధానం చెప్పాలని సవాల్ చేశారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో అయన మాట్లాడుతూ బీజేపీ నేతలు ముందుగా వారి ఎమ్మెల్యే రాజా సింగ్ వ్యాఖ్యలకి సమాధానం చెప్పాలని తరువాత కాంగ్రెస్ గురించి మాట్లాడాలని సూచించారు. పాక్ పై యుద్ధం తీరు తెన్నుల గురించి ప్రజలకు తెలియాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు. కవిత, రాజాసింగ్ వ్యాఖ్యల్ని పోల్చిచూస్తే బీజేపీలో బిఆర్ఎస్ విలీనం తథ్యంగా కనిపిస్తుందని అన్నారు. కేసీఆర్ కుటుంబంలో వాటాల కోసం పంచాయితీ మొదల్కెందని, నోటిసులు రాగానే కేసిఆర్, ఈటలకు పాత బంధం మళ్ళీ చిగురించిందన్నారు. కాళేశ్వరం విషయంలో నోటిసులు రాగానే శామీర్ పేటలోని ఓ ఫాంహౌస్‌లో హరీష్ రావుతో ఈటల రాజేందర్ సమావేశం అయ్యారని, హరీష్‌రావుతో కలిసి ఈటల కేసిఆర్‌తో ఫోన్‌లో సంభాషించారని మహేష్‌గౌడ్ తెలిపారు. బీజేపీ నేతలు రాహుల్ గాంధీపై అవకాలు చెవాకులు పేలు తున్నారు. తస్మాత్ జాగ్రత్త అంటూ హెచ్చరించారు. సైనికులకు బాసటగా రాహుల్ గాంధీ నిలిస్తే విమర్శలు చేయడం బీజేపీ నేతల దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. ఇందిరా గాంధీ హయంలో వందల సర్జికల్ స్ట్రైక్స్ జరిగాయని, సైనిక రహస్యాల్ని రాజకీయ స్వార్థం కోసం బీజేపీ వాడుకొని లబ్ధి పొందాలని ప్రయత్నిస్తోందని దుయ్యబట్టారు. కుల సర్వే బీసీలకు వెన్నుదన్నుగా నిలుస్తామని స్పష్టంగా చెప్పామని అన్నారు. ఇందిరా గాంధీ హయంలో 90 వేల మంది సైనికులు ముక్కుకు నెలకి రాశారని గుర్తు చేశారు.

అణగారిన వడ్డెర కులస్తుల ఆశాజ్యోతి ఓబన్న

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: అణగారిన వడ్డెర కులస్తుల ఆశాజ్యోతి ఓబన్న అని రాష్ట్ర అధ్యక్షులు పీట్ల మల్లేష్ పేర్కొన్నారు. తెలంగాణ వడ్డెర సంఘం అండ్ చారిటబుల్ ట్రస్ట్ రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి అయిలమల్లు ఆదేశాల మేరకు యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు పల్లపు బాలయ్య ఆధ్వర్యంలో వడ్డెర ముద్దుబిడ్డ ఉయ్యాల వాడ నరసింహారెడ్డి సర్వ సైన్యాధికారి స్వతంత్ర సమయోధుడు వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణకు శుక్ర వారం యాదగిరిగుట్ట పట్టణ కేంద్రంలో స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఆలేరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ శివరాత్రి దానయ్య, రాష్ట్ర అధ్యక్షులు పీట్ల మల్లేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎత్తరి గణేష్ ముఖ్య అతిథులుగా హాజరై భూమి పూజ నిర్వహించారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ వడ్డెర ముద్దుబిడ్డ స్వతంత్ర సమరయోధులు వడ్డే ఓబన్న చరిత్ర గురించి భావితరాల తెలియడం కోసం ఇలాంటి మహనీయులను గుర్తించుకొని వాళ్ళ విగ్రహాలు ఆవిష్కరించడం ఎంతో శుభ సూచకం అన్నారు. మదర్ డైరీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి వీరులను గుర్తుంచుకొని వారి ఆశయాల సాధన కోసం ఐక్యంగా ఉండి పోరాడాలని సూచించారు. రాష్ట్ర అధ్యక్షులు పీట్ల మల్లేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న వడ్డెరలు వడ్డే ఓబన్న ఆశయాల సాధన కోసం, వడ్డెర జాతి భావితరాల తలరాతలు మారాలంటే రాష్ట్రంలో ఉన్న వడ్డెరలంతా కలిసికట్టుగా ముందుకు రావాలని తెలిపారు. జూన్ 22వ తేదిన యాదాద్రి జిల్లా 16 మండలాల ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర నాయకులు పల్లపు యాదగిరి, జిల్లా ఉపాధ్యక్షుడు బోదాసు మహేష్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శివరాత్రి సురేష్,జిల్లా కోశాధికారి వరికుప్పల స్వామి, జిల్లా కార్యదర్శి వల్లపు నరసింహ, ఆలేరు మండల అధ్యక్షుడు మార్ల సత్తయ్య, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ పల్లపు తిరుపతి, కుత్బుల్లాపూర్ మండల అధ్యక్షుడు పల్లపు బాబు, ఆలకుంట్ల శీను, శివరాత్రి స్వామి, శివరాత్రి మల్లేష్, దండ్ల భానుచందర్, దండ్ల వెంకటయ్య, శివరాత్రి పోశయ్య, దండ్ల బాల నరసింహ, శివరాత్రి నరేష్, పల్లపు శీను, కొడదాల మహేందర్, పల్లప్ కుమార్, బోదాసు లింగయ్య, బోధస్ సంతోష్, పల్లపు వాసు పాల్గొన్నారు.

అవగాహనలేని ముఖ్యమంత్రి పాలన

విశాలాంధ్ర-దుండిగల్: అవగాహన లేని ముఖ్యమంత్రి తెలంగాణ రాష్ట్రానికి పాలించడం సిగ్గుచేటని దుండిగల్ మున్సిపాలిటీ అధ్యక్షులు పిసరి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారత ప్రభుత్వం, సైనికులను అవమానిస్తూ చేసిన వ్యాఖ్యలను బీజేపీ దుండిగల్ మున్సిపాలిటీ అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన జైహింద్ ర్యాలీ పేరుతో ప్రతి చౌరస్తా నందు కాంగ్రెస్ పార్టీ జండాలు, నాయకుల మేడలో పార్టీ కండువాలె, కానీ రేవంత్‌రెడ్డి మాట్లాడితే అన్ని నీతి తప్పిమాటలని, బీజేపీ యుద్దాన్ని రాజకీయంగ వాడుకుంటుందన్నా రని తెలిపారు. అనంతరం మన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేశం, యుద్ధం గురించి కనీసం అవగాహన లేని నాయకుడు తెలంగాణను పరిపాలిస్తుంటే సిగ్గుగా ఉందన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత మల్కాజ్గిరి ఎంపీగా గెలిచినా 5 ఏళ్ల పరిపాలనలో జాడేలేనివారు కుత్బుల్లాపూర్ అసెంబ్లీ బాచుపల్లికి ఎందుకు వచ్చారన్నారు. ముఖ్యమంత్రి ఒక నియోజకవర్గనికి వస్తే ఏదైనా తాత్కాలిక రోడ్ల మరమ్మతులు చేయాలన్నారు.

జూన్ 2 నుంచి శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు

విశాలాంధ్ర-బషీర్ బాగ్ : జూన్ 2 నుంచి 7వ తేదీ వరకు శ్రీవారి 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభిస్తున్నామని టీటీడీ ఆలయ ఈవో రమేష్ బాబు పేర్కొన్నారు. శుక్రవారం లిబర్టీ, టిటిడి అనుబంధ బాలాజీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆలయ అధికారులు కృష్ణమాచార్యులు, శ్రీనివాస ప్రభు, రమేష్, త్రినాథ్ బాబు, హరికృష్ణ, మాజీ టీటీడీ లోకల్ అడ్వైజరీ బోర్డు సభ్యులు భీశ్వ రవిలతో కలిసి ఈవో రమేష్ బాబు మాట్లాడారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా ఆరు రోజులపాటు జరుపనున్నట్లు తెలిపారు. 2న సాయంత్రం 6 గంటల నుంచి ఉత్సవ వేడుకలకు అంకురార్పణ జరగనున్నట్లు చెప్పారు .3వ తేదీన ఉదయం 6:30 గంటలకు ధ్వజారోహణం, 10 గంటలకు శేష వాహనం, రాత్రి 8 గంటలకు హనుమంత వాహనం సేవలు, నాలుగో తేదీన సూర్యప్రభ వాహనం, స్నపన తిరు మంజనం, చంద్రప్రభ వాహనం సేవలు, ఐదవ తేదీన గజవాహనం, శాంతి కళ్యాణం, గరుడ వాహనం సేవలు, ఏడవ తేదీన మహా పూర్ణాహుతి, చక్రస్నానం, శ్రీ పుష్పయాగం సేవలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సేవలను దర్శించుకొను భక్తులకు ప్రారంభ తేదీ నుంచి ఉదయం అల్పాహారం మధ్యాహ్నం అన్నప్రసాధ వితరణ ఉచితంగా దేవస్థానం అందిస్తుందని వెల్లడించారు. ఈ బ్రహ్మోత్సవాలు త్రినాథ్ బాబు సహకారంతో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వెల్లడించారు. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాల ప్రతిని ఆలయ అధికారులు ఆవిష్కరించారు.

త్వరలో 3 సబ్ స్టేషన్లు ప్రారంభం



విశాలాంధ్ర - పటాన్ చెరువు : శరవేగంగా అభి వృద్ధి చెందుతున్న పటాన్చెరు నియోజకవర్గంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు నూతన సబ్ స్టేషన్ల నిర్మాణాలు చేపడుతున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని డిఈలు, ఏడిఈలతో విద్యుత్ సరఫరా, పంపిణీ అంశాలపైన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కోతలు లేకుండా నాణ్యమైన విద్యుత్తును అందించామని తెలిపారు. విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా నూతనంగా రామచంద్రాపురం, అమీన్పూర్ గోశాల, చక్రపురి కాలనీల పరిధిలో 15 కోట్ల రూపాయలతో 33/11 కెవి సామర్థ్యంతో సబ్ స్టేషన్ల నిర్మాణం పూర్తి చేయడం జరిగిందని, త్వరలో ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. పటాన్చెరు మండలం పోచారం, సింఫనీ కాలనీ, రామేశ్వరం బండ, గడ్డ పోతారం మున్సిపల్ పరిధిలోని మాదారం పరిధిలో 33/11 కెవి సబ్ స్టేషన్ల ఏర్పాటుకు టెండర్లు ఆహ్వానించడం జరిగిందని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని తెలిపారు.

అధ్యాపకుల హక్కుల సాధన కోసం కృషి

విశాలాంధ్ర - రాజేంద్రనగర్ : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో శాస్త్రవేతలుగా, అధ్యాపకులుగా పనిచేస్తున్న వారి హక్కుల సాధన కోసం కృషి చేస్తామని తెలంగాణ అగ్రికల్చరల్ సైంటిస్ట్ అసోసియేషన్ (టాసా) అధ్యక్షునిగా ఎన్నికైన డాక్టర్ కె.పవన్ చంద్రారెడ్డి అన్నారు. ప్రతిష్టాత్మకమైన వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగిన టాసా ఎన్నికలలో డాక్టర్ కె. పవన్ చంద్రారెడ్డి అధ్యక్షునిగా ఘన విజయం సాదించారు. ఈ సందర్భంగా ఆయన పాలకవర్గ సభ్యులతో కలసి విలేకరులతో మాట్లాడారు. ఎనిమిది సంవత్సరాలుగా వ్యవసాయ వర్శిటీ అధ్యాపకులకు పీఆర్సీ ఏరియర్స్ రావాల్సి ఉందని, ఈ విషయమై కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కు లేఖ రాశామని గుర్తు చేశారు. విశ్వవిద్యాలయం స్థాయిలో ప్రతి సంవత్సరం సీఏస్ నోటిఫికేషన్లు ఇచ్చి ప్రమోషన్లు కల్పించాలని, ఆ ప్రక్రియ ఇక మీదట ప్రతి సంవత్సరం సాఫీగా జరిగేలా చూస్తామన్నారు. రాష్ట్రంలో ఇతర విశ్వవిద్యాలయాలలో పనిచేస్తున్న అధ్యాపకుల పదవీ విరమణ వయస్సు 65 సంవత్సరాలకు పెంచారని, వ్యవసాయ, వెటర్నరీ, ఉద్యాన విశ్వవిద్యాలయాలలో కూడా పదవీ విరమణ వయస్సును 65 సంవత్సరాలకు పెంచేలా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామన్నారు. ఈ ఎల్ లీవులు ఎన్ క్యాష్ మెంట్ చేసుకునే వీలును 2017 నుంచి నిలిపి వేశారని, ఇక మీదట ఈఎల్ లను ఎన్ క్యాష్ చేసుకునేలా చూస్తామన్నారు. అధ్యాపకులందరికి హెల్త్ కార్డులు ఇప్పిస్తామని, ఇన్సురెన్స్ సౌకర్యం కల్పిసా బిమని, మెడికల్ రీ యంబర్స్ మెంట్ సౌకర్యాన్ని కల్పించాలని కోరతామన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం భూములను ఇతర సంస్థలకు ఇవ్వకుండ చూస్తామన్నారు.

గద్దర్ ఫిలిం అవార్డులను రద్దు చేయండి

విశాలాంధ్ర-బషీర్ బాగ్: తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డుల ఎంపిక ఆంధ్ర పెద్దల కనుసనల్లో జరిగిందనీ, 2014 నుండి చేసిన అవార్డుల ఎంపిక సరైంది కాదని తెలంగాణ సినిమా వేదిక కో కన్వీనర్ మోహన్ బైరాగి, టిసివి గౌరవ అధ్యక్షులు తుమ్మల ప్రాపుల్ రామ్ రెడ్డి, సినీ దర్శకులు ఎండి రఫీ, సీనియర్ జర్నలిస్ట్ సైై బాబా, టిసివి రాష్ట్ర కన్వీనర్ లారా, ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర నాయకులు సుధాకర్‌లు అన్నారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గద్దర్ ఫిలిం అవార్డులను వెంటనే రద్దు చేసి, కమిటీ వేసి తెలంగాణ సినిమాలకె గద్దర్ ఫిలిం అవార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సినిమా అవార్డు ఎంపికలో ఆంధ్ర వాళ్ళు ఉండడం పలు అనుమానాలకు తావిస్తుందన్నారు. తెలంగాణ కవులు కళాకారులు, సినిమా రచయితలు, ఆర్టిస్టులు అందరూ తెలంగాణ సినిమాకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించాలని వారు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 11 సంవత్సరాలు అవుతున్న ఇప్పటివరకు తెలంగాణ సినిమా రంగం విభజన జరగలేదని, తెలంగాణ ఫిలిం ఛాంబర్‌కు కోరలు లేకుండా చేశారని వాళ్లు ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ సినిమాకు జరుగుతున్న అన్యాయం గురించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించకపోతే తగు గుణపాఠం చెబుతామని వాళ్లు అన్నారు. ఈ కార్యక్రమంలో మురలీధర్ దేశపాండే, పంజాలా శ్రవణ్ గౌడ్, రవి, హరి, అరుణ, సుజి, ప్రసాద్, బాలు నాయక్, నరసింహ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చర్లపల్లి రైల్వేస్టేషన్‌ను సందర్శించిన ఆర్టీసీ రీజినల్ మేనేజర్

విశాలాంధ్ర - కాప్రా : రైల్వే ప్రయాణికుల రవాణా సౌకర్యార్థం నడుస్తున్న బస్సుల వివరాలను సమీక్షించేందుకు గాను ఆర్టీసీ సికింద్రాబాద్ రీజినల్ మేనేజర్ సుచరిత శుక్రవారం చర్లపల్లి రైల్వేస్టేషన్‌ను సందర్శించి పరిశీలించారు. అనంతరం రైల్వే అధికారులతో సమీక్ష జరిపి నిత్యం ఎన్ని రైళ్లు నడుస్తున్నాయి, ప్రయాణికులు ఎంత మంది దిగటం, ఎక్కడం జరుగుతుందనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం నడుస్తున్న బస్సుల ట్రిప్పులు ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా ఉన్నాయా లేక ఇంకా ఆవశ్యకత ఉందా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. చర్లపల్లి రైల్వేస్టేషన్ నుండి నడుస్తున్న బస్సుల వివరాలను తెలుసుకున్నారు. ప్రయాణికుల అవసరాల మేరకు బస్సులు నడుపనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ పవిత్ర, చెంగిచెర్ల డిపో మేనేజర్ కే. కవిత, అసిస్టెంట్ మేనేజర్ చంద్రమౌళి, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

బోడుప్పల్‌లో రామచంద్ర జ్యువెలర్స్ ప్రారంభం

విశాలాంధ్ర - మేడిపల్లి: బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నూతనంగా ఏర్పాటు చేసిన రామ చంద్ర జ్యువెలర్స్ ప్రారంభోత్సవ కార్యక్రమం శుక్రవారం ఉదయం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఆర్‌వి ఫౌండేషన్ వ్యవస్థాపకులు తుంగతుర్తి రవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యువెలర్స్ యాజమాన్యమైన సంతోష్ చారికి తుంగతుర్తి రవి శుభాకాంక్షలు తెలియజేశారు. వ్యాపార అభివృద్ధి, వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలంటూ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు కుటుంబ సభ్యులు, స్నేహితులు, అనేక మంది స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

టీజేఎఫ్ రజతోత్సవ వేడుకలను విజయవంతం చేద్దాం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : ఈనెల 31 శనివారం రోజు ఉదయం 10 గంటలకు హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లోని జలవిహార్‌లో నిర్వహిస్తున్న తెలంగాణ జర్నలిస్టు ఫోరం రజతోత్సవ వేడుకలను శేరిలింగంపల్లి జర్నలిస్టులందరం భారీగా తరలివెళ్లి విజయవంతం చేద్దాం. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనలో జర్నలిస్టులుగా మనం ఉద్యమంలో ముందున్నాం. తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం (టీజెఎఫ్) వేదికగా తెలంగాణ కోసమే తెలంగాణ జర్నలిస్టులు అనే నినాదంతో ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో కదం తొక్కాము. తెలంగాణ రాష్ట్ర సాధనలో మనం ఉండటం మన తరం జర్నలిస్టుల అదృష్టం. అందుకే టీజెఎఫ్‌ను స్థాపించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న తరుణంలో రజతోత్సవ సంబురాలు జరుపుకోవాలని మన నాయకత్వం నిర్ణయం తీసుకుంది. శనివారం నగరంలోని నెక్లెస్ రోడ్ జలవిహార్‌లో నిర్వహించనున్న టీజెఎఫ్‌ను రజతోత్సవ వేడుకలకు మనమందరం తరలివెళ్ళి మన ఉద్యమ జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సంబరాలు చేసుకుందాం. శేరిలింగంపల్లి జర్నలిస్టులందరం ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో తరలివెళ్లి విజయవంతం చేద్దాం.

డివిజన్ల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - పటాన్ చెరువు : జిహెచ్‌ఎంసి పరిధిలోని రామచంద్రపురం, భారతీనగర్, పటాన్ చెరువు డివిజన్ల పరిధిలో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్ చెరువు డివిజన్ పరిధిలోని జెపి కాలనీ, చైతన్య నగర్ కాలనీలలో 93 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న యు జి డి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ల పరిధిలో నూతన అంతర్గత రహదారులు, యుజిడీల నిర్మాణ పనులకు నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. ప్రజలకు మెరుగైన పరిపాలన అందించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పటాన్ చెరువు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, హెచ్ఎండబ్ల్యూఎస్ డీజీఎం శివకృష్ణ, సీనియర్ నాయకులు కొమరగూడెం వెంకటేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బిహతా విమానాశ్రయానికి సహజానంద సరస్వతి పేరు

సీపీఐ ఎంపీ సంతోశ్ కుమార్ డిమాండ్

పౌర విమానయాన శాఖ మంత్రికి లేఖ

న్యూదిల్లీ: బీహార్‌లోని కొత్త 'బిహతా' విమానాశ్రయానికి ప్రముఖ రైతు నాయకుడు, అఖిలభారత కిసాన్ సభ (ఏఐకేఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు స్వామి సహజానంద సరస్వతి పేరు పెట్టాలని సీపీఐ ఎంపీ సంతోశ్ కుమార్ డిమాండ్ చేశారు. ఆయన ఈ మేరకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుకు ఓ లేఖ రాశారు. భారత వ్యవసాయ ఉద్యమాలు, రైతాంగ, సామాజిక న్యాయం కోసం పోరాటాలకు సహజానంద సరస్వతి తోడ్పాటు మరువలేమన్నారు. రైతు ఉద్యమ నాయకుల్లో ఆయన ముఖ్యులని, ఆధ్యాత్మిక గురువుగానే కాకుండా అణగారిన వర్గాల నిర్భయ స్వరంగా స్వామి సహజానంద సరస్వతి నిలిచారని సంతోశ్ కుమార్ వెల్లడించారు. జమిందారీ వ్యవస్థ దోపిడీని దీటుగా ఎదుర్కొన్నారని, దేశంలో ఆధునిక రైతాంగ ఉద్యమానికి పునాది వేశారని సహజానంద్ సరస్వతి గురించి కేంద్ర మంత్రికి సంతోశ్ కుమార్ వెల్లడించారు. బిహతా విమానాశ్రయానికి స్వామి సహజానంద సరస్వతి పేరు పెట్టడం చారిత్రకంగా, నైతికంగా సముచితమన్నారు. అలా చేయడంతో దేశవ్యాప్తంగా రైతాంగ ఉద్యమాలకు స్ఫూర్తినిచ్చిన బీహార్ బిడ్డకు తగిన గౌరవం లభిస్తుందని పేర్కొన్నారు. చారిత్రక సున్నితత్వంతో సత్వరమే చర్యలు తీసుకోవాలని సీపీఐ కోరుతోందన్నారు. గ్రామీణ సంక్షోభం, వ్యవసాయపరమైన సమస్యలపై జాతీయ స్థాయి చర్చ జరుగుతున్న ఈ సమయంలో స్వామి సహజానంద సరస్వతి వారసత్వాన్ని గుర్తించడం సమయానుచితమని సంతోశ్ కుమార్ నొక్కిచెప్పారు. స్వామి సహజానంద్ సరస్వతికి తగిన గుర్తింపు లభించేందుకు తమ డిమాండ్‌కు మద్దతు ఇవ్వాలని బీహార్ సహా దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్య శక్తులు, రైతు సంఘాలు, ప్రజా ప్రతినిధులకు భారత కమ్యూనిస్టు పార్టీ పిలుపునిచ్చింది.

భారత్... ప్రేక్షక దేశం కారాదు

పలస్తీనాకు ఎల్లప్పుడు అండగా నిలవాలి

సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా

న్యూదిల్లీ: గాజాలో మానవతా సంక్షోభం, ఆకలి కేకలపై సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా తీవ్రస్థాయిలో ఆందోళన వ్యక్తం చేశారు. పలస్తీనాకు మద్దతిచ్చే భారత్ వైఖరికి కట్టుబడాలని మోదీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అకలిని యుద్ధ అస్త్రంగా వినియోగించడాన్ని ఆక్షేపించాలని రాజా ఒక ప్రకటనలో కోరారు. అంతర్జాతీయ చట్టానికి కట్టుబడాలని విన్నవించారు. మౌనంగా ఉంటే పరిస్థితి మరింత జటిలం అవుతుందని, తక్షణమే తగు విధంగా స్పందించడం భారత్‌కు అవసరమని సూచించారు. ప్రేక్షక దేశంగా భారత్ చరిత్రలో మిగిలిపోకూడదని, న్యాయం కోసం కచ్చితంగా నిలబడే దేశంగా గుర్తిండాలని రాజా నొక్కిచెప్పారు. 'ఇజ్రాయిల్‌కు లొంగిపోయేలా గాజా ప్రజలను పస్తులు ఉంచి చంపేస్తున్నారు. ఆకలిని యుద్ధ అస్త్రంగా మలిచారు. ఇందుకు అమెరికా మద్దతిస్తోంది.



పూర్తిస్థాయిలో దిగ్బంధనం, సహాయ నిరాకరణ, ఆకలి ఆయుధీకరణ ద్వారా మానవ సృష్టిత విపత్తు ఆవిష్కృతమవుతోంది. పౌష్టికాహార లోపంతో చిన్నారులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఆసుపత్రుల్లో మందుల కొరత ఉంది. గాజా దృశ్యం మానవతా విపత్తు మాత్రమే కాదు, మానవళిపై క్రూరమైన నేరం. ఓ వర్గాన్ని తుడిచిపెట్టేందుకు యుద్ధం ముసుగులో సాగిస్తున్న వ్యూహాత్మక పాశవికత. ప్రపంచ కళ్ల ఎదుట పలస్తీనియన్లపై నేరాలు-ఘోరాలు జరుగుతున్నాయి. అంతర్జాతీయ సమాజం ఇప్పటికైనా తన కళ్లు, చెవులు తెరవాలి' అని రాజా వ్యాఖ్యానించారు. భారత్ చూసిచూడనట్లు వ్యవహరించలేదన్నారు. భారతీయులు, పలస్తీనియన్ల మధ్య బంధం ఇప్పటిది కాదని, వలసవాదం, దురాక్రమణకు వ్యతిరేక పోరాటాల కాలం నుంచి కొనసాగుతోందని గుర్తుచేశారు. 'మహాత్మాగాంధీ, జవహర్ లాల్ నెహ్రూ పలస్తీనాకు మద్దతిచ్చారు. పలస్తీనియన్ల డిమాండ్లు న్యాయమైనవిగా నమ్మారు. పలస్తీనా ప్రజల కోసం సంఘీభావాన్ని కూడగట్టడంతో సీపీఐ అగ్రభాగాన నిలిచింది. గౌరవం, ఆత్మస్థైర్యం, స్వాతంత్ర్యం కోసం అంతర్జాతీయ ఉద్యమంలో భాగంగా వారి పోరాటాన్ని భావించింది. పలస్తీనాతో మన చారిత్రక నిబద్ధతను కాదనలేం' అని రాజా వెల్లడించారు. పలస్తీనాకు అండగా నిలవాలన్న భారత నిబద్ధతను నీరుగార్చవద్దని మోదీ ప్రభుత్వాన్ని కోరారు.

హిందూత్వం అమలుకే...

దిల్లీలో నిరుపేదల బస్తీ ఖాళీపై నారాయణ విమర్శ

కూల్చిన ఇళ్ల స్థానంలో మేడలు కట్టివ్వాలని డిమాండ్

న్యూదిల్లీ: నిరుపేదల బస్తీని ఖాళీ చేయించి దానిని కార్పొరేట్ ఆశ్రిత పెట్టుబడిదారులకు దారాదత్తం చేయడమే బీజేపీ ప్రభుత్వ నిజమైన ఉద్దేశమని సీపీఐ కార్యదర్శి కె.నారాయణ విమర్శించారు. పేదలందరినీ తొలగించడం ద్వారా హిందూత్వ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నదని, దిల్లీ నగర పరిధిలో ఎస్సీలు, ఎస్టీలు లేకుండా చేయాలని చూస్తున్నదన్నారు. పూర్వం రాజుల తరహా పద్ధతులను ఆధునిక పాలకులు అనుసరిస్తున్నారని నారాయణ దుయ్యబట్టారు. ఏ స్థలంలో అయితే కూల్చివేతలు చేపట్టారో అక్కడ బహుళ అంతస్తుల భవనాలు నిర్మించి, పేదలకు ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఆధునికీకరణ, సుందరీకరణ, అభివృద్ధి నెపంతో పేదలను తొలగించాలంటే సీపీఐ ఊరుకోదని పక్కాణించారు. నిరుపేద దిల్లీవాసుల పోరాటానికి సీపీఐ పూర్తిస్థాయిలో అండగా నిలుస్తుందని నారాయణ నొక్కిచెప్పారు. దిల్లీలోని మురికివాడల తొలగింపును ఆక్షేపించారు. పేదలకు వారి ఇళ్లు ఉండే స్థలంలో కొత్త భవనాలు కట్టివ్వాలని నొక్కిచెప్పారు. అలా చేస్తే జీవన స్థితిగతులు మెరుగవుతాయని, పేదలకు ఉపాధి లభిస్తుందని, పిల్లలు చదువుకోగలరన్నారు. సీపీఐ దిల్లీ సమితి అధ్వర్యంలో నారాయణ, ప్రొఫెసర్ దినేశ్ వార్ష్నే (సీపీఐ దిల్లీ కార్యదర్శి), దిల్లీ కార్యదర్శి వర్గ సభ్యులు శంకర్‌లాల్, కేహర్ సింగ్, అబ్బర్ అహ్మద్, సమితి సభ్యుడు బబ్బన్ కుమార్ సింగ్‌తో కూడిన ప్రతినిధుల బృందం శుక్రవారం కూల్చివేతలు జరిగిన మదరాసీ క్యాంపు, జంగ్‌పురా బి బస్తీలో పర్యటించారు. తమిళనాడు నుంచి 50-60 ఏళ్ల కిందట వలస వచ్చి ఇక్కడే స్థిరపడిన బాధితులను పరామర్శించారు. ఈ ప్రాంతంలో ఉండేవారు దిల్లీలోని నిరుపేదలని, వీరు ఇంటి పనివారిగా, సఫాయి కర్మచారీలుగా, రోజువారీ కూలీలుగా, చిరు విక్రేతలుగా ఉన్నారని ప్రతినిధులు గుర్తించారు. బస్తీ ప్రజల దీనస్థితిపై ఆవేదన వ్యక్తం చేశారు. వీరికి ఇక్కడే మేడలు కట్టివ్వాలని డిమాండ్ చేశారు. సుందరీకరణ పేరిట పేదల ఇళ్లు కూల్చేయడం, నరేలా ప్రాంతానికి 50 కిమీల దూరానికి పంపేయాలని అనుకోవడం దుర్మార్గమని నారాయణ అన్నారు. 2024లో నీళ్లు నిలిచిపోవడానికి కారణంగా చెబుతూ పేదల బస్తీని ఖాళీ చేయించడం ఆమోదయోగ్యం కాదన్నారు. మెట్రో రైల్వే నిర్మాణాల వల్ల నీరు నిలిచిందని గుర్తుచేశారు. నీరు నిలిచిపోయే సమస్యను ప్రత్యామ్నాయ మార్గాల్లో పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ కారణాన్ని చూపుతూ పేదల బస్తీని ఖాళీ చేయించి దానిని కార్పొరేట్‌లకు ఊడిగం చేయడమే బీజేపీ ప్రభుత్వ నిజమైన ఉద్దేశమని నారాయణ వ్యాఖ్యానించారు. ఈ చర్యలను సీపీఐ అడ్డుకుంటుందన్నారు.

ఆరు శాసనాలు ప్రజల్లోకి తీసుకెళ్లండి

ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలతో చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: కడప మహానాడు అద్భుతంగా జరిగిందని, నాయకత్వం సమిష్టిగా పనిచేస్తే ఏ కార్యక్రమమైనా సజావుగా జరుగుతుందని నిరూపితమైందని, విజయవంతం చేసిన కార్యకర్తలకు నా హాట్సాఫ్ అంటూ టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు నేతలందరికీ అభినందనలు తెలియజేశారు. దిల్లీ పర్యటనలో ఉన్న చంద్రబాబు శుక్రవారం ఉదయం టీడీపీ ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. మంత్రులంతా కార్యకర్తల్లా పనిచేసి స్ఫూర్తినిచ్చారు. మహానాడుకు ప్రజలు, కార్యకర్తలు స్వచ్ఛందంగా రావడం సంతోషాన్నిచ్చింది. మహానాడులో ప్రవేశపెట్టిన 'నా తెలుగు కుంటుంబం'లోని ఆరు శాసనాల కాన్సెప్ట్‌ను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి. కూటమి ప్రభుత్వంపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిజం చేస్తున్నాం. ఏడాదిలో మన ప్రభుత్వం చేపట్టిన పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, పాలనా నిర్ణయాలపై ప్రజల్లో సానుకూలత ఉంది. ప్రజలకు ఏడాది పాలనలో ఏం చేశామో...రాబోయే రోజుల్లో ఏం చేస్తామో మహానాడు ద్వారా వివరించాం. ప్రజలతో నాయకులు మరింత మమేకమవ్వడం ద్వారా ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలపై నిరంతరం చర్చించేలా చూడాలి. నేను ప్రతి నెలా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనడాకి కారణం కూడా అదేనని చంద్రబాబు తెలిపారు. ఎమ్మెల్యేలు కూడా విధిగా పేదల సేవల్లో పాల్గొనాలని సూచించారు. జూన్‌లోనే తల్లికి వందనం, అన్నదాత పథకాలు ప్రారంభిస్తాం. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించబోతున్నామని, ప్రతి ఒక్కరికీ సంక్షేమం అందేలా సంక్షేమ కేలండర్‌ను త్వరలోనే ప్రకటిస్తామని చంద్రబాబు చెప్పారు.

ఎస్‌హెచ్‌జీ మహిళలకు సకాలంలో రుణాలు

మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: స్వయం సహాయక సంఘాలకు డిజిటల్ వార్షిక రుణ ప్రణాళిక ద్వారా నమోదు చేసుకున్న విధంగా అవసరమైన రుణాలను వారికి అవసరమైన సమయంలో ఇవ్వాలని, రుణాలు మంజూరు చేసేటప్పుడు ఆ సంఘానికి ఉన్న గుర్తింపు, అర్హతకు తగిన విధంగా రుణాలు ఇవ్వాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం వార్షిక రుణ, ప్రణాళిక, మహిళా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల రుణాల మంజూరుపై సెర్ప్ కార్యాలయంలో సీఈవో వాకాటి కరుణ అధ్యక్షతన బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో వర్చువల్‌గా పాల్గొన్న మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళల అధ్వర్యంలో వ్యాపారాల కోసం రుణాలు తీసుకుని, వ్యాపారాలు నిర్వహిస్తున్న వారికి రెండు శాతం ఇంటర్ సబ్‌వెన్షన్ వర్తిస్తుందని, దీనిని దృష్టిలో ఉంచుకొని మహిళా పెట్టుబడులను ప్రోత్సహించాలన్నారు. విశ్వాస్ స్కీమ్ ద్వారా ఎక్కువ మంది లబ్ధి పొందేలా బ్యాంకర్లు సహకరించాలని, ఎస్‌హెచ్‌జీ సభ్యుల కుల, ఆదాయ వివరాలను సెర్ప్ అధికారులు... బ్యాంకు అధికారులకు వివరించారు. ప్రతి నెల 10వ తేదీలోపు బ్యాంకుల ద్వారా మంజూరు చేసిన రుణాల వివరాలను సెర్ప్ ఆఫీసుకు పంపించాలని బ్యాంకర్లకు విజ్ఞప్తి చేశారు. బ్యాంకర్ లాగిన్‌లో రుణ ప్రతిపాదనలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. సమావేశంలో స్త్రీనిధి బ్యాంక్ ఎండీ ప్రసాదరావు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

దేశ భవిష్యత్‌కు మైనింగ్ తోడ్పాటు: కొల్లు రవీంద్ర

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర, దేశ భవిష్యత్తును మార్చగల సత్తా మైనింగ్ రంగానికి మాత్రమే ఉందని గనులు భూగర్భ వనరుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. విజయవాడలోని నోవోటెల్‌లో శుక్రవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రఖ్యాత సంస్థలు, నిపుణలను కలుపుకుని రాష్ట్ర, దేశ మైనింగ్ రంగ భవిష్యత్తును మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో లైమ్ స్టోన్, మాంగనీస్, ఐరన్ ఓర్, బంగారం, క్వార్ట్ వంటి మేజర్ మినరల్స్ నిల్వలు అపారం ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవడం ద్వారా దేశ పారిశ్రామిక రంగ ముఖ చిత్రాన్ని మార్చగలమని అన్నారు. రాష్ట్రంలో ఉన్న వనరుల్ని దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి వినియోగించుకోవాలన్నారు. మైనింగ్ రంగంలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవడమే లక్ష్యంగా జీఎస్ఐ, ఐబీఎం, ఎంఈసీఎల్ ప్రతినిధులతో సదస్సు ఏర్పాటు చేసుకోవడం సంతోషదాయకమన్నారు. జాతీయ, ప్రైవేట్ మైనింగ్ ఏజెన్సీలకు మంచి అవకాశం కల్పిస్తున్నామన్నారు. రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి, ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ముందుకొచ్చే పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వపరంగా పూర్తిగా సహకరించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. దేశంలో ఏపీ మైనింగ్ రంగాన్ని అగ్రస్థానంలో నిలపాలని ప్రయత్నిస్తున్నామన్నారు. మైన్స్ సెక్రటరీ ప్రవీణ్ కుమార్, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ సత్యన్నారాయణ మహాపాత్రో, ఎంఈసీఎల్ డైరెక్టర్ పంకజ్ పాండే, ఐబీఎం కంట్రోలర్ ఆఫ్ మైన్స్ శైలేంద్రకుమార్, రఘుపతి పెద్దిరెడ్డి పాల్గొన్నారు.

1 నుంచి 15 వరకు రేషన్ పంపిణీ: మంత్రి నాదెండ్ల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అవకతవకలకు ఆస్కారం లేకుండా రేషన్ దుకాణాల ద్వారా సరుకుల పంపిణీ చేపడుతున్నట్టు పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్లు, జిల్లా సరఫరా అధికారులతో శుక్రవారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ప్రభుత్వ నిర్ణయం మేరకు జూన్ ఒకటో తేదీ నుంచి డీలర్లు... నిత్యావసరాలు పంపిణీకి సిద్ధం కావాలని సూచించారు. డీలర్లు ప్రభుత్వానికి మంచిపేరు తేవాలని కోరారు. కార్డుదారుల కుటుంబాలకు కుటుంబ పెద్దలా ఉన్న డీలర్లు ఇప్పుడు కూడా మనసు పెట్టి పనిచేసి కార్డుదారులకు గౌరవంగా సేవలందించాలన్నారు. ప్రతినెలా ఒకటో తేదీ నుంచి 15 వరకు ఆదివారాల్లో సైతం సరుకులు పంపిణీ పూర్తి చేయాలన్నారు. ప్రతి నెల అయిదో తేదీలోపే దివ్యాంగులు, 65 ఏళ్లు పైబడి వృద్ధులకు ఇంటివద్దే రేషన్ సరుకులు పంపిణీ చేసేందుకు చొరవ చూపాలన్నారు. వాట్సాప్ గ్రూపు ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం అందించడం వల్ల, కార్డుదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడవచ్చన్నారు. ఎప్పుడైనా సాంకేతిక సమస్యలు ఎదురైనాసరే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సరుకుల పంపిణీ జరగాల్సిందేనని స్పష్టం చేశారు.

మద్యం కుంభకోణం కేసులో ఆ నలుగురి కస్టడీ విచారణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన మద్యం కుంభకోణం వ్యవహారంలో నిందితుల కస్టడీ విచారణ కొనసాగుతోంది. ఏసీబీ కోర్టు అనుమతితో ప్రధాన నిందితుడు రాజ్ కసిరెడ్డితో పాటు కీలక నిందితులు రిటైర్డ్ ఐఏఎస్ ధనుంజయరెడ్డి, మాజీ సీఎం వైఎస్ జగన్ ఓఎస్‌డీ కృష్ణమోహన్ రెడ్డి, భారతి సిమెంట్స్ డైరెక్టర్ గోవిందప్ప బాలాజీని సిట్ అధికారులు శుక్రవారం విజయవాడ జిల్లా జైలు నుంచి కస్టడీలోకి తీసుకున్నారు. విజయవాడ జీజీహెచ్ ఆసుపత్రికి తీసుకువెళ్లి వైద్య పరీక్షలు చేయించారు. అనంతరం సిట్ కార్యాలయానికి తరలించారు. ఈ నలుగురిని న్యాయవాది సమక్షంలో సాయంత్రం 6 గంటల వరకు సిట్ ప్రధానాధికారి రాజశేఖర్ బాబు విచారించారు. మద్యం కుంభకోణంలో వచ్చిన డబ్బును ఎక్కడెక్కడ పెట్టుబడులు పెట్టారు? ఖరీదైన ఆస్తులు ఎక్కడ కొన్నారు? ఖరీదైన కార్లు ఎవరి కోసం కొన్నారు? తదితర ప్రశ్నలు సంధించారు. నిందితుల కుటుంబ సభ్యుల వ్యాపారాల్లో పెట్టుబడులుగా వచ్చిన డబ్బు గురించీ ఆరా తీశారు. బ్యాంకు లావాదేవీల ఆధారంగా నిందితులను ప్రశ్నించారు. 2019-24లో కొనుగోలు చేసిన ఆస్తుల వివరాలను రిజిస్ట్రార్ శాఖ నుంచి సిట్ సేకరించింది. దీంతో ఈ ఆస్తులపై నిందితులను అధికారులు ప్రశ్నించారు. ఏసీబీ కోర్టు రెండు రోజుల కస్టడీ విచారణకు అనుమతివ్వగా, మొదటి రోజు విచారణ పూర్తి కాగా రెండవ రోజైన శనివారం సిట్ విచారణ కొనసాగనుంది.

జగన్‌కు రాష్ట్ర ఎండీయూ యూనియన్ విజ్ఞప్తి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మీరే మమ్మల్ని ఆదుకోవాలంటూ రాష్ట్ర మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్స్ (ఎండీయూ) యూనియన్ మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి విజ్ఞప్తి చేసింది. రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రేషన్ సరుకులను ఇంటి వద్దనే డెలివరీ చేసే ఎండీయూల నిర్వాహకులు ఉపాధి కోల్పోయారు. జూన్ 1 నుంచి ఇంటింటికీ రేషన్ పంపిణీ వ్యవస్థకు స్వస్తి చెప్పాలన్న కూటమి ప్రభుత్వ నిర్ణయంతో 18 వేలకు పైగా కుటుంబాలు రోడ్డున పడ్డాయి. దీనిపై ఇప్పటికే రాష్ట్రంలో అనేక చోట్ల ఆందోళన చేస్తున్న ఎండీయూల యూనియన్ సభ్యులు, మళ్లీ తమను ఆదుకోవాలంటూ జగన్‌కు విజ్ఞప్తి చేశారు.

ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలను మోసం చేశారు

ఆర్జేడీ, కాంగ్రెస్‌పై మోదీ విమర్శలు

కరకట్ (బీహార్): కాంగ్రెస్, ఆర్జేడీలు సామాజిక న్యాయం పేరుతో బీహార్‌లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాల ప్రజలను మోసం చేశాయని...అలాంటి వారు రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ అధికారం చేజిక్కించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని ప్రధాని నరేంద్ర మోదీ విమర్శించారు. రోహ్తాస్ జిల్లాలో కరకట్‌లో శుక్రవారం జరిగిన బహిరంగ సభలో ప్రధాని ప్రసంగిస్తూ... ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్, ఆయన కుటుంబం రాష్ట్రాన్ని పాలించినప్పుడు ప్రజల భూముల్ని లాగేసుకున్నారని ఆరోపించారు. ఆర్జేడీ అధినేత లాలు ప్రసాద్ ఆయన కుటుంబం పేద ప్రజల నుండి భూమిని లాక్కున్నారు. వారు ఎప్పుడూ పేదల అభ్యున్నతి గురించి ఆలోచించలేదన్నారు. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ఎంతోచేశారని... వికసిత్ బీహార్ లేకుండా వికసిత్ ఇండియాను మనం ఊహించలేమన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయంపై మోదీ మాట్లాడుతూ... భారత సాయుధ దళాల సైనికులు సరిహద్దు వెంబడి ఉగ్రవాద

స్థావరాలను ధ్వంసం చేశారని... సాయుధ దళాలకు సెల్యూట్ చేస్తున్నానన్నారు. ఉగ్రవాదంపై భారతదేశం చేస్తున్న పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

వివిధ ప్రాజెక్టుల ప్రారంభం

తొలుత కరకట్‌లో రూ.48,520 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధాని ప్రారంభించారు. ఎన్‌హెచ్ 22లోని పట్నా-గయా-దోభి సెక్షన్‌ను నాలుగు లేన్లుగా మార్చడం, ఎన్‌హెచ్-27లోని గోపాల్‌గంజ్ టౌన్‌లో దాదాపు రూ.5,520 కోట్ల విలువైన ఎలివేటెడ్ హైవే... గ్రేడ్ మెరుగుదలను మోదీ ప్రారంభించారు. వీటితోపాటు, సోన్ నగర్- మహ్మద్ గంజ్ మధ్య రూ.1,330 కోట్లతో నిర్మించిన మూడో రైలు మార్గాన్ని జాతికి అంకితం చేశారు. ఔరంగాబాద్ జిల్లాలో ఏర్పాటు చేసిన రూ.29,930 కోట్లకు పైగా విలువైన నబీనగర్ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ స్టేజ్-2 కు ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. ఇంకా, ఈ ప్రాంతంలో రోడ్డు మౌలిక సదుపాయాలు, కనెక్టివిటీని బలోపేతం చేస్తూ, ప్రధానమంత్రి వివిధ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు.

ప్రధానితో క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ కుటుంబం భేటీ

ఐపీఎల్ లో సంచలన ఇన్నింగ్స్ లతో ఈ 14 ఏళ్ల చిచ్చరపిడుగు వైభవ్ సూర్య వంశీ శుక్రవారం పట్నా ఎయిర్ పోర్టులో తన కుటుంబ సభ్యులతో వెళ్లి ప్రధాని నరేంద్ర మోదీని కలిశాడు. ఈ విష యాన్ని మోదీ తన ఎక్స్ ఖాతా ద్వారా వెల్లడించారు. "పాట్నా విమానాశ్రయంలో యువ క్రికెట్ సంచలనం వైభవ్ సూర్యవంశీని, అతడి కుటుంబ సభ్యులను కలవడం జరిగింది. ఈ యువ క్రీడాకారుడి ప్రతిభ నిజంగా అద్భుతం. వైభవ్‌తో మాట్లాడినప్పుడు, అతడి కళ్ళల్లో క్రికెట్ పట్ల ఉన్న తపన, ఏదో సాధించాలనే పట్టుదల స్పష్టంగా కనిపించాయి. ఇలాంటి యువ ప్రతిభావంతులే మన దేశానికి గర్వకారణం. అతడి కుటుంబ సభ్యులు కూడా ఎంతో ప్రోత్సాహాన్ని అందిస్తున్నారని అర్థమైంది" అని రాసుకొచ్చారు. వైభవ్ సూర్యవంశీ భవిష్యత్ ప్రయత్నాలన్నీ విజయవంతం కావాలని, దేశానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు.

సైనికుల్ని అవమానిస్తే పట్టించుకోరా?

ఆ ఇద్దరు బీజేపీ మంత్రులపై తక్షణమే చర్యలు తీసుకోవాలి

ముర్ముకు మాజీ సైన్యాధికారులు సహా 100 మంది బహిరంగ లేఖ

న్యూదిల్లీ: దేశ రక్షణలో నిమగ్నమైన సాయుధ భద్రతా సిబ్బందిని అవమానిస్తే పట్టించుకోరా? మంత్రులుగా ఉండి సైనికులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే చర్యలు తీసుకోరా? అంటూ మాజీ సైన్యాధికారులు ప్రశ్నించారు. కేంద్రం తీరును ఆక్షేపించారు. సాయుధ దళాల సుప్రీం కమాండర్ హోదాలో సైనికులను అవమానించిన వారిపై చర్యలు తీసుకునేలా చొరవ చూపాలని కోరుతూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సుమారు 100 మంది ప్రముఖులు బహిరంగ లేఖ రాశారు. సైనికుల ఆత్మగౌరవానికి, ప్రతిష్ఠకు భంగం వాటిల్లకుండా చూడాలని కోరారు. భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలను అడ్డుపెట్టుకొని సైనిక అధికారులపై బీజేపీ నాయకులు, మధ్యప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి జగదీశ్ దేవ్డా, ఆ రాష్ట్ర మంత్రి విజయ్ షా అనుచిత వ్యాఖ్యలు చేయడం, అవమానించడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇలాంటి చర్యలను ఖండించడం, ప్రశ్నించడం మానేసి సమర్థించడం ఏమిటని బీజేపీ సీనియర్ నాయకులు, వారి అనుచరుల తీరునుద్దేశించి అన్నారు. కల్నల్ సోఫియా ఖురేషికి, సాయుధ దళాలకు సంఘీభావం ప్రకటించారు. దేశ భద్రతకు నిబద్ధతతో పనిచేస్తున్న వారికి కనీస మర్యాద ఇవ్వలేని పరిస్థితి దేశంలో ఉండటం ఆందోళనకరమన్నారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) ప్రకారం బీజేపీ మంత్రులు ఇద్దరిపై కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆ ఇద్దరిని రాష్ట్ర కేబినెట్ నుంచి మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి తొలగించాలన్నారు. వారి వ్యాఖ్యలను బీజేపీ అధిష్ఠానం బహిరంగంగా ఖండించాలని, ఆ ఇద్దరిపై పార్టీపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో ఇలాంటివి పునరావృతం కాకుండా, సాయుధ దళాలను ఎవరూ అవమానించేందుకు వీలు లేకుండా సుప్రీం కమాండర్ హోదాలో ముర్ము తగు విధంగా చర్యలు తీసుకోవాలని లేఖలో కోరారు. లేఖ రాసిన ప్రముఖుల్లో రిటైర్డ్ అడ్మిరల్ రామదాస్ భార్య లలిత, నావికా దళం మాజీ అధికారి విష్ణు భగవత్, రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ (నేవీ) విజయ్ ఓబరాయ్, రిటైర్డ్ వైస్ అడ్మిరల్ సంజయ్ మిశ్రా, మేజర్ ఎంజీ దేవసహాయం, మాజీ ఐఏఎస్ ఈఏఎస్ శర్మ తదితరులు ఉన్నారు. సాయుధ దళాల మనోధైర్యాన్ని దెబ్బతీసేలా ప్రవర్తించిన ఆ ఇద్దరు మంత్రుల ప్రకటనలను తీవ్రంగా ఆక్షేపిస్తున్నట్లు వారంతా పేర్కొన్నారు.

ఆ పని చేయనందుకే... దారుణ హత్య

అంకితా భండారీ కేసులో ఎన్నో మలుపులు

దెహ్రాడూన్: సంచలనం సృష్టించిన అంకితా భండారీ కేసులో ఎన్నో మలుపులు... దాదాపు మూడేళ్ల తర్వాత గానీ ఆ యువతి కుటుంబానికి న్యాయం జరిగింది. అయితే ఈ మధ్య కాలంలో పోలీసుల అలసత్వం, రాజకీయ పలుకుబడి కేసుపై తీవ్ర ప్రభావమే చూపాయి. అయితే స్థానికులు ఆందోళనకు దిగడంతో కేసు కొలిక్కి వచ్చి... దోషులకు శిక్షపడింది. రిసార్ట్‌కు వచ్చే అతిథుల కోసం వ్యభిచారం చేయడానికి నిరాకరించినందుకు ఆమెను దారుణంగా హత్య చేశారు. కేసు వివరాలను పరిశీలించినట్లయితే... ఉత్తరాఖండ్‌లో పౌడీ గఢ్వాల్ జిల్లా డోబ్-శ్రీకోట్ గ్రామానికి చెందిన 19 ఏళ్ల అంకితా భండారీ 2022 ఆగస్టులో రిషికేశ్ సమీపంలోని ఒక రిసార్ట్‌లో రిసెప్షనిస్ట్‌గా చేరింది. ఆ రిసార్ట్‌ను అప్పటి బీజేపీ సీనియర్ నేత వినోద్‌ఆర్య కుమారుడు పులకిత్ ఆర్య నడుపుతున్నాడు. అక్కడ చేరిన నెల రోజులకే ఆమె కనిపించకుండా పోయింది. రిసార్ట్‌కు వచ్చే అతిథుల కోసం వ్యభిచారం చేయడానికి నిరాకరించడంతో పులకిత్‌తో పాటు ఇద్దరు సిబ్బంది సౌరభ్ భాస్కర్, అంకిత్ గుప్తా ఆమెపై తీవ్ర ఒత్తిడి తెచ్చారు. అది చివరకు ఘర్షణకు దారి తీసింది. తర్వాత ఆమెను ఒక



వాహనంలోకి బలవంతంగా ఎక్కించి... రిషికేశ్ సమీపంలోని చిల్లా కాలువలో పడేశారు. తర్వాత ఏమీ తెలియనట్లు రిసార్ట్‌కు వచ్చేశారు. అంకిత స్నేహితుడు పుష్ప్ వల్లే ఈ ఘోరమంతా బయటపడింది. మరణానికి కొన్ని గంటల ముందు అంకిత అతడితో మాట్లాడింది. వారు చేసిన ఒత్తిడి గురించి చెప్పింది. అదే రోజు రాత్రి ఆమెకు ఫోన్ చేయగా... స్విచ్ఛాఫ్ అని వచ్చింది. తర్వాత ఆర్య, ఇతర సిబ్బందికి ఆమె గురించి వాకబు చేయగా.. ఒక్కొక్కరు ఒక్కోలా సమాధానం చెప్పారు. తెల్లవారి నుంచి ఆర్య ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ అయింది. దాంతో ఆ స్నేహితుడిలో అనుమానం మొదలైంది. ఆ వెంటనే పుష్ప్, ఆమె కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. అయితే అంకితను చంపిన వాడే ఆమె కనిపించకుండా పోయిందని ఫిర్యాదు చేయడం గమనార్హం. ఈ కేసులో దర్యాప్తు నత్తనడకన సాగింది. ఆమె ఆచూకీ గుర్తించాల్సిన పోలీసులు అలసత్వం ప్రదర్శించారు. ఆ రిసార్ట్ ఉన్న ప్రాంతం రెవెన్యూ పోలీస్ ఆఫీసర్ పరిధిలో ఉంటుంది. వారికి సాధారణ పోలీసుల్లా కాకుండా అధికారాలు, దర్యాప్తు పరిధి చాలా తక్కువ. దాంతో ఆమెను గుర్తించడం ఆలస్యమైంది. మృతురాలి కుటుంబం, స్నేహితుల నుంచి ఒత్తిడి రావడంతో మూడు రోజుల తర్వాత కేసును సాధారణ పోలీసులు అప్పగించారు. ఆ ఉదాసీనతను అప్పుడు డీజీపీగా ఉన్న అశోక్ కుమార్ కూడా అంగీకరించారు. ఇక ఆరు రోజులకు గానీ కాలువలో ఆమె మృతదేహాన్ని గుర్తించారు. కాలువలో కొట్టుకుపోవడం వల్లే అంకిత మృతి చెందిందని, లైంగిక దాడి జరగలేదు కానీ... శారీరకంగా హింసించారని పోస్ట్‌మార్టం నివేదికలో తేలింది. దాంతో స్థానికుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. నిందితులను తీసుకెళ్లిన పోలీసు వ్యాన్‌పై దాడి చేసి... వారిని బయటకు లాగేందుకు యత్నించారు. రిసార్ట్‌పైనా దాడి చేశారు. నిందితులను కాపాడుతున్నారంటూ ప్రభుత్వంపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. అయితే ఆ రిసార్ట్‌ను అక్రమంగా నిర్మించారంటూ రాత్రికిరాత్రే దానిపైకి ప్రభుత్వం బుల్డోజర్‌ను పంపి కూల్చివేయించింది. వినోద్ ఆర్యను బీజేపీ బహిష్కరించింది. అయితే నిందితులు ఈ కేసును అంకిత స్నేహితుడు పుష్ప్‌మీదకు మళ్లించే ప్రయత్నాలు చేశారు. అంకిత అంత్యక్రియల సమయంలో అడ్డంకులు సృష్టించారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో కేసు సత్వర విచారణకు సీఎం పుష్కర్ సింగ్ ధామి హామీ ఇవ్వడంతో ఆందోళనలు చల్లారాయి. ఈ కేసులో మే 19న కోర్టులో తుది వాదనలు ముగియగా... 30న తీర్పు వెలువడింది. పులకిత్, సౌరభ్, అంకిత్‌లను న్యాయస్థానం దోషులుగా తేల్చింది. అయితే, వినోద్ ఆర్య మాత్రం తన కుమారుడు ఏ తప్పు చేయలేదని బహిరంగంగానే అనేకమార్లు ప్రకటించారు. తన కుమారుడు అలాంటి నేర స్వభావం కలిగిన వ్యక్తి కాదని సమర్థించుకొచ్చారు. పులకిత్, అంకిత ఇద్దరికీ న్యాయం జరగాలంటూ ఆయన చేస్తున్న వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.